
'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 272

శనివారం 23-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే



సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 272

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'దొంగ' నాటకం..!

'ఫ్యాన్' క్లీన్ స్వీప్ చేసిన 4 ఉమ్మడి జిల్లాలపై టీడీపీ గురి

లక్షలాది ఓట్లు తొలగించాలంటూ బోగస్ ఫారం 7 దరఖాస్తులు



గంపగుత్తగా దాఖలు చేసిన టీడీపీ ఎన్నికల సెల్ కోఆర్డినేటర్ కోనేరు సురేష్

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపు లక్ష్యంగా పావులు

కర్నూలు, వైఎస్సార్, నెల్లూరు, విజయనగరం జిల్లాలు టార్గెట్

80-90 శాతం దరఖాస్తులు బోగస్‌వేనంటూ ఈసీకి కలెక్టర్ల నివేదిక

ఎన్నికల యంత్రాంగం అప్రమత్తతతో ప్రజాస్వామ్యానికి ఊపిరి

2లో

అభిమానులపై 'పంజా'!

'బ్రో'...ఇదేం పద్ధతి అంటూ వాపోతున్న జనసేన కార్యకర్తలు

సీఎం పదవిపై రకరకాలుగా మాట్లాడుతూ గందరగోళానికే పవన్‌కళ్యాణ్ మొగ్గు

- కానీ.. గెలిస్తే చంద్రబాబే సీఎం అని... పవన్ కూడా అంగీకరించారని చెప్పిన లోకేశ్
- ఇందులో సందేహాలకు తావు లేదని, 150 సీట్లకు అభ్యర్థులూ రెడీ అని చెప్పిన చినబాబు
- ఈ విషయంపై ప్రశ్నలకు తప్పించుకునే రీతిలో నాదెండ్ల సమాధానాలు
- మూడో సారి కూడా మోసమేనా.. అంటూ మండి పడుతున్న జనసేన నేతలు
- పవన్! సీఎం పదవిపై ఆశలు వదిలేశావా?.. అంటూ హరిరామజోగయ్య లేఖ
- జనసైనికుల కలలు ఏమవ్వాలంటూ నిలదీత

- వివరాలు 5లో

'జేఎన్ 1'పై జాగ్రత్త



- కరోనా కొత్త వేరియంట్‌పై సీఎం జగన్ సమీక్ష
- వైరస్ కట్టడి చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం
- సచివాలయాలు, విలేజ్‌క్లినిక్‌లను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశం

4లో

'చింతకాయల'కు చెంప దెబ్బలు రాల్తాయ్!

- వాస్తవాలను పట్టించుకోకుండా గాదిరాజు ప్యాలెస్ గురించి అయ్యన్న దిగజారుడు ఆరోపణలు
- కుమారుడి సీటు కోసం చంద్రబాబు మెప్పు పొందడానికి సీఎం కుటుంబంపై దుష్ప్రచారం
- గాదిరాజు ప్యాలెస్ అడిగారనడం అవాస్తవం: గాదిరాజు ప్యాలెస్ అధినేత రామకృష్ణరాజు.. అయ్యన్న ముఖమే చూడలేదని స్పష్టీకరణ

10లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వస్త్ర వ్యాపారంతో నిశ్చింత

మా స్వస్థలం ఒడిశాలోని బరంపురం. నా భర్త ప్రశాంత్‌కుమార్ పండిట్ పౌరోహిత్యం చేస్తారు. మా వివాహం తర్వాత బతుకుదెరువు కోసం ఒడిశా నుంచి విశాఖపట్నం వచ్చాం. పాపయ్యరాజుపాలెంలోని ఎన్ఏడీలేఅవుట్లో పదేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఆదాయం అంతంత మాత్రమే. ఇద్దరు ఆడ పిల్లలకు మా దగ్గర ఉన్న దాంతోపాటు కొంత అప్పులు చేసి పెళ్లిళ్లు చేశాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు ఇస్తామంటే రూ.25 వేలు కట్టాం. కానీ ఇల్లు రాలేదు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్న తరుణంలో 2019లో ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు వైఎస్సార్ చేయూత ద్వారా విడతకు రూ.18,500 చొప్పున అందించింది. గత ప్రభుత్వ హయాంలో కట్టిన రూ.25 వేలు ఈ ప్రభుత్వం వెనక్కి ఇచ్చింది. అంతేకాకుండా జగనన్న చేదోడు పథకంలో రూ.10 వేలు వచ్చింది. మొత్తం నగదు కూడబెట్టుకుని ఇం



ట్లోనే వస్త్రాల అమ్మకం ప్రారంభించాను. ప్రస్తుతం వ్యాపారం చాలా బాగుంది. దీంతో పాటు సబ్బవరం మండలం పైడివాడ వద్ద జగనన్న కాలనీలో స్థలం మంజూరైంది. త్వరలో ఇల్లు కట్టుకుంటాం.

– ప్రసన్న పండిట్, విశాఖపట్నం
(నమ్మంగి భాస్కర్, విలేకరి, పెందుర్తి)

సర్కారు 'దీవెన'తో ఉద్యోగం

మాది అనంతపురం జిల్లా తాడిపత్రి. నాన్న మధుసూదన మృతి చెందారు. అమ్మ నాగలక్ష్మి కుట్టు మిషన్‌పై దుస్తులు కుడుతూ నాతో పాటు తమ్ముడు సాత్విక్‌ను ఇంటర్మీడియట్ చదివిస్తోంది. అమ్మ సంపాదన నెలకు అయిదారు వేలు మాత్రమే. చాలీచాలని సంపాదనతో రూ.3 వేలు ఇంటి అద్దె చెల్లిస్తూ ఇద్దరినీ చదివించడం అమ్మకు తలకు మించిన భారమైంది. మేమూ బెంగపెట్టుకునేవాళ్లం. అయితే కష్టాలకు ఎదురీది పైకి రావాలని పట్టుదల పెరిగింది. బాధలన్నీ పక్కన పెట్టి చదివాను. ఎంసెట్‌లో 10 వేలలోపు ర్యాంకు రావడంతో జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది. కళాశాల ఫీజు ఏటా రూ.70 వేలు. ఇంత పెద్ద కళాశాలలో చదవడం మాలాంటి పేదలకు కష్టమే. ఈ తరుణంలో సీఎం జగన్ తోడబుట్టిన అన్నలా ఆదుకున్నారు. కళాశాల ఫీజు మొత్తాన్ని జగనన్న విద్యాదీవెన పేరుతో అందించడంతో బీటెక్ ఫైనల్ ఇయర్‌కు చేరుకు



న్నాను. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.2.8 లక్షలు విడుదల అయ్యింది. కళాశాలలో జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఆక్సెంచర్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఏడాదికి రూ.4.5 లక్షలు జీతం ఇవ్వనున్నారు. బీటెక్ ఫైనల్ ఇయర్‌లోనే ఉద్యోగం సంపాదించుకోవడం కేవలం జగనన్న అందిస్తున్న ఆర్థిక చేయూత వల్లే సాధ్యమైంది.

– మురారి జ్ఞానసిరి తేజిత, బీటెక్ (ఈసీఈ)
(జి.రాజశేఖర్ నాయుడు, విలేకరి, కర్నూలు)

వైఎస్సార్ బీమాతో ఉపాధి దొరికింది

కుటుంబ పెద్ద మృతితో మా జీవనం దుర్లభంగా మారింది. ఈ స్థితిలో వైఎస్సార్ బీమా మా కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. నా పేరు వేముల సుమన్ బాబు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరు గ్రామం. నాన్న జగ్జీవన్ రావు గొర్రెల కాపరి. ఓ రోజు మా ఊళ్లో ఉన్న కుమ్మరికుంట చెరువులో ఓ గొర్రె పిల్ల పడిపోయింది. దానిని కాపాడేందుకు నాన్న అందులోకి దిగాడు. దానిని బయటకు తీసే క్రమంలో లోతు ఎక్కువగా ఉండడంతో మునిగి చనిపోయాడు. ఆయన ఆకస్మిక మరణం మా కుటుంబానికి తీరని వేదనను మిగిల్చింది. మా అమ్మ, నాన్న నా చిన్నతనంలోనే విడిపోయారు. నా భార్య, నేను, నాన్న కలిసి ఉండేవాళ్లం. నేను వ్యవసాయ పనులు చేస్తూ జీవనం కొనసాగించేవాడిని. నాన్న ప్రమాదవశాత్తు మృతి చెందడంతో వైఎస్సార్ బీమా కోసం సచివాలయ సిబ్బంది నాతో దరఖాస్తు చేయించారు. కేవలం 30 రోజుల వ్యవధిలోనే నా బ్యాంకు ఖాతాలో రూ.4.90 లక్షలు జమైంది.



ది. బీమా సొమ్ము ఇచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నా కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చింది. వ్యవసాయ కూలి పనులు మానేసి నాన్న పేరుతో ఆటో కొనుగోలు చేసుకొని నడుపుకుంటున్నా. చెల్లికి కొంత డబ్బులు సర్దుబాటు చేశాను. ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగా బతుకుతున్నాం.

– వేముల సుమన్ బాబు, కొమ్మూరు
ధూపాటి ప్రకాష్, విలేకరి, నెహ్రూనగర్ (గుంటూరు)

చేనేత పురిలో చైతన్య భేరి

- ఎమ్మిగనూరులో ఘనంగా వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర
- తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- ప్రజలతో కిక్కిరిసిన పుర వీధులు
- జై జగన్ నినాదాలు, ఈలలు, కేరింతలతో మార్మోగిన సభా ప్రాంగణం
- మళ్లీ జగనే కావాలి అంటూ ప్రజల నినాదాలు

కర్నూలు (రాజ్‌విహార్): చేనేత వస్త్రాలకు మారుపేరైన ఎమ్మిగనూరులో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైనాన్ని వివరిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం పట్టణంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించింది. నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఈ యాత్రలో పాల్గొని, సాధికారతను ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయంనుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్సు యాత్ర సాగిన పురవీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. అనంతరం బస్టాండు వద్ద వేలాది ప్రజలతో భారీ బహిరంగ సభ జరిగింది. యాత్ర మొదలుకొని సభ ముగిసేవరకు పట్టణం జై జగన్ నినాదాలతో మార్మోగింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సీఎం వైఎస్ జగన్ సాధికారత దిశగా నడిపించిన తీరును నేతలు వివరిస్తున్నప్పుడు సభా ప్రాంగణం నినాదాలు, ఈలలు, కేరింతలతో హోరెత్తింది. మళ్లీ జగనే కావాలి అంటూ ప్రజలు



సభలో ఐక్యత చాటుతున్న ప్రజాప్రతినిధులు



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఇది జగనన్న పెంచిన ఆత్మగౌరవం : మంత్రి మేరుగు నాగార్జున

ఈరోజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు తలెత్తుకొని తిరుగుతున్నారంటే అది సీఎం వైఎస్ జగన్ పెంచిన ఆత్మగౌరవమే కారణమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ఎందరో మహానుభావులు కలలుగన్న సామాజిక న్యాయం, సామాజిక సాధికారతను సీఎం జగన్ నిజం చేసి చూపించారని అన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా దళితులు, బలహీనవర్గాలను ఎన్ని అవమానాలకు గురిచేశారో ఎవరూ మరువలేరని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ వర్గాలనే అణిచివేశారని వివరించారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకొని ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిలోకి తెచ్చారని చెప్పారు. సీఎం జగన్ వల్లే నేడు మన బిడ్డలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ చదువులు చదువుతున్నారని తెలిపారు. చంద్రబాబు మాటలు నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కుల మతాలు చూడని నాయకుడు : ఎంపీ గురుమూర్తి

పేదలకు మేలు చయడంలో సీఎం జగన్‌ను మించిన నేత లేరని ఎంపీ గురుమూర్తి చెప్పారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అని తెలిపారు. నాలుగున్నరేళ్లలో రూ. 2.50 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ చేశారన్నారు. అవినీతి రహిత పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, పథకాలను ఇంటివద్దకే అందిస్తున్నారని వివరించారు. ఒకప్పుడు నాయకులు చుట్టూ మనం తిరిగేవాళ్లమని, కానీ ప్రభుత్వ సిబ్బంది మన సేవ కోసం ఇంటి వద్దకే వస్తున్నారని తెలిపారు.

అట్టడుగు వర్గాలకు మేలు: ఎంపీ గోరంట్ల మాధవ్

రాష్ట్రంలో సీఎం జగన్ నేతృత్వంలో అట్టడుగు వర్గాలకు మేలు జరుగుతోందని, వారంతా అభివృద్ధి చెందుతున్నారని ఎంపీ గోరంట్ల మాధవ్ చెప్పారు. చంద్రబాబు బడుగు బలహీన వర్గాలను పావులా వాడుకుని, అధికారంలోకి వచ్చాక అణచివేశారని తెలిపారు. చంద్రబాబుకు ఈ సారి డిపాజిట్లు కూడా రావన్నారు. కనీసం బర్రెలక్కకు వచ్చినన్ని ఓట్లు కూడా రాని పవన్ రాష్ట్రంలో ఏం చేయగలరని ప్రశ్నించారు.

బడుగులకు గుర్తింపు తెచ్చిన సీఎం జగన్: ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో బడుగులకు గుర్తింపు తెచ్చారని ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నుంచి కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేసి, ఆ వర్గాలను తలెత్తుకునేలా చేశారని అన్నారు. చంద్రబాబు పాలనలో ఈ వర్గాలన్నీ అవహేళనకు, అణచివేతకు గురయ్యాయని చెప్పారు. టీడీపీ చేస్తున్న సామాజిక కుట్రకు ఓటుతో సమాధానమివ్వాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పేదల పక్షాన ఉన్న సీఎం జగన్‌ను గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య తదితరులు ప్రసంగించారు.

మండపేటలో మార్మోగిన సాధికార నినాదం



ప్రసంగిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్



అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

- ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- పరిసర నియోజకవర్గాల నుంచి కూడా భారీగా ప్రజలు రాక
- జనసంద్రంలా మండపేట వీధులు
- 2 వేల బైక్‌లతో యువత ర్యాలీ
- జై జగన్ అంటూ ప్రజల నినాదాలు

సాక్షి, అమలాపురం: మండపేట నియోజకవర్గంలో సామాజిక సాధికార నినాదం మార్మోగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలు సాధించిన సాధికారతను శుక్రవారం నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రతిబింబించింది. మండపేటతో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి కూడా ఈ యాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. దీంతో మండపేట వీధులన్నీ జనసంద్రాలే అయ్యాయి. రెండు వేల ద్విచక్ర వాహనాలతో యువత ర్యాలీ చేశారు. తాపేశ్వరంలో ప్రారంభమైన యాత్ర మండపేటలోని కలువపువ్వు సెంటర్‌లోని సభా ప్రాంగణం వరకు దిగ్విజయంగా సాగింది. యాత్ర పొడవునా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వారికి సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తూ సాగారు. ప్రజలు వారికి పూలు, హారతులతో స్వాగతం పలికారు. వేలాదిగా ప్రజలు పాల్గొన్న సభలో నేతలు సీఎం జగన్ అందిస్తున్న పథకాలు, ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. సీఎం జగన్ పేరు వచ్చిన ప్రతిసారీ సభలోని ప్రజలు పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమైంది: మంత్రి జోగి రమేష్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమైందని మంత్రి జోగి రమేష్ అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలో ఇంతవరకు ఏ రాష్ట్రంలోనూ ఏ ముఖ్యమంత్రీ ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ చేసినంత మేలు చేయలేదని తెలిపారు. ఈరోజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తలెత్తుకొని తిరగగలుగుతున్నారంటే, అది సీఎం జగన్ అందించిన చేయూత ఫలితమేనని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు నిజమైన రాజ్యాధికారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే అందించారు. 25 మంది మంత్రులు ఉంటే వారిలో 15 మంది బీసీలేనని, 9 మంది రాజ్యసభ సభ్యుల్లో నలుగురు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీలకే ఇచ్చారని వివరించారు.

చరిత్ర సృష్టించిన జగన్: ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్రంలో 30.65 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి చరిత్ర సృష్టించారని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ చెప్పారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో యూపీలో పేదలకు, బడుగు, బలహీన, దళిత వర్గాలకు ఇళ్ల స్థలాలు పంపిణీ ప్రారంభించారని, ఇప్పటివరకు ఇచ్చింది 20 లక్షల మందికి మాత్రమేనని తెలిపారు. అణగారిన వర్గాలకు గౌరవం అనేది విద్యతో వస్తుందని గుర్తించిన సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారని అన్నారు. పేదలకు అత్యంత ఆధునిక వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మనందరం మరోసారి సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

పేదల ఆత్మబంధువు సీఎం జగన్: జూపూడి ప్రభాకరరావు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆత్మబంధువు అని మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు చెప్పారు. పేదలకు అన్ని విధాలుగా అండదండగా ఉంటూ, బడుగుల కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకొనేలా పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అంటే భూస్వామి కాదు.. పెట్టుబడిదారు కాదు.. ప్రభుత్వం అంటే ప్రజలదే అని నిరూపించిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. రాష్ట్రంలో 72 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, 52 శాతం మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పదవులు ఇచ్చారని తెలిపారు. ఓటు వేయనివారికి సైతం పథకాలు అందించిన ఘనత జగన్‌కు దక్కుతోందన్నారు.

మహిళా సాధికారిత జగన్‌తోనే: ఎంపీ చింతా అనూరాధ

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో మహిళా సాధికారత సాధ్యమైందని ఎంపీ చింతా అనూరాధ చెప్పారు. చట్ట సభలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెచ్చిందని, సీఎం జగన్ స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి మించి మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధికంగా లబ్ధిపొందారని తెలిపారు.

క్రైస్తవ ఆస్తులను కొల్లగొట్టింది తెలుగు తమ్ముళ్లే బాబూ!

- గుంటూరు, విజయవాడ వస్తే నిరూపిస్తాం
- దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత జగన్‌ది: మంత్రి మేరుగు



కర్నూలు (సెంట్రల్): రాష్ట్రంలో క్రైస్తవ మిషనరీ ఆస్తులను కొల్లగొట్టింది, అమ్ముకున్నది టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన అనుచరులేనని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. చంద్రబాబు తమతో గుంటూరు, విజయవాడ వస్తే నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన ఎక్కడకు రమ్మంటే అక్కడికి వచ్చి టీడీపీ నాయకులు ఆక్రమించిన క్రైస్తవ ఆస్తుల వివరాలు ఇస్తామని, దీనిపై బహిరంగ చర్చకు రావాలని మంత్రి సవాల్ విసిరారు. శుక్రవారం కర్నూలులో ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో చంద్రబాబు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత సీఎం జగన్‌దని చెప్పారు. అమరావతిలో దళితుల అసైన్‌మెంట్ భూములను చంద్రబాబు భయపెట్టి బలవంతంగా గుంజుకున్నాడన్నారు. రేపల్లెలో 400 దళిత కుటుంబాలను వెలివేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. చివరికి దళిత కుటుంబాల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని చెప్పి అవమానించిన వ్యక్తి ఆయన కాదా... అని ప్రశ్నించారు. దళితుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ దళితులపై అక్రమ కేసులు ఎత్తివేస్తే బాబుకు భయమెందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు యాట ఓబులేసు, సత్తిరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'దొంగ' నాటకం!

'ఫ్యాన్' క్లీన్ స్వీప్ చేసిన 4 ఉమ్మడి జిల్లాలపై టీడీపీ గురి

సాక్షి, అమరావతి: ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించడంతో విపక్షం దొంగ నాటకానికి తెర పడింది! వచ్చే ఎన్నికల్లోనూ 2019కి మించి ఘోర పరాజయం తప్పదని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓటర్ల జాబితాలో అక్రమాలకు తెగబడుతున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసిన ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ కడప, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో లక్షల సంఖ్యలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నారు. ఈ నాలుగు జిల్లాల్లో లక్షలాది మంది అధికార పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కోనేరు సురేష్ తప్పుడు సమాచారంతో గంపగుత్తగా ఫారం 7 దరఖాస్తులను ఎన్నికల సంఘానికి సమర్పించడం గమనార్హం. మిగతా తొమ్మిది ఉమ్మడి జిల్లాలతో పోలిస్తే ఈ నాలుగు జిల్లాల్లో దాదాపు మూడింతలు అధికంగా నకిలీ దరఖాస్తులు అందాయి. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన జిల్లా కలెక్టర్లు వీటిల్లో 80 నుంచి 90 శాతం వరకు బోగస్ దరఖాస్తులేనని ఎన్నికల సంఘానికి నివేదిక ఇచ్చారు. తప్పుడు సమాచారం ఇచ్చిన కోనేరు సురేష్‌పై ఐపీసీ సెక్షన్ 182, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల బృందానికి మరోసారి ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది.

నాడు సేవామిత్ర.. నేడు మైపార్టీ డ్యాష్ బోర్డ్

గతంలో సేవామిత్ర యాప్ తరహాలోనే తాజాగా మైపార్టీ డ్యాష్ బోర్డ్ డాట్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా



ఓటర్ల వ్యక్తిగత వివరాలను సేకరించిన టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల మందికిపైగా ఓటర్లను తొలగించేందుకు ఫారం 7 దరఖాస్తులను గంపగుత్తగా సమర్పించింది. వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్న వారిని బతికున్నా చనిపోయినట్లుగా చిత్రీకరించడంతోపాటు అర్హులైన ఓటర్లను నకిలీలుగా, స్థానికంగా నివాసం ఉంటున్నా శాశ్వతంగా వలస వెళ్లినట్లు పేర్కొంటూ వీటిని దాఖలు చేసింది. మరికొందరిని రెండు ప్రదేశాల్లో రెండు ఓట్లు ఉన్నట్లు తప్పుడు సమాచారం సమర్పించి జాబితా నుంచి తొలగించే వ్యూహం రచించింది. కుప్పలు తెప్పలుగా అందిన ఫారం 7 దరఖాస్తుల్లో 70 నుంచి 80 శాతం తప్పుడువేనని తేల్చుతూ ఎన్నికల సంఘానికి కలెక్టర్లు నివేదిక ఇచ్చారు. గత ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, నెల్లూరు, విజయనగరం జిల్లాల పరిధిలో శాసనసభ, లోక్‌సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. టీడీపీ అక్కడ కనీసం ఉనికి కూడా చాటుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు జిల్లాలపై ప్రత్యేకంగా గురి పెట్టి అధికార పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు టీడీపీ బోగస్ దరఖాస్తులను సమర్పిస్తోంది.

కర్నూలులో 88 శాతం బోగస్

- కర్నూలు, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజక వర్గాల్లో 67,370 ఓట్లు తొలగించాలంటూ గంపగుత్తగా ఫారం 7 దరఖాస్తులను టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కోనేరు సురేష్ ఎన్నికల సంఘానికి అందజేశాడు. వీటిలో అత్యధికంగా కోడుమూరులో 17,576, ఆదోనిలో 13,968, ఆలూరులో 11,581 బోగస్ దరఖాస్తులున్నాయి.
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కలెక్టర్ వీటిపై బీఎల్వోలు, డిప్యూటీ తహసిల్దార్లు, తహసిల్దార్లతో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించగా 59,054 ఫారం 7లు బోగస్ అని తేలింది. అంటే 88 శాతం తప్పుడు ఫారం 7లు సమర్పించినట్లు స్పష్టమవుతోంది. 11,935 మంది బతికే ఉన్నా వారు చనిపోయినట్లుగా చిత్రీకరించి వారి ఓటు హక్కును కాలరాసేందుకు టీడీపీ కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది.

నెల్లూరులో సింహభాగం నకిలీ

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో 11,291 ఓట్లు తొలగించాలంటూ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోనేరు సురేష్‌తో కలిసి ఫారం 7 దరఖాస్తులు సమర్పించారు. వాటిలో 85 శాతానికి పైగా బోగస్ అని అధికారుల విచారణలో వెల్లడైంది. జిల్లాలోని మిగతా ఆరు నియోజకవర్గాల్లోనూ ఇదే కథ.

అన్నమయ్య.. అక్రమ మార్గంలో

- అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, కోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన 40,358 మంది ఓట్లు తొలగించాలంటూ కోనేరు సురేష్ గంపగుత్తగా ఫారం 7 దరఖాస్తులను ఎన్నికల సంఘానికి అందచేశాడు.
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ 25,097 దరఖాస్తులు నకిలీవని నిర్ధారించారు. అక్కడ ఆరు నియోజకవర్గాల్లో 8,355 మంది బతికే ఉన్నా చనిపోయినట్లుగా చిత్రీకరించి టీడీపీ తప్పుడు దరఖాస్తులు సమర్పించినట్లు బహిర్గతమైంది.

విజయనగరం 4 నియోజకవర్గాల్లో

- విజయనగరం జిల్లాలో రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన 19,407 మంది ఓట్లు తొలగించాలని కోనేరు సురేష్ గంపగుత్తగా ఫారం 7లను ఎన్నికల సంఘానికి సమర్పించాడు.
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన విజయనగరం జిల్లా కలెక్టర్ 8,318 ఫారం 7లు తప్పుడువని తేల్చుతూ నివేదిక ఇచ్చారు.

విజయవాడ డివిజన్‌కు జీఎం ఓవరాల్ ఎఫిషియన్సీ షీల్డ్



అవార్డుతో డీఆర్ఎం నరేంద్ర పాటిల్, అధికారులు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ 2022–23 ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో అత్యుత్తమ పనితీరుకు గానూ సికింద్రాబాద్ డివిజన్‌తో కలసి సంయుక్తంగా ప్రతిష్టాత్మకమైన 'జనరల్ మేనేజర్ ఓవరాల్ ఎఫిషియన్సీ షీల్డ్'ను అందుకుంది. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లో జరిగిన 68వ రైల్వే వీక్ జోనల్ ఫంక్షన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ షీల్డ్‌ను అందుకున్నారు డివిజన్‌లో అంకితభావంతో విధులు నిర్వర్తించిన ఒక అధికారితో పాటు 11 మంది ఉద్యోగులకు ప్రతిష్టాత్మకమైన 'విశిష్ట రైల్ సేవా పురస్కార్–2023' పురస్కారాలు అందుకున్నారు. డీఆర్ఎం నరేంద్ర మాట్లాడుతూ ప్రతిష్టాత్మక అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ డీసీఎం రాంబాబు, సీనియర్ డీఎఫ్ఎం రామకృష్ణ, సీనియర్ డీఈఈ ఎస్.మునిరెడ్డి, సీనియర్ డీఈఎన్ వరుణ్‌బాబు పాల్గొన్నారు.

హైకోర్టులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్‌లు కట్ చేస్తున్న న్యాయమూర్తులు

సాక్షి, అమరావతి: సెమీ క్రిస్మస్ వేడుకలు హైకోర్టులో శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ రావు రఘునందన్ రావు, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జస్టిస్ కుంభజడల మన్మథరావు, జస్టిస్ మండవ కిర్మణయి, జస్టిస్ జగడం సుమతి పాల్గొన్నారు. వారంతా క్రిస్మస్ కేకులు కట్ చేశారు. సీజే మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం చూస్తుంటే తనకు కాన్వెంట్ రోజులు గుర్తుకొచ్చాయన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు పీఎస్‌పీ సురేష్, ప్రధాన కార్యదర్శి వి.సాయికుమార్‌తోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు వెలుపల కొంతమంది న్యాయవాదులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లోనూ సీజే, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

సంద్రంలో 'విండ్ పవర్'

- ఆఫ్ షోర్ విండ్ ఎనర్జీ లీజ్ రూల్స్- 2023 ప్రకటించిన కేంద్రం
- సముద్రంలో సర్వే కోసం మూడేళ్ల గడువు ఐదేళ్లకు పెంపు
- ప్రాజెక్టుల లీజు వ్యవధి 35 ఏళ్లుగా నిర్ణయం..మెగావాట్‌కు రూ.1లక్ష సెక్యూరిటీ డిపాజిట్
- దేశ, విదేశాల్లో విస్తరిస్తున్న ఆఫ్‌షోర్ విండ్ పవర్ ప్లాంట్స్
- రాష్ట్రంలో పెరుగుతున్న పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి



సాక్షి, అమరావతి: పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే సహజ ఇంధన వనరులను వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు, వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించాలనేది వాటన్నిటి లక్ష్యం. ఈ క్రమంలోనే పునరుత్పాదక ఇంధన విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత పెరుగుతోంది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సాధించాలని దేశం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో సముద్రంలో ఏర్పాటు చేసే పవన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఆఫ్ షోర్ విండ్ ఎనర్జీ లీజ్ రూల్స్-2023ను తాజాగా ప్రకటించింది. సముద్రంలో విండ్ ప్రాజెక్టుకు అనుకూలంగా ఉండే చోటు కోసం జరిగే సర్వేకు మూడేళ్లు ఉన్న గడువును ఐదేళ్లకు పెంచింది. అలాగే ప్రాజెక్టుల లీజు వ్యవధి 35 ఏళ్లుగా నిర్ణయించింది. ప్రాజెక్టు నిర్వాహకులు మెగావాట్‌కు రూ.1లక్ష సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలని చెప్పింది. అయితే ఇది రిఫండబుల్ అని స్పష్టం చేసింది.

థర్మల్ కంటే ఖర్చు తక్కువ

పవన శక్తి సామర్థ్యం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతూనే ఉంది. గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ నివేదిక ప్రకారం.. ప్రపంచ పవన విద్యుత్ పరిశ్రమ సామర్థ్యం 837 గిగావాట్లకి చేరింది. ఇది ఏటా 1.2 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించడంలో సహాయపడుతోంది. గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ (జీడబ్ల్యూసీ) విశ్లేషణ ప్రకారం.. విండ్ పవర్ వృద్ధి రేటు వచ్చే దశాబ్దంలో 15 శాతానికి పెరగాలి. ఇందుకోసం పవన విద్యుత్ ప్లాంట్ల స్థాపన పెరగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో దేశంలోని సముద్రంలో 2026 నాటికి దాదాపు 20 గిగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్లను స్థాపించే ప్రయత్నం జరుగుతోంది. భూమి మీద కంటే సముద్రంలో గాలి వేగం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆఫ్‌షోర్ విండ్ పవర్ ప్లాంట్లతో అధికంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి అయ్యే ఖర్చు కంటే తక్కువకే పవన విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పవచ్చు. ఈ విద్యుత్ విక్రయానికి ఓపెన్ యాక్సెస్, ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ఛార్జీల మినహాయింపు వంటి ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి.

రాష్ట్రంలో సముద్రం అనుకూలం

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 8,998.323 మెగావాట్లకు చేరుకుంది. ఇందులో పవన విద్యుత్ 4,083.37 మెగావాట్లుగా ఉంది. గతేడాది దేశవ్యాప్తంగా 8 శాతం పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే మన రాష్ట్రంలో 9.8 శాతం పెరిగింది. అంటే జాతీయ స్థాయిలో వృద్ధి కంటే 1.8 శాతం ఎక్కువగా ఏపీలో పవన విద్యుత్ ఉత్పత్తి పెరుగుదలను నమోదు చేసుకుంది. ప్రభుత్వ చర్యలకు వాతావరణంలో వస్తున్న మార్పులు తోడవ్వడంతో ఏపీలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయొరాలజీ (పుణె)కి చెందిన పరిశోధకులు తమ అధ్యయనంలో వెల్లడించారు. అంతేకాదు రాష్ట్రంలోని సముద్ర ప్రాంతాల్లో గాలి సామర్థ్యం పెరుగుతున్నట్లు 'కపుల్డ్ మోడల్ ఇంటర్-కంపారిజన్ ప్రాజెక్ట్' (సీఎంఐపీ) ప్రయోగాల్లో తేలింది.





సీమ సిగలో 'సెంచురీ'

వాణిజ్య ఉత్పత్తికి సిద్ధమైన బద్వేల్ సెంచురీ ప్యానల్స్

- నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- రూ.1,000 కోట్లతో యూనిట్ ఏర్పాటు
- 2,266 మందికి ప్రత్యక్షంగా లభించనున్న ఉపాధి
- 25 వేల రైతు కుటుంబాలకు లబ్ధి
- 80 వేల ఎకరాల్లో జామాయిల్ చెట్ల పెంపకానికి ప్రోత్సాహకం
- ఇప్పటికే సబ్సిడీ ధరకు 50 లక్షల విత్తన మొక్కల పంపిణీ
- ఈ యూనిట్‌కు అనుబంధంగా నాయుడుపేటలో రీసిన్ తయారీ యూనిట్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో పేరున్న కంపెనీలు రాష్ట్రంలో తమ యూనిట్లను ఏర్పాటు చేసి ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ కోవలో రాయలసీమ యువత, రైతులకు ప్రయోజనం చేకూరే మరో భారీ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. ప్లై ఉడ్ ప్యానల్స్ తయారీలో అగ్రగామి సంస్థగా పేరున్న సెంచురీ ప్యానల్స్ వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధమైంది. వైఎస్సార్ జిల్లా బద్వేల్ వద్ద గోపవరం పారిశ్రామిక పార్కులో రూ.1,000 కోట్ల పెట్టుబడితో 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సెంచురీ ప్యానల్స్‌ను శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 2,266 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. అలాగే అంతకు రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉపాధి కల్పిస్తోంది. సెంచురీ ప్యానల్స్‌కు డిసెంబర్ 23, 2021న సీఎం వైఎస్ జగన్ భూమి పూజ చేశారు. వెనుకబడిన ప్రాంతంలో ఒక భారీ పరిశ్రమ ఏర్పాటు అవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులను కల్పించింది. అంతేకాకుండా అనుమతులను వేగంగా మంజూరు చేసింది. దీంతో రెండేళ్లలోనే సెంచురీ ప్యానెల్స్ ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధమైంది. కలప ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి మొత్తం 490 ఎకరాల్లో గోపవరం వద్ద ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేసింది. ఇందులో యాంకర్ యూనిట్‌గా సెంచురీ ప్యానల్స్‌కు 100 ఎకరాలను 33 ఏళ్ల లీజుకు కేటాయించారు.

రైతులకు ప్రయోజనం

సెంచురీ ప్యానల్స్‌లో హై ప్రెజర్ లామినేట్స్ (హెచ్‌పీఎల్) మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్స్ (ఎండీఎఫ్) తయారవుతాయి. రోజుకు 950 టన్నుల సామర్థ్యం గల ఎండీఎఫ్‌లను తయారు చేస్తారు. ఇందుకోసం భారీ సంఖ్యలో కలప అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో 150 కి.మీ పరిధిలోని వైఎస్సార్, అన్నమయ్య, నంద్యాల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతుల నుంచి యూకలిప్టస్‌ను సేకరించనుంది. ఇందుకోసం సుమారు 80,000 ఎకరాల్లో యూకలిప్టస్ పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు సెంచురీ ప్యానల్స్ జనరల్ మేనేజర్ రమేష్ కుమార్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా యూకలిప్టస్‌ను కొనుగోలు చేస్తామన్నారు. దీనివల్ల సుమారు 25,000 రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం దక్కుతుందని చెప్పారు. ఇప్పటికే రైతులకు 50 లక్షల విత్తన మొక్కలను సబ్సిడీ ధరలకు అందించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఉద్యోగ నియామకాల్లో 80 శాతం మంది స్థానిక యువతనే తీసుకుంటున్నామన్నారు. తొలుత గోపవరం, బద్వేలు మండలాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆ తర్వాత వైఎస్సార్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ఈ యూనిట్‌కు అవసరమైన ముడి సరుకును అందించే రీసిన్ తయారీ యూనిట్‌ను నాయుడుపేట వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇ ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



బాగా వెనుకబడిన ప్రాంతమైన బద్వేల్‌లో యూనిట్ ఏర్పాటుకు సెంచురీ ప్యానల్స్ ముందుకు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి 0.07 టీఎంసీల నీటిని కేటాయించడంతోపాటు 132 కేవీ విద్యుత్ సరఫరా, రహదారులు నిర్మాణం వంటి మౌలిక వసతులను కల్పించాం. పరిశ్రమలకు ఇచ్చే రాయితీ, సబ్సిడీపై విద్యుత్ ఇచ్చాం.

– ఎస్.యువరాజ్, కార్యదర్శి, పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖ

సొంతూరులోనే ఉపాధి లభించింది..



2018లో ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేశాను. అప్పటి నుంచి ఉపాధి కోసం బయటి నగరాలకు వెళ్లలేక ఊర్లోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నా. ఇప్పుడు గోపవరంలో సెంచురీ ప్యానల్స్ ఏర్పాటుతో నాలాంటి ఎంతోమందికి స్థానికంగానే ఉపాధి లభించింది. సొంత ఊరిలో ఉద్యోగం చేస్తానని కలలో కూడా ఊహించలేదు. సీఎం వైఎస్ జగన్ వల్లే నాకు ఉద్యోగం వచ్చింది.

– కాశ్ల రాజేష్, బుచ్చనపల్లె, గోపవరం మండలం, వైఎస్సార్ జిల్లా

ఇక ఉద్యోగం రాదనుకున్నా..



ఐటీఐ ఎలక్ట్రికల్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఐదేళ్లపాటు ఎదురు చూశాను. ఇక ఉద్యోగం రాదనుకున్నా. సెంచురీ ప్యానెల్స్ ఏర్పాటుతో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వడంతో నన్ను ఉద్యోగం వెతుక్కుంటూ వచ్చింది. దీంతో మా కుటుంబం ఆనందానికి అవధులు లేవు.


– గుడి మెగురయ్య, కలసపాడు, వైఎస్సార్ జిల్లా

నిరుద్యోగులకు ఉద్యోగాలు.. రైతులకు మేలు..




సెంచురీ ప్యానెల్స్‌కు అవసరమయ్యే రా మెటీరియల్ కోసం జామాయిల్ చెట్లు సాగు చేసుకునేందుకు పరిశ్రమ వారు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఎలాంటి రవాణా ఖర్చు లేకుండా మొక్కలను సబ్సిడీ ద్వారా నేరుగా రైతు పొలాల వద్దకే తెచ్చిస్తామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా కనీస మద్దతు ధరకు వారే కొనుగోలు చేస్తామన్నారు. జామాయిల్ సాగుపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించారు.

– రూకల దేవదాసు, గోపవరం ప్రాజెక్టు కాలనీ, గోపవరం మండలం, వైఎస్సార్ జిల్లా



విదేశాల్లో ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

యూఏఈ, సింగపూర్, కువైట్, ఖతార్ దేశాల్లో పలు సేవాకార్యక్రమాలు


సింగపూర్‌లో...


యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో...

సాక్షి, అమరావతి/పులివెందుల రూరల్/సింహాద్రిపురం/కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు యూఏఈ, సింగపూర్, కువైట్, ఖతార్ దేశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలను నేతలు కొనియాడారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశంలో వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ కమిటీ సలహాదారు ప్రసన్న సోమిరెడ్డి, వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన మహమ్మద్ జిలాన్‌బాషా, తరపట్ల మోహన్, రెడ్డయ్యరెడ్డి, శ్రీనివాస్, చౌదరి, సయ్యద్, నాజర్, చిల్లే తాతాజీ, పాస్టర్ యోహాన్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వందలాది మంది ఈ వేడుకల్లో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. అన్నదానం, దుస్తుల పంపిణీతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, ఎన్‌ఆర్‌ఐలు మహమ్మద్ జిలాన్ బాషా, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 150మంది ప్రవాసాంధ్రులకు ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ బీమా పథకానికి ఆర్థిక సాయం చేశారు. అలాగే, యూఏఈలో కన్వీనర్ సయ్యద్ అక్రమ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రవాసాంధ్ర భరోసా బీమాను 50 మందికి ఉచితంగా నమోదు చేశారు. సీఎం జగన్ ప్లకార్డులను ప్రదర్శించారు. ఖతార్‌లో కన్వీనర్ డి.శశికిరణ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. సింగపూర్‌లో ఎన్‌ఆర్‌ఐలు, వైఎస్సార్‌సీపీ సింగపూర్ టీం, సింగపూర్ వైఎస్సార్‌సీపీ అడ్వైజర్ కోటిరెడ్డి, కన్వీనర్ మురళీకృష్ణల ఆధ్వర్యంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు జరిగాయి. కువైట్‌లో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కేక్ కట్ చేశారు. అలాగే, కువైట్‌లోని ఖైతాన్ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నేత ఎన్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌ఆర్‌ఐలు భాస్కర్, శ్రీనివాసులు, గుండు కృష్ణ, సందీప్ రెడ్డి, కృష్ణా రెడ్డి, చంద్ర, అఖిరెడ్డి, సుధీర్, ప్రసాద్, మధు, రాంమోహన్, రంగారెడ్డి, విష్ణు, దొర బాబు, లీల, చిట్టి బాబు, శ్రీనాథ్, సుహాస్, నాగ సత్యనారాయణ రెడ్డి, పవన్, మనోహర్, బాబుల్‌రెడ్డి, మధు, రమణారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, బాషా, మదార్‌వలీ, ఆరిఫ్, జావేద్, రియాజ్, రెడ్డిబాషా, జిలాన్, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాస్, పాస్టర్ అనిల్, కొల్లే రవికుమార్, ప్రకాష్, నీలిమ, లక్ష్మి, విజయ, శ్యాం, కళ్యాణ్, శ్యాంసురేంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, సయ్యద్ సలీం, షేక్ షోయబ్, వెంకటప్పరెడ్డి, ఆర్టీఏ జహీర్, గూడూరు విజయ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



క్లుప్తంగా...

'40 ఏళ్ల ప్రజాజీవితం' పుస్తకాన్ని సీఎం జగన్‌కు అందజేసిన ధర్మాన


పుస్తకం ప్రతిని సీఎం జగన్‌కు అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి,అమరావతి: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తన ప్రజాజీవితంలో శాసనసభ్యుడిగా, మంత్రిగా చట్టసభల్లో వివిధ అంశాలపై చేసిన ప్రసంగాలతో '40 ఏళ్ల ప్రజా జీవితం' పేరిట రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆయన కలిసి పుస్తకాన్ని అందించారు.

ప్రవాసాంధ్రులకు బీమా భరోసా

- ఉద్యోగులకు ప్రీమియంలో 50 శాతం రాయితీ, విద్యార్థులకు ఉచితంగా బీమా
- న్యూ ఇండియా అస్యూరెన్స్‌తో ఏపీఎన్ఆర్‌టీఎస్ ఒప్పందం

సాక్షి, అమరావతి: విదేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్ర ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థులకు ఏపీఎన్ఆర్టీఎస్ బీమా భరోసా కల్పిస్తూ సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 50 శాతం సబ్సిడీ ధరతో ప్రమాద బీమా కల్పించే విధంగా ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్. మేడపాటి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు 3 సంవత్సరాలకు ప్రీమియం రూ. 550, విద్యార్థులకు సంవత్సరానికి రూ. 180 ప్రీమియం ఉండేదని, అయితే ప్రవాసాంధ్రుల శ్రేయస్సు దృష్ట్యా, ఉద్యోగులు కడుతున్న ప్రీమియంలో 50శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అదే విద్యార్థులకు అయితే పూర్తి ఉచితంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని ఇస్తున్నట్టు తెలిపారు. ఈ పథకంలో చేరాలనుకునే వారు డిసెంబర్ 26 నుంచి జనవరి 15, 2024 లోగా నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. బీమా తీసుకున్న వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షల ఆర్థిక సహాయం, ప్రమాదం వల్ల సంభవించే గాయాలు, అనారోగ్య చికిత్సకు అయ్యే హాస్పిటల్ ఖర్చులకు రూ.లక్ష వరకు చెల్లింపులు, బీమా తీసుకున్న మహిళా ఉద్యోగులకు ప్రసూతి హాస్పిటల్ ఖర్చులకు రూ. 50 వేల వరకు చెల్లింపు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తున్నట్లు వివరించారు. ప్రవాసాంధ్ర భరోసాబీమాలో నమోదు కోసం 24 గంటల హెల్ప్‌లైన్ +91-863-2340678; +91 85000 27678 (వాట్సాప్) లేదా వెబ్ లింక్ https://www.apnrts.ap.gov.in/index.php/home/insurance_newలో లాగిన్ కావాల్సిందిగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'జేఎన్ 1'పై జాగ్రత్త

కరోనా కొత్త వేరియంట్‌పై సీఎం జగన్ ఉన్నత సమీక్ష

- వైరస్ కట్టడి చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం
- సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశం
- ఆస్పత్రుల్లో అందుబాటులో పడకలు 56,741
- వేగంగా విస్తరించే లక్షణం ఉన్నా ఆస్పత్రులకు రాకుండానే రికవరీ


కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తిపై ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కరోనా వైరస్ కొత్త వేరియంట్ 'జేఎన్ - 1' వ్యాప్తి నేపథ్యంలో కట్టడి చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అత్యంత బలమైన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను అప్రమత్తం చేయాలని సూచించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తిపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కొత్త వేరియంట్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆస్పత్రులకు రాకుండానే రికవరీ

జేఎన్-1 వేరియంట్‌పై ప్రస్తుతానికి అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నారు. దీని బారిన పడ్డవారు ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండా, ఆస్పత్రుల వరకూ రాకుండానే రికవరీ అవుతున్నారని వెల్లడించారు. దీనికి డెల్టా వేరియంట్ తరహా లక్షణాలు లేవని తెలిపారు. అయితే జేఎన్-1కు వేగంగా విస్తరించే లక్షణం ఉందన్నారు. లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేస్తున్నామన్నారు. కరోనా పాజిటివ్‌గా తేలిన వ్యక్తుల శాంపిళ్లను విజయవాడ జీనోమ్ ల్యాబ్‌కు తరలించి వేరియంట్‌లను విశ్లేషిస్తున్నామన్నారు. సచివాలయాల్లో ర్యాపిడ్ టెస్టింగ్ కిట్స్, ఆస్పత్రుల్లో పర్సనల్ కేర్ కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్సకు అవసరమైన మందులన్నీ పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆక్సిజన్ సదుపాయాలను సిద్ధం చేస్తున్నామన్నారు. పీఎస్ఏ ప్లాంట్లు సత్వర వినియోగానికి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, డి-టైప్ సిలిండర్లు కూడా సిద్ధం చేశామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డీఎంఈ డాక్టర్ నరసింహం తదితరులు ఇందులో పాల్గొన్నారు.

సన్నద్ధత ఇలా..

- రాష్ట్రవ్యాప్తంగా జీజీహెచ్‌లలోని 13 ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లను యాక్టివేట్ చేసిన వైద్య శాఖ. రోజుకు కనీసం వెయ్యి పరీక్షల నిర్వహణ.
- సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ ఉన్న రోగులకు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్షల నిర్వహణ.
- వైరస్ అనుమానిత లక్షణాలున్న వ్యక్తులకు పరీక్షలు నిర్వహించేలా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఐదు చొప్పున ర్యాపిడ్ కిట్‌లు అందుబాటులో.
- శబరిమల, కేరళ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులకు స్క్రీనింగ్. వీరిపై ప్రత్యేకంగా ఫోకస్.
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 12,292 జనరల్, 34,763 ఆక్సీజన్, 8,594 ఐసీయూ, 1,092 పీడియాట్రిక్ ఐసీయూ పడకల చొప్పున మొత్తం 56,741 పడకలు అందుబాటులో.

గందరగోళం సృష్టించే శక్తులపై కఠిన చర్యలు

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి హెచ్చరిక



సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తుల పట్ల నాయకులు అప్రమత్తంగా ఉండాలని పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు నియోజకవర్గాలకు అభ్యర్థులను అధిష్టానం ప్రకటించినట్టు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ అంశంపై పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో ఆయన ఫోనులో చర్చించారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి శుక్రవారం రాత్రి 'సాక్షి'తో మాట్లాడారు. అభ్యర్థుల మార్పును స్వయంగా పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేదా ఆయన ఆదేశాల మేరకు పార్టీ ముఖ్యులు మీడియా సమక్షంలోనే ప్రకటిస్తారని చెప్పారు. ఇందులో దాపరికం ఏమీ లేదన్నారు. అభ్యర్థుల పేరుతో పార్టీలో అలజడి సృష్టించేందుకు కొన్ని శక్తులు కావాలని అసత్యాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. ఇలాంటి శక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్‌ఐ అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

పారదర్శకంగా మెరిట్, రోస్టర్ విధానంలో నియామకాలు

- 411 సివిల్, ఏపీఎస్పీ ఎస్‌ఐ పోస్టుల భర్తీ
- 315 సివిల్ ఎస్‌ఐ పోస్టుల్లో 102 మంది మహిళలకు అవకాశం
- సివిల్ ఎస్‌ఐ పురుషుల్లో టాపర్‌గా జి.విజయభాస్కరరావు
- మహిళా టాపర్‌గా ఎల్.కృష్ణవేణి
- ఏపీఎస్పీకి 96 మంది ఎంపిక.. టాపర్‌గా రానెల్లి కోటారావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టులకు ఎంపికైనవారి జాబితాను రాష్ట్ర పోలీసు నియామక మండలి శుక్రవారం ప్రకటించింది. అత్యంత పారదర్శకంగా అభ్యర్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ప్రకారం సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో మొత్తం 411 ఎస్‌ఐ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. 315 సివిల్ ఎస్‌ఐ (పురుషులు, మహిళలు), 96 ఏపీఎస్పీ ఎస్‌ఐ (పురుషులు) పోస్టులకు రాత పరీక్షల ఫలితాల అనంతరం నాలుగు జోన్ల వారీగా మెరిట్ జాబితాను ప్రకటించింది. సివిల్ ఎస్‌ఐ పోస్టులకు ఏకంగా 102 మంది మహిళలు ఎంపికవ్వడం విశేషం. మొత్తం సివిల్ ఎస్‌ఐ పోస్టులకు సంబంధించి విశాఖపట్నం జోన్‌లో 50, ఏలూరులో 105, గుంటూరులో 55, కర్నూలులో 105 మందిని ఎంపిక చేశారు.

టాపర్లు వీరే..

సివిల్ ఎస్‌ఐ పురుషుల విభాగంలో గోనబోయిన విజయభాస్కరరావు (రి.నం. 5033539) 400 మార్కులకు గాను 284 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఈయన ఏలూరు జోన్‌కు ఎంపికయ్యారు. మహిళల్లో లోగిసా కృష్ణవేణి (రి.నం .5052468) 273 మార్కులతో మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. ఏపీఎస్పీ విభాగంలో రానెల్లి కోటారావు (రి.నం.5036787) 300 మార్కులకు గాను 190.5 మార్కులతో ప్రథమ స్థానం సాధించారు. త్వరలో పోలీసు నియామక మండలి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలతోపాటు బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ చేపట్టనుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎంపికైన అభ్యర్థులకు అనంతపురంలోని ఏపీ పోలీసు అకాడమీలో శిక్షణ ఇవ్వనుంది. సంక్రాంతి తర్వాత శిక్షణ ఉండొచ్చని పోలీసు నియామక మండలి తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను https://slprb.ap.gov.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

ప్రతిభ, రోస్టర్ ప్రకారం..

రాష్ట్రంలో 411 ఎస్‌ఐ పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ ఇవ్వగా 1,73,047 దరఖాస్తులు వచ్చాయి. 1,40,453 మంది పురుషులు, 32,594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 19న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో 1,51,288 మంది పరీక్ష రాస్తే 57,923 మంది (38.28 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 31,193 మంది తుది రాత (మెయిన్స్) పరీక్షకు ఎంపికయ్యారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో తుది పరీక్ష జరగ్గా ఈ నెల 6న ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో 18,637 మంది అర్హత సాధించారు. వీరిలో ప్రతిభావంతుల జాబితాను రూపొందించి రోస్టర్ ప్రకారం మెరిట్‌లో నిలిచిన 411 మంది అభ్యర్థులను పోలీసు నియామక మండలి ఎస్‌ఐ పోస్టులకు ఎంపిక చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌తో పాటు ప్రత్యేక కోటా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థుల తుది ఎంపికలు చేపట్టింది. పోలీస్ ఎగ్జిక్యూటివ్ (పీఈ)కు 2 శాతం, ఎన్‌సీసీకి 3 శాతం, మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్ (ఎంఎస్‌పీ)కు 2 శాతం, పోలీసు సిబ్బంది పిల్లలు (సీపీపీ)కు 2 శాతం, సీడీఐకి 2 శాతం, పోలీసు మినిస్టీరియల్ (పీఎం)కు 1 శాతం రిజర్వేషన్ కల్పించింది.

నాన్న ప్రోత్సాహం.. అమ్మ మార్గదర్శకత్వం

- క్యాట్ ర్యాంకర్ కుమార సాయి విష్ణు
- రాష్ట్రం నుంచి ఒకే ఒక్కడు కావడం విశేషం


విజేత కుమార సాయి విష్ణుతో తల్లిదండ్రులు రమాదేవి, రామ్మోహన్

మధురవాడ: ప్రణాళిక ప్రకారం కష్టపడి చదవడంతో పాటు తండ్రి రామ్మోహన్ ప్రోత్సాహం.. తల్లి రమాదేవి అనునిత్యం వెంట ఉండి నడిపించడం వల్లనే తనకు ఈ విజయం సాధ్యమైందని క్యాట్ నేషనల్ ర్యాంకర్ ఆలమూరి కుమార సాయి విష్ణు చెప్పారు. ఐఐఎంలో ప్రవేశం కోసం నిర్వహించిన క్యాట్ పరీక్షలో దేశవ్యాప్తంగా 11 మంది 100 శాతం పర్సంటైల్ సాధించగా, అందులో మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ఎంవీవీ ఓజోన్‌లో నివాసం ఉంటున్న కుమార సాయి విష్ణు ఒకరు. రాష్ట్రంలోనూ ఈయన ఒక్కరే ఉండటం విశేషం. ఈయన గీతంలో బీఎస్సీలో మ్యాథ్స్, కంప్యూటర్స్, స్టాటిస్టిక్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. సొంతూరు విజయనగరం జిల్లా దత్తి రాజేరు మారడాం. తండ్రి విశాఖలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ ఇక్కడ స్థిరపడ్డారు. కుమార సాయి విష్ణు అక్క జస్వంతి కూడా సిరిమూర్ ఐఐఎంలో చదువుతుండటం మరో విశేషం. ఈ సందర్భంగా కుమార సాయి విష్ణును పలువురు అభినందించారు. కాగా, తల్లిదండ్రులతో కలిసి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రతిరోజూ ఎఫెర్ట్‌పెట్టి కష్టపడి చదివితే విజయాలు వాటంతట అవే వస్తాయని చెప్పారు. ఐఐఎంలో చేరి మంచి సంస్థలో టాప్ పొజిషన్‌లో ఉండాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. అలాగే తాను కూడా ఓ పరిశ్రమ పెట్టి కొందరికి ఉపాధి కల్పిస్తానని చెప్పారు.

సీఎం జగన్ పెద్ద మనసు

- ముగ్గురు రోగులకు 24 గంటల్లో ఆర్థిక సాయం
- ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ


సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆపన్నులకు మరోసారి అండగా నిలిచారు. ఆయన గురువారం చింతపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు సీఎంను కలిసి తమ కష్టాలు చెప్పుకొన్నారు. వారి పరిస్థితులను తెలుసుకున్న సీఎం.. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వెంటనే తగిన సాయం చేసి వారిని ఆదుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. దీంతో ఆయన వెంటనే ముగ్గురు బాధితులకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.3 లక్షలను వారి ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. కండరాల వ్యాధితో బాధపడుతున్న చింతపల్లి మండలం గుమ్మడిగొండకు చెందిన అడిగర్ల రమ్యశ్రీ, బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చింతపల్లి గ్రామానికి చెందిన పంపోతి కొండబాబు, పెరాలసిస్‌తో బాధపడుతున్న చింతపల్లి మండలం దిబ్బగరువుకు చెందిన మోరి కృష్ణవేణిలు ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశించిన 24 గంటల వ్యవధిలోనే ఆర్థిక సాయం వారి అకౌంట్లలో జమవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




బాధితుల కష్టాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

లోకేశ్ అరెస్టుకు అనుమతివ్వండి

- సెక్షన్ 41ఏ నోటీసులోని షరతులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారు
- రెడ్ బుక్ పేరుతో పోలీసులను, సాక్షులను బెదిరించారు
- న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా పలు ఆరోపణలు చేశారు
- ఏసీబీ ప్రత్యేక కోర్టులో సీఐడీ పిటిషన్
- నేరుగా అరెస్టు చేయవచ్చుగా అని సీఐడీని ప్రశ్నించిన కోర్టు
- కోర్టు అనుమతి కోసం పిటిషన్ దాఖలు చేశామన్న సీఐడీ
- అయితే లోకేశ్ ఇంటర్వ్యూలను చూసిన తర్వాత స్పందిస్తామన్న న్యాయస్థానం
- తదుపరి విచారణ 28వ తేదీకి వాయిదా
- హైకోర్టులోనూ మెమో దాఖలు చేసిన సీఐడీ



సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు భూ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి, టీడీపీ నేత నారా లోకేశ్ అరెస్టుకు అనుమతివ్వాలని కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద ఇచ్చిన నోటీసులో నిర్దేశించిన షరతులను లోకేశ్ ఉల్లంఘించారని న్యాయస్థానానికి తెలియజేసింది. రెడ్‌బుక్ పేరుతో పోలీసులను, సాక్షులను బెదిరిస్తూ.. భయపెట్టేందుకు ప్రయత్నించారని వివరించింది. న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా పలు చానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో లోకేశ్ ఆరోపణలు చేశారని పేర్కొంది. సీఐడీ స్పెషల్ పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి ఈ పిటిషన్ గురించి శుక్రవారం ఏసీబీ ప్రత్యేక కోర్టు జడ్జి దృష్టికి తీసుకువచ్చారు.

ఉద్దేశపూర్వకంగానే బెదిరించారు..

'ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో లోకేశ్ 14వ నిందితునిగా ఉన్నారు. విచారణ నిమిత్తం తమ ముందు హాజరుకావాలని లోకేశ్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద గతంలో నోటీసు ఇచ్చాం. అందులో పలు షరతులు విధించాం. ఈ కేసుతో సంబంధమున్న ఏ వ్యక్తినైనా బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ చేయకూడదని ఆ నోటీసులో స్పష్టంగా పేర్కొన్నాం. ఆ తర్వాత ఆయన ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ అతన్ని 2 రోజుల పాటు విచారించింది. ఈ నేపథ్యంలో లోకేశ్ ఈనెల 19న ఏబీఎన్, ఈటీవీ తదితర చానళ్లకు ఇంటర్వ్యూలిచ్చారు. ఈ సందర్భంగా ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు పాత్రపై దర్యాప్తు చేస్తున్న పోలీసులను, అతని పాత్ర గురించి వాస్తవాలు తెలిసిన వ్యక్తులను బెదిరించారు. సాక్షులను భయపెట్టాలన్న ఉద్దేశంతోనే లోకేశ్ ఉద్దేశపూర్వకంగా అలా మాట్లాడారు. కోర్టులను కించపరిచేలా పలు ఆరోపణలు కూడా చేశారు. 53 రోజుల పాటు తన తండ్రి చంద్రబాబును రిమాండ్‌కు పంపడమన్నది రాష్ట్ర ప్రభుత్వం 'వ్యవస్థలను మేనేజ్ చేయడం' ద్వారానే జరిగిందని లోకేశ్ అన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపడం న్యాయ ప్రక్రియలో భాగం. కానీ న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని లోకేశ్ మాట్లాడారు. ఆయన ఆరోపణల వల్ల ప్రజల్లో న్యాయవ్యవస్థ ప్రతిష్ట దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అలాగే ఓ రెడ్ బుక్‌ను సిద్ధం చేస్తున్నాని.. తాము అధికారంలోకి వస్తే అందులో ఉన్న వ్యక్తులు జైలుకెళ్లడం ఖాయమంటూ లోకేశ్ బెదిరించారు. చంద్రబాబు, లోకేశ్‌లపై దర్యాప్తు చేస్తున్న పోలీసులను దృష్టిలో పెట్టుకునే ఆయన ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ ఇంటర్వ్యూలను, అందుకు సంబంధించిన వివరాలను సీడీలో కోర్టు ముందుంచాం. వాటిని పరిగణనలోకి తీసుకుని లోకేశ్ అరెస్ట్‌కు ఆదేశాలివ్వండి' అని దుష్యంత్‌రెడ్డి ఏసీబీ కోర్టును కోరారు.

నేరుగా అరెస్టు చేయవచ్చు కదా?

ఏసీబీ కోర్టు జడ్జి స్పందిస్తూ.. 41ఏ కింద నిర్దేశించిన షరతులను ఉల్లంఘిస్తే, మీరే నేరుగా అరెస్ట్ చేయవచ్చు కదా? అని ప్రశ్నించారు. కోర్టు అనుమతి తీసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ పిటిషన్ దాఖలు చేశామని దుష్యంత్ బదులిచ్చారు. అలా అయితే ముందు తాను లోకేశ్ ఇంటర్వ్యూలను చూసి, ఆ తర్వాత స్పందిస్తానని జడ్జి చెప్పారు. ఇంటర్వ్యూలను చూసిన తర్వాత లోకేశ్‌కు నోటీసులు జారీ చేసి.. వారి వివరణ కూడా తెలుసుకుంటామన్నారు. అనంతరం తగిన ఉత్తర్వులు జారీ చేస్తానని తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబూ ఉల్లంఘించారు..


పోలీసులను, సాక్షులను పలు ఇంటర్వ్యూల్లో లోకేశ్ బెదిరించిన విషయాన్ని సీఐడీ హైకోర్టు దృష్టికి కూడా తెచ్చింది. ఆయన ఇంటర్వ్యూలను పెన్ డ్రైవ్‌లో ఉంచి వాటిని ఓ మెమో రూపంలో సీఐడీ స్పెషల్ పీపీ దుష్యంత్ శుక్రవారం హైకోర్టు జడ్జి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ముందుంచారు. చంద్రబాబు, లోకేశ్‌లు ఎంతో పరపతి కలిగిన వ్యక్తులని ఆయన తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబుకు బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు పలు షరతులను విధించిందని గుర్తు చేశారు. కేసు గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, సాక్షులను ప్రభావితం చేయడంగానీ, ప్రలోభపెట్టడం గానీ చేయరాదని స్పష్టం చేసిందన్నారు. సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించిందన్నారు. కానీ సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా చంద్రబాబు స్కిల్ స్కామ్ గురించి మాట్లాడారని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై తీర్పు వెలువరించే ముందు చంద్రబాబు, లోకేశ్‌లు మాట్లాడిన మాటలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని దుష్యంత్ కోర్టును కోరారు. దీనిపై చంద్రబాబు తరఫు న్యాయవాది ఎస్.ప్రణతి అభ్యంతరం తెలిపారు. చంద్రబాబు పిటిషన్‌పై ఇప్పటికే వాదనలు ముగిశాయని.. ఈ దశలో ఈ కేసుతో సంబంధం లేని వివరాలతో దాఖలు చేసిన మెమోను పరిగణనలోకి తీసుకోవద్దన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సీఐడీ మెమోపై అభ్యంతరాలుంటే వాటిని తమ ముందుంచాలని ప్రణతిని ఆదేశించారు. వాటిని పరిశీలించాక చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటామన్నారు. తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేశారు.

సామాజిక హితం

ఏపీలో మూడేళ్లుగా పెరిగిన సామాజిక సేవల వ్యయం

ఆర్బీఐ అధ్యయన నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత మూడేళ్లుగా అభివృద్ధి వ్యయం పెరుగుతుండగా వడ్డీల చెల్లింపుల వ్యయం తగ్గుతున్నట్లు రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) అధ్యయన నివేదిక వెల్లడించింది. రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్లపై నివేదిక విడుదల చేసిన ఆర్బీఐ 2021-22 నుంచి 2023-24 వరకు ప్రధాన ఆర్థిక సూచికలను ఇందులో పొందుపరిచింది. సామాజిక సేవలు, ఆర్థిక సేవల వ్యయం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన కార్యకలాపాలపై నేరుగా చేసే వ్యయాన్ని అభివృద్ధి వ్యయంగా నిర్వచించింది. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యపై చేసే ఖర్చును అభివృద్ధి వ్యయంగా ఉదహరించింది.



జీతభత్యాలు భారీగానే..

- ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా మూడేళ్లుగా సామాజిక రంగ వ్యయం పెరుగుతోంది. సామాజిక సేవలు, గ్రామీణాభివృద్ధి, ఆహార నిల్వలు, గిడ్డంగులు ఈ కోవలోకి వస్తాయి. ఇదే సమయంలో ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, పారిశుద్ధ్య రంగాల కోసం వెచ్చించే వ్యయం కూడా పెరుగుతోంది.
- 2021-22లో మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం రూ.1.19 లక్షల కోట్లు ఉండగా 2023-24 నాటికి రూ.1.92 లక్షల కోట్లకు పెరిగింది.
- వడ్డీ చెల్లింపులు పెరుగుతున్నాయనే వాదనల్లో నిజం లేదు. రెవెన్యూ రాబడిలో వడ్డీ చెల్లింపుల శాతం తగ్గుతోంది.
- ఏపీలో వేతనాలు, జీతాలు చెల్లింపులు గత ఐదేళ్లుగా పెరుగుతూనే ఉన్నాయి. ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుతో పాటు చిరు ఉద్యోగుల వేతనాలను పెంచడంతో వేతనాలు, జీతాల వ్యయం పెరుగుతున్నట్లు సూచికలు వెల్లడిస్తున్నాయి.

వేతనాలు, జీతాల వ్యయం పెరుగుదల

ఆర్థిక సంవత్సరం	వేతనాలు, జీతాల వ్యయం (రూ.కోట్లలో)
2019-20 (అకౌంట్స్)	42,743.8
2020-21 (అకౌంట్స్)	45,028.9
2021-22 (అకౌంట్స్)	49,260.0
2022-23 (సవరించిన అంచనా)	55,533.8
2023-24 (అంచనా)	59,520.1



రాష్ట్ర ప్రధాన ఆర్థిక సూచికలు

ఆర్థిక సంవత్సరం	అభివృద్ధి వ్యయం	అభివృద్ధియేతర వ్యయం	రెవెన్యూరాబడిలో వడ్డీల చెల్లింపు (శాతాలు)
2021-22	62.4	30.3	14.7
2022-23	67.5	25.7	14.3
2023-24	68.9	24.4	13.9

అధికారం కోసం బాబు రాజకీయ వ్యభిచారం

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,181వ రోజుకు చేరిన రిలే దీక్షలు




రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అధికారం కోసం చంద్రబాబు రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,181వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి మద్దతు తెలిపి ప్రసంగించారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు పేదలను అణగదొక్కడమే ధ్యేయంగా పాలన చేశారని గుర్తు చేశారు. దీని వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా పేదలకు అందాల్సిన విద్య, వైద్యం, సంక్షేమాన్ని చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతుంటే కళ్లలో నిప్పులు పోసుకొని తప్పుడు కేసులు వేయించి స్టేలు తెస్తున్న బాబు అండ్ కో అరాచకాలకు త్వరలో క్లైం వేస్తామన్నారు. అమరావతి అంటే బాబుకు కల్పవృక్షం, కామధేనువులా మారి లక్షల కోట్లు కుమ్మరించిందని, ఆ అవినీతి కుప్పలు కుప్పలుగా బయటపడుతుంటే కప్పి పుచ్చుకునేందుకు ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని నానాయాగీ చేస్తున్నాడని మండిపడ్డారు. అధికారం కోసమే బాబు ప్యాకేజీలిచ్చి మరీ పలు పార్టీలతో రాజకీయ వ్యభిచారం చేయిస్తూ తప్పుడు ప్రచారంతో గెలవాలని చూస్తున్నాడని విమర్శించారు. నమ్మి మూడు సార్లు మోసపోయిన రాష్ట్ర ప్రజలు ఎన్ని పార్టీలను వెనకేసుకొని వచ్చినా బాబును చిత్తుచిత్తుగా ఓడించి రాష్ట్రం నుంచి తరిమికొట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అభిమానులపై ‘పంజా’!

సాక్షి, అమరావతి: పదేళ్ల కిందట పెట్టిన పార్టీ. కానీ... ఇప్పటిక్కూడా వేదిక ఎక్కి మాట్లాడే నాయకుడు ఒక్కడే!!. మరీ ముఖ్యమైన సందర్భాల్లో అయితే అటుపక్క సోదరుడు... ఇటుపక్క తన వ్యవహారాలన్నీ చక్కబెట్టే ఓ కార్యదర్శి స్థాయి నాయకుడు. ఏ జిల్లాకెళ్లినా అంతా అభిమానులే తప్ప వాళ్లలో ఒక్కరూ నాయకులుండరు. అసలు జనసేన రాజకీయ పార్టీయేనా? అలాగైతే పదేళ్లుగా ఎక్కడా ఒక్క బలమైన నాయకుడూ ఎందుకు తయారు కాలేదంటారు? ఎందుకంటే ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉద్దేశమే అది. తనకు అధికారం అక్కర్లేదని పదేపదే ఆవేశాన్ని అభినయిస్తూ చెప్పే పవన్ కళ్యాణ్ మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందనేది రాజకీయ విశ్లేషకుల మాట. ఎందుకంటే 2014 ఎన్నికల్లో ఆయన చంద్రబాబుకు బేషరతుగా మద్దతు ప్రకటించారు. చంద్రబాబు గెలిచారు. కానీ 2019 వచ్చేసరికి బాబు ప్రభుత్వంపై వ్యతిరేకత బాగా పెరిగిపోవటంతో... ఆ వ్యతిరేక ఓట్లన్నీ వైఎస్సార్ సీపీకి గంపగుత్తగా పడకుండా చీల్చాలని చంద్రబాబు ఆదేశించటంతో... కొత్త పాత్ర పోషిస్తూ బాబు స్నేహితుడి నుంచి బాబు ప్రతినాయకుడి పాత్రలోకి మారిపోయారు. లేని ఆవేశాన్ని తెచ్చుకుని, చంద్రబాబును చెడామడా తిట్టేస్తూ... ఆగ్రహంతో ఊగిపోయారు. రక్తి కట్టించాననుకున్నారు. కానీ సినిమా ఫ్లాపయింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అఖండమైన మెజారిటీతో గెలిచారు.

మరి ఇప్పుడూ అదే చంద్రబాబు కదా? అప్పటికీ ఇప్పటికీ ఆయనలో ఏం మారింది? ఏం మారిందంటే చంద్రబాబు పాత్ర మారింది. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చారు. మళ్లీ ఎన్నికలొస్తున్నాయి. ఒంటరిగా అయితే జగన్‌ను ఎదుర్కోలేనన్నది చంద్రబాబు ఉద్దేశం. పవన్ కళ్యాణ్ తనతో ఉంటే ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓట్లన్నీ గంపగుత్తగా వచ్చేస్తాయనే ఆశ. కాబట్టి పొత్తు పెట్టుకోవటం ద్వారా వాటన్నిటినీ తనకు బదిలీ చేయాలని పవన్‌కు ఆదేశించారు. మళ్లీ పవన్ వేషం మారింది. కాకపోతే రెండుసార్లు ఈయన్ను నమ్మి మోసపోయిన ఆ సామాజికవర్గం మళ్లీ నమ్ముతుందా? అది కూడా తమను పదేపదే మోసం చేసిన చంద్రబాబుకు అనుకూలంగా ఓట్లేయమంటే వేసేస్తారా? అందుకే పవన్ రకరకాల అభినయాలకు దిగుతున్నారు. ‘నేను ఎవరినీ ముఖ్యమంత్రిని చేయడానికి లేను’. ‘సీఎం పదవి చేపట్టేందుకు సిద్ధం’ సీఎం పదవి ఇస్తే ఎవరైనా వద్దంటారా?’ ‘జనసేన గెలిచే సీట్లను బట్టి ముఖ్యమంత్రి ఎవరన్నది ఎన్నికల తరవాత తేలుతుంది’. ‘మనకు తగిన బలం లేనప్పుడు ఒక మెట్టు దిగటంలో తప్పులేదు’ అనే పంచ్ డైలాగ్‌లు విసిరివిసిరి.. ఇప్పుడు దార్లోకి వచ్చారు. తెలుగుదేశంతో పొత్తును వ్యతిరేకించేవారు తనకు అక్కర్లేదని, పొత్తుకు కట్టుబడ్డవారే తనతో ఉండాలని, తెలుగుదేశం కోసం జనసేన కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పనిచేయాల్సి ఉంటుందని కుండబద్దలుగొట్టేశారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్లకే కోట్లకు కోట్లు ఖర్చుచేసిన సినిమా రిలీజయ్యాక డిజాస్టరని తెలిస్తే ఎలా ఉంటుందో అంతకన్నా దారుణంగా తయారయింది జనసేన అభిమానుల పరిస్థితి.



బాంబు పేల్చిన ‘తమ్ముడు’ లోకేశ్

సీఎం ఎవరన్నదీ అసెంబ్లీ ఎన్నికల తరవాత టీడీపీ- జనసేన చర్చించి నిర్ణయాలు తీసుకుంటాయని పవన్ కళ్యాణ్ చెబుతుంటే... అసలే గందరగోళంలో ఉన్న జనసేన అభిమానులపై చంద్రబాబు తనయుడు లోకేశ్ ఓ పిడుగు వేశాడు. ఇన్నాళ్లు పవన్ చెబుతున్న మాట పచ్చి అబద్ధమని తేల్చేశారు. ఓ టీవీ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ... ‘‘పొత్తులో చంద్రబాబే సీఎం అభ్యర్థి. దీన్లో రెండో ఆలోచనే లేదు’’ అని తెగేసి చెప్పారు. అంతేకాదు. 150 సీట్లలో తమ అభ్యర్థులు ఖరారైపోయారని మరో బాంబు పేల్చారు. ఈ ఇంటర్వ్యూ చూసి జనసేన అభిమానులు హతాశులయ్యారు. ఇన్నాళ్లూ తమ ‘బ్రో’ చెప్పినవన్నీ అబద్ధాలేనా అంటూ చర్చించుకుంటున్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా అనుమానాస్పదంగానే మాట్లాడారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో 15 మందితో కలిసి నాదెండ్ల విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. ‘నా దృష్టిలో లేదు, తెలియదు’ అని తప్పించుకున్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికల తర్వాతే ఎమ్మెల్యేలు సీఎం అభ్యర్థిని నిర్ణయిస్తారని చెప్పారు. నిజానికి పొత్తుపై టీడీపీతో ఏ చర్చ జరిగినా, జనసేన తరుపున పవన్ పక్కన నాదెండ్ల మనోహర్ మాత్రమే ఉంటారు. సీఎం అభ్యర్థిత్వంపై రెండు పార్టీల మధ్య నిర్ణయం జరగకుండా ఉంటే లోకేశ్ వ్యాఖ్యలను ఆయన ఖండించే వారు. కానీ, సీఎం అభ్యర్థి చంద్రబాబు అని పవన్ కూడా చాలాసార్లు చెప్పారని లోకేశ్ స్పష్టంగా చెప్పారు. దీన్ని మనోహర్ ఖండించలేదు. మనోహర్ ఇలా మాట్లాడటంతో... పవన్ ఉద్దేశపూర్వకంగానే సీఎం అభ్యర్థిత్వంపై అబద్ధాలు చెబుతూ మోసం చేస్తున్నారని జనసేన నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. 2014లో జనసేన పార్టీ ఏర్పాటు నుంచీ పవన్ రాజకీయ కార్యక్రమాలన్నీ చంద్రబాబు ప్రయోజనాల చుట్టూనే తిరుగుతున్నాయనే వాదనకు మరింత బలాన్నిచ్చేలా పవన్ తీరు ఉన్నట్టు వారు పేర్కొంటున్నారు. ఈ సారి కూడా చంద్రబాబు కోసమే తమ నాయకుడు పనిచేస్తున్నారని, చంద్రబాబు సీఎం అభ్యర్థిగా అంతర్గతంగా అంగీకరించి ఉంటారని, అయినా నిండా 20 సీట్లు కూడా ఇవ్వలేమని లోకేశ్ చెబుతుండగా ఇక సీఎం వంటి పదాలను పలకడం వృథా అని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

పొత్తులో సీఎం అభ్యర్థిపై లోకేశ్ ఏమన్నారంటే..

విలేకరి ప్రశ్న: ఓట్లను పంచుకుంటున్నారు. సీట్లను పంచుకుంటున్నారు. సీఎం పదవిని కూడా జనసేనతో పంచుకుంటారా?

లోకేశ్: చాలా స్పష్టంగా చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి. దేర్ ఈజ్ నో సెంకడ్ థాట్ (రెండో మాటే లేదు). పవన్ కళ్యాణ్ కూడా అనేక సార్లు చెప్పారు. సమర్థవంతమైన నాయకత్వం కావాలి. అనుభవం ఉన్న నాయకుడు ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరమని చాలా స్పష్టంగా చెప్పారు. దేర్ ఈజ్ నో యాంబిగ్యుటీ (ఈ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు)

లోకేశ్ వ్యాఖ్యలపై విలేకరుల సమావేశంలో నాదెండ్ల మనోహర్ స్పందన..

విలేకరి ప్రశ్న: టీడీపీ – జనసేన పొత్తులో చంద్రబాబే ముఖ్యమంత్రి అభ్యర్థి అని లోకేశ్ ఓ ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. పవన్ ఇన్నాళ్లుగా ఎన్నికల తర్వాతే సీఎం అభ్యర్థి ఎవరన్నది చర్చించి నిర్ణయం ఉంటుందంటున్నారు కదా?

నాదెండ్ల : నేను పర్టిక్యులర్‌గా వినలేదు. మీరు అనేది నిజమే అయితే, పొత్తులో భాగంగా పరస్పరం గౌరవించుకోవాలి. కొన్ని ఆలోచనలు సరైన సమయానికి ఇరు పార్టీల నాయకులు కూర్చొని, ఇరు పార్టీల ఎమ్మెల్యేలు కూర్చొని ఆ సందర్భంగా వారు కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. నా దృష్టిలో అయితే, (దీనిపై నిర్ణయం జరిగినట్టు) లేదు.

జనసైనికుల కలలు ఏమి కావాలనుకుంటున్నారు?

పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాసిన హరిరామజోగయ్య

సాక్షి, అమరావతి/పాలకొల్లు సెంట్రల్: టీడీపీ –జనసేన పొత్తులో చంద్రబాబే ముఖ్యమంత్రి అభ్యర్థి అంటూ టీడీపీ నేత లోకేశ్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలపై పవన్‌కళ్యాణ్ స్పందించాలని మాజీ ఎంపీ సీహెచ్ హరిరామజోగయ్య శుక్రవారం ఓ బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేశారు. ఆ ఇంటర్వ్యూలో లోకేశ్ ఈ నిర్ణయంలో రెండో మాట లేదని కూడా చెప్పిన విషయాన్ని చేగొండి ఆ లేఖలో ప్రస్తావించారు. లోకేశ్ ఆశిస్తున్నట్లు టీడీపీ–జనసేన పొత్తులో చంద్రబాబే పూర్తి కాలం సీఎంగా చేయడానికి మీ ఆమోదం ఉందా అంటూ ఆ లేఖలో పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. మీరే సీఎం కావాలని కోరుకుంటున్న జనసైనికుల కలలు ఏం కావాలనుకుంటున్నారు? అని పవన్‌ను నిలదీశారు.

అన్యాక్రాంతమైన రూ.1,500 కోట్ల మఠాల ఆస్తులు స్వాధీనం

- దేవదాయ శాఖ మంత్రి వెల్లడి



ఉంగుటూరు: అన్యాక్రాంతంలో ఉన్న రూ.1,500 కోట్ల విలువైన మఠాల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక మఠాలు, సత్రాలు, వేద పాఠశాలలకు రూ.వేల కోట్ల విలువైన ఆస్తులను మహానుభావులు దానం చేశారని చెప్పారు. అవన్నీ అన్యాక్రాంతమయ్యాయని, వాటిని కాపాడటానికి తమ ప్రభుత్వం చట్టం చేసిందని వివరించారు. ఈ చట్టం ప్రకారం 1987–30/97–45 రిజిష్టరులో ఒకసారి రిజిస్టరు అయితే దేవదాయ భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉండదని మంత్రి స్పష్టంచేశారు.

ఆంధ్రజ్యోతి ప్రతులు దహనం చేసిన బాలయ్య అభిమానులు

కావలి: నెల్లూరు జిల్లా కావలిలో శుక్రవారం నందమూరి బాలకృష్ణ అభిమానులు ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులను దహనం చేశారు. ఉత్తరాంధ్రలో నారా లోకేశ్ యువగళం ముగింపు సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బాలకృష్ణ పాల్గొన్నప్పటికీ ఆంధ్రజ్యోతి పత్రికలో నందమూరి బాలకృష్ణ పేరు, ఫొటో కావాలనే ప్రచురించలేదని వారు మండిపడ్డారు. బాలకృష్ణపై ఆంధ్రజ్యోతికి ఎందుకు ఈ వివక్ష అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి యజమాన్యం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నందమూరి అభిమానులకు వేమూరి రాధాకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజల భద్రతపైనా బురద రాతలేనా?

- సీసీ కెమెరాల పేరుతో మరో అప్పు అంటూ రామోజీ తప్పుడు కథనం
- జరిమానాల ద్వారా అప్పు తిరిగి చెల్లిస్తారంటూ వక్రభాష్యాలు
- ‘ఈనాడు’ రాతలను ఖండించిన ఏపీఎస్‌ఎఫ్‌ఎల్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు భద్రత కల్పించడం కూడా రామోజీకి తప్పుగా కనిపిస్తోంది. ప్రజల రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి తీసుకుంటున్న చర్యలపైనా బురద జల్లుతూ ‘ఈనాడు’ మరోసారి రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కింది. ‘సీసీ కెమెరాల పేరుతో మరో అప్పు’ అంటూ శుక్రవారం ప్రచురించిన కథనాన్ని ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎం.మధుసూదన్‌రెడ్డి ఖండించారు. అప్పు కోసం హడావుడిగా నిర్ణయం తీసుకున్నారని.. ఆ అప్పును తీర్చడానికి జరిమానాలు విధిస్తున్నారంటూ ప్రజలను భయపెట్టే విధంగా కథనం రాశారంటూ తప్పుపట్టారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

పటిష్ట భద్రత కోసం సుదీర్ఘ కసరత్తు తర్వాతే నిర్ణయం..

రాష్ట్ర ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని అనేక అంశాలను పరిశీలించిన తర్వాత.. దీర్ఘకాలం ఉండే విధంగా రాష్ట్రంలో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆర్థికంగా సాధ్యాసాధ్యాలు, సర్వైలెన్స్ మౌలిక వసతులు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని సుదీర్ఘ కసరత్తు అనంతరం నిర్ణయం తీసుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రజల భద్రత కోసం ప్రస్తుతం ఉన్న వ్యవస్థను వినియోగించుకుంటూ కొత్తగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ నుంచి అభ్యర్థన వచ్చిన 10 రోజుల్లోనే రుణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందంటూ ఈనాడు రాసిన కథనంలో వాస్తవం ఏమాత్రం లేదు. తుది నిర్ణయం తీసుకునే ముందు ఆలోచనాత్మకంగా సుదీర్ఘంగా జరిగిన చర్చ.. ఇందుకు పట్టిన సమయాన్ని ‘ఈనాడు’ ఉద్దేశపూర్వకంగానే పరిగణనలోకి తీసుకోలేదు.

రుణానికి, జరిమానాలకు లింకేంటి?

ఎక్కడా కూడా ఒక ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడానికి జరిమానాలపై ఆధారపడటం అనేది ఉండదు. ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాల నుంచి పొందిన లీజు అద్దెల వంటి ఆదాయాల ద్వారా మాత్రమే రుణాలు తిరిగి చెల్లిస్తాం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి విధించిన జరిమానాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రజల భద్రతా చర్యలకు వినియోగిస్తాం. అంతేగానీ జరిమానాల సొమ్మును రుణాలకు చెల్లిస్తారనే ఆరోపణ పూర్తిగా అవాస్తవం.

ఏపీని టాప్‌లో నిలబెట్టిన బీబీఎన్ఎల్..

ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ మొదటి నుంచీ ఈ ప్రాజెక్ట్ అమలు నిర్వహణ ఏజెన్సీగా కొనసాగుతోంది. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టును హోం శాఖ కూడా వినియోగించుకుంటోంది. అలాగే రూ.300 కోట్ల రుణం అనేది బీబీఎన్ఎల్ మొత్తం ప్రాజెక్టు వ్యయంలో కేవలం 50 శాతమేనన్న విషయాన్ని గమనించాలి. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ, బీబీఎన్ఎల్ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేశాం. అంతేకాదు దేశంలో భారత్ నెట్ మిషన్ లక్ష్యాలను సాధించిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను బీబీఎన్ఎల్ నిలబెట్టింది. బీబీఎన్ఎల్ ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణంలో పురోగతి లేదనే ఆరోపణ పూర్తిగా నిరాధారమైనది.

ఆటోను ఢీకొన్న కారు... ఆరుగురి మృతి

పెద్దారవీడు: ప్రకాశం జిల్లా, పెద్దారవీడు మండలం, దేవరాజుగట్టు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. స్థానికులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని చంద్రమౌళినగర్‌కు చెందిన రాయి నాగేశ్వరరావు, రాయి వెంకటేశ్వరరావు ఒక కారులో, వారి కుటుంబ సభ్యులు మరో కారులో శుక్రవారం ఉదయం కొమరోలులో ఉన్న బంధువుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం గుంటూరు బయలుదేరారు. మార్గమధ్యంలో రాయి నాగేశ్వరరావు, రాయి వెంకటేశ్వరరావు ప్రయాణిస్తున్న కారు దేవరాజుగట్టు సమీపాన ఎదురుగా దూపాడు నుంచి ప్రయాణికులతో మార్కాపురం వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. కారు నడుపుతున్న రాయి నాగేశ్వరరావు(55), పక్కన కూర్చున్న రాయి వెంకటేశ్వరరావు(62), మార్కాపురంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ షేక్ బాబు (46), దూపాడు గ్రామానికి చెందిన ఎనిబెర అభినయ్ (12) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడిన దోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామానికి చెందిన ఉప్పలపాటి దానియేలు(30) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.ఆటోలో ప్రయాణిస్తూ గాయపడి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిలో దూపాడుకు చెందిన రత్నతేజ(9) కూడా మృతి చెందారు. ఎనిబెర అభినయ్ పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్నాడు. క్రిస్మస్ పండుగకు దుస్తులు కొనుక్కునేందుకు ఆటోలో మార్కాపురం వెళుతూ ప్రమాదంలో మృతిచెందాడు. ఆటో డ్రైవర్ షేక్ బాబుకు భార్య రమీజా, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలాన్ని మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ మారుతీకృష్ణ, ఎస్‌ఐ రాజ్‌కుమార్ పరిశీలించారు.

‘బెర్తింగ్’లో గంగవరం పోర్టు రికార్డు



పెదగంట్యాడ (గాజువాక): దేశంలోనే అత్యంత లోతైన, అతిపెద్ద నౌకాశ్రయంలో ఒకటైన గంగవరం పోర్టు..డ్రాఫ్ట్‌నౌకను బెర్తింగ్ చేయడం ద్వారా మరో మైలురాయిని చేరుకుంది. 18.12 మీటర్ల డ్రాఫ్ట్‌తో ఉన్న ఎంవీ ట్రూ కరేజ్ వెసల్‌ను ఓడ రేవులో నియంత్రిక టెర్మినల్ వద్ద బెర్త్ చేశారు. దీంతో ఈ ఏడాది జూన్ 23న 18 మీటర్ల నౌకను బెర్త్ చేయడం ద్వారా సాధించిన రికార్డును పోర్టు అధిగమించింది. ఈ డీప్ డ్రాఫ్ట్ నౌకను బెర్తు చేయడం ద్వారా ఏ సమయంలోనైనా డీప్ డ్రాఫ్ట్ నౌకలను బెర్తు చేయగలిగే ఆల్–వెదర్ ఫెసిలిటీగా పోర్టు తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ ఏడాది రూ.50 కోట్ల పెట్టుబడితో పోర్టు దాని కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకుంది. దీని ద్వారా రైల్వేలు, మెక్‌నైజ్డ్ హ్యాండ్లింగ్ కార్గో స్టోరేజ్‌తో పాటు పర్యావరణ కార్యక్రమాల్లో నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకుంది.

ఆర్బీకే వ్యవస్థ అద్భుతం

- వియత్నాం ప్రావిన్షియల్ నేషనల్ అసెంబ్లీ ప్రతినిధి బృందం
- విశాఖ జిల్లా వేములవలస ఆర్బీకే సందర్శన

సాక్షి, అమరావతి/ఆనందపురం(విశాఖ): ‘‘ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన సేవలందించేందుకు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన ‘రైతు భరోసా కేంద్రాలు’ వంటి వ్యవస్థ మాకు తెలిసి ప్రపంచంలో మరెక్కడా లేదు. ఇదో విప్లవాత్మక ఆలోచన.. ఈ వ్యవస్థ అద్భుతంగా పని చేస్తుందని రైతులు చెబుతున్నారు’’ అని వియాత్నం ప్రావిన్షియల్ నేషనల్ అసెంబ్లీ ప్రతినిధి బృందం ప్రశంసించింది. ఇండో–వియత్నాం పార్టనర్‌షిప్‌లో భాగంగా వియత్నాంకు చెందిన ప్రావిన్షియల్ పార్టీ కమిటీస్ చైర్మన్ వోడిన్ టిన్, జియాన్‌జియా సిటీ పీపుల్స్ కౌన్సిల్ చైర్మన్ వో ఫామ్ ఎక్స్‌వాన్ లామ్, ప్రావిన్షియల్ పీపుల్స్ కమిటీ వైస్ చైర్మన్ లిట్రాంగ్‌యెన్ తదితరులతో కూడిన 14మంది సభ్యుల అత్యున్నత స్థాయి బృందం మూడురోజుల పర్యటనకు భారతదేశానికి విచ్చేసింది. దేశంలోని వివిధ రంగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు విచ్చేసిన ఈ బృందం కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఏపీలో వివిధ రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల పరిశీలన కోసం రాష్ట్రానికి వచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానం, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం చేసింది. తొలుత వ్యవసాయ, ఉద్యాన శాఖ కమిషనర్లు చేవూరు హరికిరణ్, శ్రీధర్ తమ శాఖల్లో గడచిన నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, వాటి ఫలితాలపై వియాత్నం బృందానికి వివరించారు. అనంతరం క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం వేములవలస గ్రామంలోని ఆర్బీకేను సందర్శించారు. ఆర్బీకే సేవలతో కూడిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కాగా, ఇప్పటికే ఇథియోఫియా దేశం ఏపీలో పర్యటించి ఆర్బీకే సాంకేతికతతో పాటు ఇతర కార్యక్రమాలను తమ దేశంలో అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసిందని కమిషనర్ హరికిరణ్ వివరించారు. వ్యవసాయ ప్రాధాన్యతా దేశాల్లో ఇదే రీతిలో డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకోగలిగితే మంచి ఫలితాలు వస్తాయని ఆకాంక్షిస్తూ ఆర్బీకే విజిటర్స్ బుక్‌లో బృందం తమ అభిప్రాయాన్ని రాశారు. వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మన్మథరావు, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు కరుణాకర్, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు, ధాన్యం నాణ్యతను నిర్ధారించే పరికరాలను పరిశీలిస్తున్న వియత్నాం బృందం

> **ఆర్బీకే వ్యవస్థ అద్భుతం**
>
> ఏపీలో విద్య, వైద్య, వ్యవసాయ ఇతర రంగాల్లో విప్లవాత్మక మార్పులొచ్చాయి. మీ కేంద్ర ప్రభుత్వం చూసి రమ్మంటే ఇక్కడకు వచ్చాం. నిజంగానే ఇక్కడ ప్రభుత్వం దూరదృష్టి చాలా బాగుంది. డిజిటల్ టెక్నాలజీని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లారు. వ్యవసాయంపై ఆధారపడిన దేశాలు ఖచ్చితంగా ఇలాంటి ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
>
> – లిట్రాంగ్‌యెన్, వైస్ చైర్మన్ వియాత్నం ప్రావిన్షియల్ అసెంబ్లీ కమిటీ

మరో చంద్రముఖిలా పవన్

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: పవన్‌కళ్యాణ్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా పూర్తిగా రూపాంతరం చెందారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శించారు. పవన్ వ్యవహార శైలితో జనసేన పార్టీ అభిమానులు, వీర మహిళలు, కాపులు సిగ్గుతో తలదించుకుంటున్నారని మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. స్వార్థ ప్రయోజనాల కోసం పవన్‌కళ్యాణ్ సొంత సామాజికవర్గాన్ని, అభిమానులను చంద్రబాబుకు తాకట్టుపెట్టేశారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలతో ప్రజాక్షేత్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంతకంతకూపెరుగుతున్న ఆదరణతో తమ అడ్రస్ గల్లంతవుతుందని బాబు, పవన్‌లకు అర్థమయిందన్నారు. అందుకే విధ్వంసం, అరాచకాలు సృష్టించైనా అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సొంత పార్టీ పెట్టి కార్యకర్తల గురించి క్షణం కూడా ఆలోచించని ఏకై క వ్యక్తి పవన్‌కళ్యాణ్ అని విమర్శించారు. కేవలం చంద్రబాబు, లోకేశ్ కోసమే ఆరాటపడుతున్నారన్నారు. తెలంగాణలో పవన్‌కు డిపాజిట్లు రాలేదన్నారు.

డ్రాగన్‌పై అణుమానాలు!

అణు పరీక్షలకు సిద్ధమవుతున్న చైనా! వాయవ్య చైనాలోని లోప్‌నూర్‌లో ఏర్పాట్లు

- 1964 నాటి పరీక్ష కేంద్రంలో కొన్నేళ్లుగా చురుగ్గా కదలికలు
- ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడి, సర్వత్రా ఆందోళనలు
- మరోసారి అంతర్జాతీయ ఆయుధ పోటీ!
- భద్రతపరంగా భారత్‌కూ పెను సవాలే

డ్రాగన్ దేశం మళ్లీ అణు పరీక్షలకు సిద్ధపడుతోందా? అందుకోసం చాపకింద నీరులా కొన్నేళ్లుగా క్రమంగా పక్కాగా ఏర్పాట్లన్నీ చేసుకుంటూ వస్తోందా? ఏ క్షణంలోనైనా భారీ స్థాయిలో అణు పరీక్షలు చేపట్టనుందా? అంటే అవుననే అంటోంది తాజా పరిశోధన ఒకటి. అణు నిరాయుధీకరణ చర్యలను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో చైనా తాజా చర్యలు కలకలం రేపుతున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ ఆయుధ పోటీ ఎలాంటి మలుపు తీసుకుంటుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి...

అది వాయవ్య చైనాలోని మారుమూల జిన్‌జియాన్ అటానమస్ ఏరియా. అక్కడి ఓ ప్రాంతంలో కొన్నేళ్లుగా పలురకాలుగా హడావుడి పెరుగుతూ వస్తోంది. రకరకాల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కొండల్ని తొలిచి సొరంగాల్లాంటివి వేసే పనులూ సాగుతున్నాయి. ఇంకోవైపు కొత్త వైమానిక స్థావరం నిర్మాణంలో ఉంది. దానికి కొద్ది దూరంలోనే ఓ చిన్నపాటి శాటిలైట్ టౌన్ పుట్టుకొస్తోంది. బయటి ప్రపంచం దృష్టిలో పడకుండా అత్యంత పకడ్బందీగా జరుగుతున్న ఈ కార్యకలాపాలన్నీ ప్రముఖ అంతర్జాతీయ నిఘా నిపుణుడు డాక్టర్ రెనీ బాబియార్జ్ బయట పెట్టిన ఉపగ్రహ చిత్రాలతో తాజాగా వెలుగులోకి వచ్చాయి. దాంతో అంతర్జాతీయంగా ఒక్కసారిగా కలకలం రేగుతోంది. ఇవన్నీ జరుగుతున్నది 1964లో చైనా తొలిసారి అణు పరీక్షలు జరిపిన లోప్‌నూర్ ప్రాంతంలో కావడమే అందుకు కారణం! త్వరలో భారీ ఎత్తున అణు పరీక్షలకు చైనా సిద్ధమవుతోందనేందుకు ఇవన్నీ తిరుగులేని ఆధారాలని న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక పేర్కొంది. అమెరికా రక్షణ సంస్థ పెంటగాన్ మాజీ విశ్లేషకుడు కూడా అయిన రెనీ లోప్‌నూర్‌లో కార్యకలాపాలకు సంబంధించి కొన్నేళ్లుగా తీసిన ఉపగ్రహ ఛాయాచిత్రాలను లోతుగా పరిశీలించారు. ఆ మీదట ఆయన అందజేసిన సాక్ష్యాల ఆధారంగా న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనం కలకలం రేపుతోంది.

పక్కాగా ఏర్పాట్లు...!: న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని అభూత కల్పనగా చైనా కొట్టిపారేసింది. ఏదేదో ఊహించుకుని రాసిన నిరాధార కథనంగా దాన్ని అభివర్ణించింది. కానీ ఉపగ్రహ చిత్రాల్లో వెలుగు చూసిన విషయాలు మాత్రం చైనా కచ్చితంగా ఏదో దాస్తోందనేందుకు ఊతమిస్తున్నాయి. ఎందుకంటే ఒకట్రెండు శిథిల భవనాలు తప్ప 2017 దాకా నిద్రాణావస్థలోనే ఉన్న లోప్‌నూర్ ప్రాంతంలో గత కొన్నేళ్లలో అత్యాధునిక భవనాల భవన సముదాయాలు పుట్టుకొచ్చిన వైనం ఆ చిత్రాల్లో స్పష్టంగా కన్పిస్తోంది. అంతేగాక నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిన ఓ పటిష్టమైన బంకర్ కూడా ఉందక్కడ. దాని చుట్టూ ఎత్తైన రక్షణ గోడలు, పిడుగుపాటు నుంచి కాపాడే వ్యవస్థలు తదితరాలు కూడా కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. వీటితో పాటు ఏకంగా 90 అడుగుల ఎత్తైన డ్రిల్లింగ్ యంత్రం, ఆ పక్కనే డ్రిల్లింగ్ పైపులు కూడా ఉన్నాయి. దాని సాయంతో బహుశా నేలలోకి నిలువుగా కనీసం పావు మైలు లోతైన రంధ్రం చేసి అందులో అణ్వాయుధంతో కూడిన పేలుడు పదార్థాన్ని పేల్చి పరీక్షిస్తారన్నది బాబియార్జ్ అంచనా. లోప్‌నూర్‌కు కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో మలాన్ ప్రాంతంలో కూడా ఓ అత్యాధునిక శాటిలైట్ సిటీ నిర్మాణంలో ఉన్నట్టు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. అక్కడ కూడా రిగ్గింగ్ యంత్రాలు తదితర సెటప్ కనబడుతోంది. ఇదంతా బహుశా లోప్‌నూర్ అణు పరీక్ష పనుల్లో పాల్గొనే సిబ్బందికి పూర్తిస్థాయిలో ముందస్తు శిక్షణ కోసమని భావిస్తున్నారు.


అణు పరీక్ష కేంద్రంగా భావిస్తున్న ప్రాంతం. డ్రిల్లింగ్ రిగ్ (బాణం గుర్తుతో సూచించినది)

ఇప్పటిదాకా ఏయే దేశం ఎన్ని అణు పరీక్షలు చేసిందంటే...

దేశం	అణు పరీక్షలు
అమెరికా	1,030
రష్యా	715
ఫ్రాన్స్	210
చైనా	45
బ్రిటన్	45
భారత్	6
పాకిస్తాన్	2

(ఉత్తర కొరియా కూడా 6 అణ్వాయుధ పరీక్షలు జరిపినట్టు చెబుతారు)

ప్రాంతీయ భద్రతకు ముప్పే

చైనా అణు దూకుడు ఆసియాలో ప్రాంతీయ భద్రతను కూడా ప్రమాదంలో పడేసే పరిణామమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చైనాతో సాయుధ ఘర్షణలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇది మరీ ఇబ్బందికర పరిణామమే కానుంది. 1998 పోఖ్రాన్ అణు పరీక్షల అనంతరం వాటిపై భారత్ స్వీయ నిషేధం విధించుకోవడం తెలిసిందే.


లోప్‌నూర్‌లో సిద్ధమవుతున్న కొత్త రోడ్లు. (ఇన్‌సెట్‌లో) రోడ్ గ్రేడర్ తదితర వాహనాలు

అణు పరీక్షలు ఎందుకంటే...

చైనా అణు పరీక్షలకు దిగనుండటమే నిజమైతే అందుకు కారణాలు ఏమై ఉంటాయా అన్న చర్చ కూడా జోరుగా జరుగుతోంది. అందుకు రక్షణ నిపుణులు పలు కారణాలను చూపుతున్నారు....

- అణు కార్యకలాపాల విషయంలో కొద్దికాలంగా చైనా దూకుడు పెంచింది.
- దశాబ్దం క్రితం దాకా దానివద్ద కేవలం 50 ఖండాంతర క్షిపణులు మాత్రమే ఉండేవి.
- వాటిని 2028 కల్లా ఏకంగా 1,000కి పెంచాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇటీవలే పెంటగాన్ వార్షిక నివేదిక వెల్లడించింది.
- వీటిలో 507 క్షిపణులను అణు సామర్థ్యంతో కూడినవిగా చైనా తీర్చిదిద్దనున్నట్టు తెలుస్తోంది.
- ఈ దిశగా కొంతకాలంగా పలు అత్యాధునిక అణు వార్‌హెడ్లను చైనా తయారు చేస్తోంది.
- వాటిని అధునాతన ఖండాంతర, క్రూయిజ్ మిస్సైళ్లకు అనుసంధానిస్తూ వస్తోంది.
- ఆ వార్‌హెడ్లను పూర్తిస్థాయిలో పరీక్షించి సరిచూసుకునే ఉద్దేశంతో డ్రాగన్ దేశం ఇలా అణు పరీక్షలకు సిద్ధమవుతోందని అనుమానిస్తున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌ను చైనాతో పోల్చొద్దు: మోదీ



న్యూఢిల్లీ: అభివృద్ధి విషయంలో భారత్‌ను పొరుగు దేశమైన చైనాతో పదేపదే పోలుస్తుండడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసహనం వ్యక్తం చేశారు. భారత్‌ను ప్రజాస్వామ్య దేశాలతో పోల్చాలి తప్ప చైనాతో కాదని తేల్చిచెప్పారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల వార్తా పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. చైనా ప్రజాస్వామ్య దేశం కాదని, అక్కడ నియంతృత్వం రాజ్యమేలుతోందని చెప్పారు. భారత్‌ను ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోల్చమే సముచితమని సూచించారు. ఇండియాలో నిరుద్యోగం, అవినీతి, పరిపాలనాపరమైన అడ్డంకులు, నైపుణ్యాల లేమి వంటివి పెద్దగా లేవని మోదీ పేర్కొన్నారు. నిజంగా ఇలాంటి అంశాలు ఉండి ఉంటే, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అనే హోదా మన దేశానికి దక్కేది కాదని స్పష్టం చేశారు. పలు అంతర్జాతీయ సంస్థల్లో భారత సంతతి సీఈఓలు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఇండియాలో నైపుణ్యాల లేమి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. దేశంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నామని మోదీ వెల్లడించారు. ప్రఖ్యాత విదేశీ సంస్థలను ఆకర్షించడమే తమ లక్ష్యమని తెలిపారు. దేశంలో మైనార్టీలను అణచివేస్తున్నారన్న ఆరోపణల్లో పస లేదని స్పష్టం చేశారు. మైనార్టీలపై ఎలాంటి వివక్ష లేదన్నారు. 20 కోట్ల మంది మైనార్టీలు ఇక్కడ క్షేమంగా జీవిస్తున్నారని చెప్పారు.

సస్పెన్షన్ కోసం వాళ్లే అభ్యర్థించారు: జోషి



న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయాలని కేంద్రప్రభుత్వం అనుకోలేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. సభకు అంతరాయం కలిగించిన కొందరు ఎంపీలను సస్పెండ్ చేయడంతో తమను కూడా సస్పెండ్ చేయాలంటూ ప్రతిపక్ష ఎంపీలు తమను కోరారని ఆయన చెప్పారు. శుక్రవారం మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడారు. 'ఎంపీలను సస్పెండ్ చేయాలనే ఉద్దేశం మాకు లేదు. ప్లకార్డులతో రావొద్దని కోరాం. చర్యలుంటాయని ముందుగానే వారికి చెప్పాం. నిబంధనలు ఉల్లంఘించి కొందరు ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. క్రమశిక్షణారాహిత్యం కింద తమను కూడా సస్పెండ్ చేయాలంటూ మిగతా వారు కూడా కోరారు. కాంగ్రెస్ స్థాయి అంతగా దిగజారింది. లోక్‌సభ నుంచి 100 మంది, రాజ్యసభ సభ్యులు 46 మంది మొత్తం 146 మంది ఎంపీలు బహిష్కరణకు గురయ్యారు' అని మంత్రి చెప్పారు. తాజాగా పార్లమెంట్ ఆమోదం పొందిన మూడు క్రిమినల్ బిల్లుల్లో ఏమైనా లోపాలున్నాయని భావిస్తే కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ప్రతిపక్షాలకు ఉందని ఆయన చెప్పారు.

గణతంత్ర దినోత్సవాలకు మాక్రాన్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరి 26న జరుగనున్న 75వ భారత గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన ఈ వేడుకల్లో పాల్గొనబోతున్నారని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. భారత గణతంత్ర దినోత్సవంలో పాల్గొంటున్న ఆరో ఫ్రాన్స్ అధ్యక్షుడిగా మాక్రాన్ రికార్డుకెక్కబోతున్నారు. గతంలో ఫ్రాన్స్ నుంచి ఐదుగురు అధినేతలు భారత రిపబ్లిక్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. వాస్తవానికి 2024 గణతంత్ర దినోత్సవానికి భారత ప్రభుత్వం తొలుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. కానీ, జనవరిలో భారత్‌లో పర్యటించలేనని ఆయన అశక్తత వ్యక్తం చేశారు.

ప్రఖ్యాత కవి ఇమ్రోజ్ కన్నుమూత



ముంబై: ఇమ్రోజ్‌గా అందరికీ సుపరిచితుడైన ప్రముఖ కవి, కళాకారుడు ఇందర్ జీత్(97) శుక్రవారం ముంబైలో కన్నుమూశారు. వయో సంబంధ రుగ్మతలతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. ఇమ్రోజ్, రచయిత్రి అమృతా ప్రీతమ్ మధ్య నాలుగు దశాబ్దాల బంధం ఉంది. ముంబైలోని కాండివిలిలో ఆయన అంత్యక్రియలు పూర్తి చేసినట్లు అమృతా ప్రీతమ్ కోడలు అల్కా క్వాట్రా చెప్పారు. ఇమ్రోజ్ చితికి ప్రీతమ్ మనవరాలు నిప్పంటించారు. 1926లో పంజాబ్‌లోని ల్యాల్‌పూర్‌లో ఇమ్రోజ్ జన్మించారు. పంజాబీలో రచయిత్రిగా మంచి పేరున్న అమృతా ప్రీతమ్‌తో 1950ల నుంచి ఆయన అనుబంధం కొనసాగింది. దాదాపు 40 ఏళ్లపాటు కలిసే ఉన్నారు. 2005లో అమృతా ప్రీతమ్ చనిపోయారు. ప్రీతమ్ అనారోగ్యం బారిన పడినప్పటి నుంచి ఇమ్రోజ్ కవితలు రాయడం ప్రారంభించారు. అమృతా ప్రీతమ్ చనిపోయాక కూడా కవితా వ్యాసంగం కొనసాగించి, ఆమెకు అంకితం చేశారు.

విన్ డీజిల్‌పై లైంగిక వేధింపుల కేసు



లాస్ ఏంజెలిస్: 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' సిరీస్ యాక్షన్ చిత్రాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న హాలీవుడ్ నటుడు విన్ డీజిల్ వివాదంలో చిక్కుకున్నారు. 2010లో సహాయకురాలి పనిచేస్తున్న సమయంలో అత్యాచారానికి యత్నించారంటూ మాజీ ఉద్యోగిని అస్టా జొనాస్సన్ తాజాగా ఆయనపై ఆరోపణలు చేశారు. అట్లాంటాలోని ఓ హోటల్‌లో బస చేసిన సమయంలో విన్ డీజిల్ తనను లైంగికంగా వేధించారంటూ ఆమె గురువారం లాస్ ఏంజెలెస్ కోర్టులో దావా వేశారు. లైంగిక వాంఛను తీర్చలేదనే కోపంతో వెంటనే విన్ డీజిల్‌కు చెందిన వన్ రేస్ ప్రొడక్షన్స్ సంస్థ నుంచి తనను తొలగించినట్లు ఆరోపించారు.

కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత

మైసూరు: కర్ణాటకలో విద్యా సంస్థల్లో హిజాబ్ ధారణపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం ప్రకటించారు. ఈ నిర్ణయం శనివారం నుంచే అమల్లోకి వస్తుందన్నారు. నంజన్‌గూడ్‌లో మూడు పోలీస్ స్టేషన్లను ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సరికావంటూ బీజేపీపై మండిపడ్డారు. ''వాళ్లు పైకేమో సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అంటారు. కానీ టోపీలు, బురఖాలు, గడ్డం ఉన్నవారిని మాత్రం మినహాయిస్తుంటారు'' అంటూ చురకలంటించారు. మరి హిజాబ్‌పై ఆంక్షలెందుకని సభికులు ప్రశ్నించగా, ''ఇకపై హిజాబ్ ధరించవచ్చు. రేపట్నుంచి ఆంక్షలుండబోవు'' అని బదులిచ్చారు.

తగ్గిన వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.39.5 మేర తగ్గింది. దాంతో 19 కిలోల సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,757కు తగ్గిందని చమురు సంస్థలు తెలిపాయి. ముంబైలో రూ.1,710, కోల్‌కతాలో రూ.1,868.5, చెన్నైలో రూ.1,929గా ఉంటుందన్నాయి. దీని ధరను డిసెంబర్ 1న రూ.21 మేర పెంచడం తెలిసిందే. గృహావసరాల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.903లో ఎటువంటి మార్పు లేదని చమురు సంస్థలు స్పష్టం చేశాయి.

రహస్య పత్రాల కేసులో ఇమ్రాన్‌కు బెయిల్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ఊరట. రహస్య పత్రాల లీకేజీ కేసులో ఇమ్రాన్, ఆయన అనుచరుడు షా మహమూద్ ఖురేషీకి సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. తోషఖానా కేసులో ఇమ్రాన్ జైలులో ఉండటం తెలిసిందే.

గాజాలో 20,057కి చేరిన మృతుల సంఖ్య

ఖాన్ యూనిస్: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో సామాన్యులే సమిధలవుతున్నారు. అక్టోబర్ 7న ఇరుపక్షాల మధ్య మొదలైన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ఇజ్రాయెల్ సైన్యం గాజాపై వైమానిక, భూతల దాడులకు దిగుతోంది. సాధారణ జనావాసాలపై బాంబులు వర్షం కురిపిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 20,057 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ శుక్రవారం ప్రకటించింది. అంటే గాజాలోని మొత్తం జనాభాలో ఒక శాతం మంది మృత్యువాత పడినట్లు స్పష్టమవుతోంది. మృతుల్లో మూడింట రెండొంతుల మంది మహిళలు, చిన్నారులే కావడం గమనార్హం. సరిపడా ఆహారం, నీరు అందక గాజాలో జనం ఆకలిలో అల్లాడిపోతున్నారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 5 లక్షల మందికి ఆహారం అందడం లేదని వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజాకు మానవతా సాయం ఆశించిన స్థాయిలో అందడం లేదని పేర్కొంది. యుద్ధం కారణంగా వేలాది మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణను కోరుతూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరగాల్సిన ఓటింగ్ వాయిదా పడింది.

రెండు రోజుల్లో 390 మంది బలి

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భీకరస్థాయిలో విరుచుకుపడుతోంది. గత రెండు రోజుల వ్యవధిలో ఇజ్రాయెల్ దాడుల్లో ఏకంగా 390 మంది పాలస్తీనియన్లు బలయ్యారని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. 734 మంది క్షతగాత్రులుగా మారారని తెలియజేసింది. గాజాలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభించింది.

ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

బీజేపీపై 'ఇండియా' కూటమి నేతల ధ్వజం



శుక్రవారం ఢిల్లీలో విపక్ష ఇండియా కూటమి ధర్నాలో ఏచూరి, రాహుల్, ఖర్గే, పవార్, డి.రాజా తదితరులు

- 146 మంది ఎంపీల సస్పెన్షన్‌కు నిరసనగా 'సేవ్ డెమొక్రసీ' పేరుతో జంతర్‌మంతర్ వద్ద ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభల నుంచి 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడంపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద 'సేవ్ డెమొక్రసీ' పేరిట భారీ ధర్నా నిర్వహించారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రశ్నిస్తే బహిష్కరిస్తారా? అని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకం కావాలని ఇండియా కూటమి నాయకులు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు వామపక్ష నాయకులు, డీఎంకే, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, జేఎంఎం, రాష్ట్రీయ జనతాదళ్ తదితర పార్టీల నాయకులు, పార్లమెంట్ ఉభయ సభల నుంచి సస్పెండైన ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రతిపక్షాలు చేతులు కలపాల్సి వచ్చిందని చెప్పారు. అందరూ ఒక్కటై కలిసికట్టుగా పనిచేస్తే ప్రధాని నరేంద్ర మోదీ చేయగలిగేది ఏమీ ఉండదని అన్నారు. ప్రభుత్వం తమను ఎంతగా అణచివేయాలని చూస్తే అంతగా పైకి లేస్తామని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే తామంతా ఉమ్మడిగా పోరాడుతున్నామని ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ వీధివీధికీ తిరిగినా బీజేపీ ఓడిపోయిందని అన్నారు.

ప్రజల గొంతుకలను అణచి వేశారు

పార్లమెంట్‌లో ఈ నెల 13న చోటుచేసుకున్న భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని ప్రశ్నించినందుకు పార్లమెంట్ నుంచి 146 మంది విపక్ష సభ్యులను అన్యాయంగా సస్పెండ్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అధికార బీజేపీ దేశంలో విద్వేషాన్ని మరింతగా వ్యాప్తి చేస్తోందని, 'ఇండియా' కూటమి పార్టీలు మాత్రం మరింత ప్రేమ, సోదరభావాన్ని పంచుతున్నాయని వ్యాఖ్యానించారు. 146 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి బహిష్కరించడం ద్వారా దేశ జనాభాలో 60 శాతం మంది ప్రజల గొంతుకలను ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు. ''ఇద్దరు ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోకి దూకి పొగ వదిలారు. దీనిని చూసి బీజేపీ ఎంపీలు పారిపోయారు. దేశ భక్తులుగా చెప్పుకునే బీజేపీ నేతల గాలి పోయింది'' అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఇండియా కూటమి నాయకులు చెప్పారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ విమర్శించారు. పార్లమెంట్ నుంచి బయటకు పంపిస్తే విపక్షాల నోరు మూసుకుంటాయని ప్రభుత్వం భావిస్తోందని ఆక్షేపించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ... దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన సార్వభౌమత్వం ప్రజాప్రతినిధుల ద్వారా అమలు కావాలన్నారు. అమృత మథనం కథలో అమృతం రాక్షసుల చేతికి చిక్కిందని, దాన్ని వెనక్కి తెచ్చేందుకు అందరూ ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. పార్లమెంట్‌ను అనవసర వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తప్పుపట్టారు. పార్లమెంట్‌కు విలువ లేకపోతే ప్రజాస్వామ్యం మరణిస్తుందన్నారు. 'బీజేపీ విముక్త భారత్' మన లక్ష్యం కావాలని తృణమూల్ పార్టీ ఎంపీ మౌసమ్ నూర్ అన్నారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా, సీపీఐ(ఎంఎల్) నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, రాష్ట్రీయ లోక్‌దళ్ నేత షహీద్ సిద్దిఖీ, సమాజ్‌వాదీ నేత ఎస్.సి.హాసన్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత హస్‌నైన్ మసూదీ తదితరులు ప్రసంగించారు.

మరో 640 కోవిడ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 640 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో, యాక్టివ్ కేసులు 2,669 నుంచి 2,997కు పెరిగాయని కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. దీంతో, దేశంలో ఇప్పటి వరకు నమోదైన కోవిడ్ కేసులు 4, 50, 07, 212కు చేరాయి. కోవిడ్‌తో చనిపోయిన వారి సంఖ్య 5,33,328కి పెరిగింది. రికవరీ రేటు 98.81 శాతం కాగా మరణాల రేటు 1.19గా ఉందని పేర్కొంది.

కేజ్రీవాల్‌కు ఈడీ మూడోసారి సమన్లు



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై ముఖ్య మంత్రి కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముచ్చటగా మూడోసారి సమన్లు పంపింది. జనవరి 3వ తేదీన తమ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అందులో కోరింది. నవంబర్ 2, డిసెంబర్ 21వ తేదీల్లో పంపిన రెండు నోటీసులకు కేజ్రీవాల్ స్పందించలేదు. చట్టవిరుద్ధంగా జారీ చేసిన సమన్లతో ఈడీ విచారణకు హాజరయ్యేది లేదని తేల్చి చెప్పారు. సీఎం కేజ్రీవాల్ ప్రస్తుతం విపాసన మెడిటేషన్ శిక్షణకు వెళ్లారు.

దాడి వెనుక పాక్, చైనా

- లద్దాఖ్ నుంచి ఆర్మీని వెనక్కి తీసుకొచ్చేలా భారత్‌పై ఒత్తిడికి కుట్ర
- కశ్మీర్‌లో ఉగ్రవాద ముఠాలకు రెండు పొరుగుదేశాలు ఊతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గురువారం ఆర్మీ వాహనాలపై దాడి వెనుక పాక్, చైనాల హస్తముందని రక్షణ శాఖ వర్గాలు అంటున్నాయి. లద్దాఖ్ సరిహద్దుల్లో భారీగా మోహరించిన ఆర్మీని మరోవైపు తరలించేలా భారత్‌పై ఒత్తిడి పెంచేందుకే ఆ రెండు దేశాలు కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్నాయి. కశ్మీర్ లోయలో ముఖ్యంగా పాక్ సరిహద్దుల్లో ఉన్న పూంఛ్, రాజౌరీ సెక్టార్లలో భారత ఆర్మీ లక్ష్యంగా ఇటీవల పెరిగిన ఉగ్ర దాడుల ఘటనలకు చైనా, పాకిస్తాన్‌ల ఉమ్మడి వ్యూహమే కారణమని చెబుతున్నాయి. ఆర్మీపై దాడుల ద్వారా భారత్‌ను రెచ్చగొట్టేందుకు పాకిస్తాన్ ఇప్పటికే పూంఛ్ అటవీ ప్రాంతాల్లోకి 25 నుంచి 30 మంది వరకు ఉగ్రవాదులను దొంగచాటుగా పంపించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి.


గురువారం ఉగ్రవాదుల దాడిలో దెబ్బ తిన్న సైనిక వాహనం

కశ్మీర్ వైపు దృష్టి మళ్లించేందుకే..

గల్వాన్ సంక్షోభం అనంతరం భారత్ లద్దాఖ్‌కు భారీగా సైన్యాన్ని తరలించడం చైనాకు రుచించడం లేదు. అందుకే తిరిగి కశ్మీర్ వైపు భారత్ దృష్టిని మళ్లించేందుకే, పాక్‌తో కుమ్మక్కయి పశ్చిమ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని రాజేసేందుకు పూనుకుంది. భారత్ 2020లో ప్రత్యేక శిక్షణ పొందిన రాష్ట్రీయ రైఫిల్స్ బలగాలను పూంఛ్ నుంచి లద్దాఖ్‌కు భారత్ తరలించింది. ఈ చర్యతో ఎంతో కీలకమైన లద్దాఖ్ ప్రాంతంలో చైనాపై భారత్‌దే పైచేయి అయ్యింది. అయితే, అదే సమయంలో పూంఛ్‌లో ఉగ్రవాదులను నిలువరించే వనరులు తక్కువపడ్డాయి. ఈ విషయం గ్రహించిన చైనా పూంఛ్‌లో పాక్‌కు దన్నుగా నిలుస్తూ ఉగ్ర చర్యలకు ఊతమివ్వసాగిందని రక్షణ రంగ నిపుణుడు కల్నల్ మనోజ్ కుమార్ చెప్పారు.

ఆర్టికల్ 370 రద్దుతో కడుపుమంట

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుపై చైనా, పాకిస్తాన్‌లు అసంతృప్తితో రగిలిపోతున్నాయి. అందుకే, కశ్మీర్‌లో ముఖ్యంగా సరిహద్దుల్లో ఉన్న పూంఛ్, రాజౌరీల్లో అశాంతిని ప్రేరేపించేందుకు కాచుక్కూర్చున్నాయని రిటైర్డు కల్నల్ అజయ్ కొఠియాల్ చెప్పారు. తాజాగా, సుప్రీంకోర్టు కూడా రద్దు సరైందేనని తీర్పు ఇవ్వడం ఆ రెండు దేశాలకు పుండుమీద కారం చల్లినట్లయిందన్నారు. ఇకపై జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోసేందుకు అవి ప్రయత్నాలు ముమ్మరం చేసే అవకాశాలున్నాయన్నారు.

అమెరికా తయారీ రైఫిళ్లు: గురువారం నాటి దాడికి తమదే బాధ్యతంటూ పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరేతోయిబా అనుబంధ పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ (పీఏఎఫ్ఎఫ్) ఉగ్రవాదులు ప్రకటించుకున్నారు. దాడికి సంబంధించిన ఫొటోలను వారు సోషల్ మీడియాలో విడుదల చేశారు. వారి చేతుల్లో అమెరికా తయారీ అత్యాధునిక ఎం4 కార్బైన్ అసాల్ట్ రైఫిళ్లు కూడా కనిపిస్తున్నాయి. గతంలోనూ ఉగ్రవాదులు వీటిని వాడిన దాఖలాలున్నాయి.

హెలికాప్టర్లు.. స్నైపర్ డాగ్స్

పూంఛ్ జిల్లాలో అయిదుగురు జవాన్లను పొట్టనబెట్టుకున్న ముష్కరుల కోసం గాలింపు ముమ్మరమైంది. గురువారం మధ్యాహ్నం సురాన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధేరా కి గలి– బఫ్లియాజ్ మార్గంలో ఉన్న ధట్యార్ మోర్హ్ సమీపంలోని మలుపులో ఎత్తైన కొండపై ఉగ్రవాదులు పొంచి ఉన్నారు. బలగాలతో వెళ్తున్న రెండు వాహనాల వేగం బ్లైండ్ కర్వ్‌లో నెమ్మదించగానే ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో అయిదుగురు జవాన్లు నేలకొరగ్గా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ముష్కరులు ఇద్దరు జవాన్ల మృతదేహాలను ఛిద్రం చేయడంతోపాటు వారి వద్ద ఉన్న ఆయుధాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో ముగ్గురు లేదా నలుగురు ముష్కరులు పాల్గొని ఉంటారని ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)అధికారులు తెలిపారు. ఘటన అనంతరం పరారైన ఉగ్రవాదుల కోసం అటవీ ప్రాంతంలో హెలికాప్టర్లతో గాలిస్తున్నారు. ఉగ్రవాదుల జాడను పసిగట్టేందుకు స్నైపర్ జాగిలాలను రంగంలోకి దించారు. ఘటన జరిగిన వెంటనే ఆ ప్రాంతాన్ని దిగ్బంధనం చేసిన బలగాలు శుక్రవారం ఉదయం నుంచి అణువణువూ శోధిస్తున్నాయి.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 23 । డిసెంబర్ । 2023



వ్యూహం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఏర్పాట్లు

లబ్బీపేట: వ్యూహం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాట్లను శుక్రవారం చిత్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, నిర్మాత దాసరి కిరణ్ కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు.



క్రిస్మస్ వెలుగులు

విజయవాడ బీసెంట్ రోడ్డు సమీపంలో రంగు రంగుల క్రిస్మస్ స్టార్లు విద్యుత్ వెలుగులతో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

నగరంలో ఫల, పుష్ప ప్రదర్శన



లబ్బీపేట: విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏపీ ఫ్లవర్ షో 2023 నగర వాసులను ఆకట్టుకుంటోంది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి భక్తుల విరాళాలు




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిత్యం నిర్వహించే అన్నదానానికి విజయవాడ భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. పటమటకు చెందిన వై. వెంకట కోటేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకొని విరాళం అందించింది. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు. అలానే సికింద్రాబాద్ బ్యాంక్ కాలనీకి చెందిన రావినూతల శ్రీనివాసరావు కుటుంబం ఎ.జగదీశ్ చంద్ర పేరిట రూ. లక్ష విరాళాన్ని అన్నదానానికి అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

గుణదల పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ ఏర్పాట్లు



గుణదల (విజయవాడ తూర్పు): మేరీమాత పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రెండవ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన గుణదలలో ఈ నెల 25వ తేదీన క్రీస్తు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పుణ్యక్షేత్ర గురువులు, ఆలయ కమిటీ నిర్వాహకులు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే ప్రాంగణాలన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రధానాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ పండుగ రోజున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయం వద్ద సమిష్టి దివ్యబలి పూజ సమర్పిస్తారు. భక్తుల సౌకర్యార్థం టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. 24వ తేదీ రాత్రి క్రిస్మస్ వేడుకలు ప్రారంభం కానున్నాయి. తరలివచ్చే లక్షలాది మంది భక్తులు బాలఏసును దర్శించుకునే నిమిత్తం చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలో యేసు జననాన్ని సూచించే పశువుల పాక నమూన ఏర్పాటు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల కోసం సకల వసతులు కల్పిస్తున్నారు. క్రిస్మస్ వేడుకలకు హాజరై భక్తులంతా దేవుని దీవెనలు అందుకోవాలని గుణదల పుణ్యక్షేత్ర రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ తెలిపారు. పండుగ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు.

కృష్ణా వర్సిటీ బాస్కెట్‌బాల్ మహిళల జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల బాస్కెట్‌బాల్ మహిళల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కమిటీ చైర్‌పర్సన్, స్టెల్లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కుల్‌రేఖ తెలిపారు. ఈ జట్టులో మేరీస్ స్టెల్లా కాలేజీ విద్యార్థినులు జాస్మిన్, దుర్గ, హరిత, శ్రావ్య, మౌనిక, ఆంధ్రా లయోల కాలేజీ విద్యార్థినులు సంధ్యా, రోహిత, చరిష్మ, సిద్దార్థ మహిళ కళాశాల విద్యార్థినులు గీతశ్రీ, శ్రీజ, సింధూర, కేబీఎన్ కాలేజీ విద్యార్థినులు భవానిసాయి, ఆకాంక్ష, అరుణనాగదుర్గ, వికాస్ కాలేజీ విద్యార్థిని వెన్నెల, పీబీ సిద్దార్థ కాలేజీ విద్యార్థిని చందన చోటు దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

బాక్సింగ్‌లో బంగారు పతకం



ఉయ్యూరు: సీఎం కప్ టోర్నమెంట్‌లో బాక్సింగ్ విభాగంలో ఉయ్యూరు క్రీడాకారిణి ప్రతిభ చాటింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏపీఏ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో విశాఖపట్నంలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించారు. బాక్సింగ్‌లో 36–38 కిలోల విభాగంలో అబ్దుల్ ఆఫియా జబీన్ బంగారు పతకం కైవసం చేసుకుంది. జబీన్, కోచ్ సూర్యనారాయణలను ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి అభినందించారు.

పల్లెల్లో పాల పొంగు

- అమూల్‌తో మినీ శ్వేత విప్లవం
- జగనన్న పాలవెల్లువతో పాడిరైతులకు అదనపు ఆదాయం
- అమూల్ ధమాల్ అంటూ రామోజీ రోత రాతలు
- పాల వెల్లువపై ఈనాడు విషం
- ఇతర డెయిరీలకు మించి ధర
- వెన్న శాతాన్ని బట్టి గరిష్టంగా లీటరుకు రూ.104



గంపలగూడెం మండలం మేడూరులో పాలు సేకరిస్తున్న దృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'అమూల్ ధమాల్' శీర్షికతో ఎప్పటి లాగే రామోజీ తన రోత రాతల శైలిని కొనసాగించారు. జగనన్న పాల వెల్లువపై ఈనాడు విషం చిమ్మింది. పూర్వపు కృష్ణా జిల్లాలో పాల పొంగు రామోజీ కళ్లకు కనిపించడం లేదు. మహిళా పాడి రైతులు ఆర్థికంగా స్థిరపడటం ఈనాడు జీర్ణించుకోలేకపోతోంది. రెండు సంవత్సరాలుగా జిల్లాలో జగనన్న పాల వెల్లువ (జేపీవీ) కింద పాల సేకరణ మెరుగుపడడం లేదని, కృష్ణా మిల్క్ యూనియన్ రైతులకు అమూల్ కంటే ఎక్కువ ధర చెల్లిస్తోందని తప్పుడు కథనాన్ని వండి వార్చింది.

- వాస్తవానికి పూర్వపు కృష్ణా జిల్లాలో జగనన్న పాల వెల్లువ (జేపీవీ) ప్రాజెక్టు కింద అమూల్ పాల సేకరణ కార్యకలాపాలు గతేడాది డిసెంబర్ 14న ప్రారంభించింది. తొలుత నూజివీడు, ఆగిరిపల్లి, ఎ.కొండూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, ముసునూరు ఆరు మండలాల్లోని 51 గ్రామాల్లో పాలసేకరణ చేపట్టింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 362 మంది మహిళా పాడి రైతులు నుంచి రోజుకు 782 లీటర్ల చొప్పున పాలు సేకరించింది.
- తదుపరి తిరువూరు, చాట్రాయి, విస్సన్నపేట, బాపులపాడు, జి కొండూరు, మైలవరం మండలాల్లోని 140 గ్రామాలకు పాలసేకరణ కార్యక్రమాలు విస్తరించింది.
- ప్రస్తుతం జగనన్న పాలవెల్లువ 12 మండలాల పరిధిలోని 191 గ్రామాల్లో అమలవుతోంది. దీని ద్వారా కృష్ణా జిల్లాకు చెందిన 5,520 మంది మహిళా పాడి రైతులు రోజుకు సగటున 18,000 లీటర్లు పాలు పోస్తున్నారు. 20 గ్రామాల్లో రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ పాలను సేకరిస్తున్నారు.
- మధ్యవర్తుల జోక్యాన్ని తొలగించి మహిళా పాడి రైతులకు ప్రతి పది రోజులకోసారి పాల బిల్లులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ఈ పథకం ద్వారా సేకరించిన పాల పరిమాణం ఆధారంగా పాల బిల్లు మొత్తంతోపాటు ప్రత్యేక ప్రోత్సాహకం కింద సేకరించిన పాలకు లీటరుకు రూ.1.00 నుంచి 2.75 వరకు అమూల్ కూడా చెల్లిస్తోంది.
- రాష్ట్ర వ్యాప్తంగా 3.78 లక్షల మంది పాడి రైతులను కవర్ చేస్తూ 4,127 గ్రామాల్లో ప్రాజెక్ట్ అమలవుతోంది. సగటున 98,919 మంది రైతులు చురుకుగా పాలు పోస్తున్నారు. రోజుకు 3.52 లక్షల లీటర్లు పాలు సేకరిస్తున్నారు. జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా మహిళా సహకార సంఘాల పునరుద్ధరణ, పాల సేకరణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం వల్ల రాష్ట్రంలో పాల సేకరణ అనేక రెట్లు పెరిగేందుకు దోహదపడింది.
- 2023 డిసెంబర్ నెలలో పాల సేకరణ జూలై నెలలో సేకరణ వృద్ధిని అధిగమించింది. రోజుకు 1.74 లక్షల లీటర్ల నుంచి 3.52 లక్షల లీటర్లకు ఆశ్చర్యకరమైన వృద్ధిని నమోదు చేసింది. రాష్ట్రంలో ఇదొక మినీ శ్వేత విప్లవంగా పరిణమించింది.
- ఏడాదికి 180 రోజులకు తక్కువ కాకుండా పాలు పోసే మహిళా పాడి రైతులకు లాయల్టీ ఇన్సెంటివ్‌గా అమూల్ రూ. 492.63 లక్షలు చెల్లించింది.

ఏడు సార్లు పెరిగిన పాల సేకరణ ధర....

- జేపీవీ ప్రాజెక్ట్ ప్రారంభించినప్పటి నుంచి అమూల్ పాల సేకరణ ధరలు ఏడు పర్యాయాలు పెంచింది. ఫలితంగా గేదె పాల ధర రూ. 71.47 నుంచి రూ. 18.29 పెరిగి రూ. 89.76 చేరుకుంది. ఆవు పాల ధర లీటరు రూ. 34.20 నుంచి రూ. 9.49 లీటరు పెరిగి రూ.43.69కు చేరింది.
- 13 శాతం ఫ్యాట్, 9 శాతం ఎస్ఎన్ఎఫ్ ఉన్న పాలకు అమూల్ లీటర్‌కు రూ. 104 ధర చెల్లిస్తోంది. ఇది రాష్ట్రంలోనే అత్యధిక ధర. ఏ ఇతర డెయిరీలు ఇంత మొత్తంలో చెల్లించడం లేదు.
- పాలలో నాణ్యత పెంచేందుకు అమూల్ అత్యంత నాణ్యమైన పశువుల దాణా సరఫరా చేస్తోంది.
- దాణా, పశువైద్య సహాయం, కార్మికులు, నీరు, విద్యుత్ సరఫరా కోసం మహిళా పాడి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందిస్తున్నారు.
- పాడి పశువుల కొనుగోలుకు, వ్యాపార కార్యకలాపాల విస్తరణకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తోంది. కృష్ణా జిల్లాలో జేపీవీ మరో 15 మండలాల్లో 490 గ్రామాల్లో పాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

శాస్త్రీయ విజ్ఞానంతో సమాజాభివృద్ధి

- జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక
- విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శాస్త్రీయ విజ్ఞానంతో సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో దక్షిణ భారత జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన–2023 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. రాతియుగంలో చెట్లు, జంతువులతో కలిసి జీవించే స్థితి నుంచి నేడు అంతరిక్షంలో విహరించే స్థాయికి మనిషి విజ్ఞానం సంపాదించాడంటే దానికి ప్రధాన కారణం శాస్త్రీయ విజ్ఞానమేనని చెప్పారు. విశిష్ట అతిథి ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చదువుకు ఎంత ప్రాధాన్యతను ఇస్తున్నారనే విషయం ప్రపంచమంతా చూస్తోందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయిలో మన విద్యార్థులు పోటీ పడే విధంగా విద్యా వ్యవస్థలో చారిత్రాత్మక మార్పులకు మన సీఎం జగనన్న శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. శాస్త్రీయ విజ్ఞానంలో విద్యార్థులకు మరింత అవగాహన, ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, డీవైఈవో కేఎస్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం బెంగళూరు వారి సహకారంతో పాఠశాల విద్యా శాఖ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనకు జిల్లాలోని 20 మండలాల నుంచి వ్యక్తిగత కేటగిరీలో–35, గ్రూప్ కేటగిరీలో–38, టీచర్ కేటగిరీ నుంచి –18 మొత్తం 91 ప్రాజెక్టులు పోటీపడ్డాయి. అనంతరం జిల్లా స్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన 9 ప్రాజెక్టుల విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్‌లు అందజేశారు.



జ్యోతి వెలిగించి ప్రదర్శన ప్రారంభిస్తున్న డీఈవో రేణుక, పుణ్యశీల, షాహీనా సుల్తానా తదితరులు

స్పాట్ అడ్మిషన్‌లకు నోటిఫికేషన్ విడుదల

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ సీట్ల స్పాట్ అడ్మిషన్‌లకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ నవీన లావణ్య తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బ్లాక్‌లో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. అదే రోజు దరఖాస్తు దాఖలు, సంబంధిత కోర్సుల్లో ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఏపీఐ సెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్‌లు పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి మూడేళ్ల డిగ్రీ పొందిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కృష్ణా విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ చూడాలన్నారు.

బెంజిసర్కిల్‌లో కాకాని విగ్రహం పునఃప్రతిష్ట

- ఆవిష్కరించిన దేవినేని అవినాష్
- అభివృద్ధి పేరుతో తొలగించిన టీడీపీ ప్రభుత్వం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అభివృద్ధి పేరుతో గత టీడీపీ ప్రభుత్వం తొలగించిన జై ఆంధ్ర ఉద్యమనేత, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ట్రెండ్‌సెట్‌మాల్ ఎదురుగా రెండో ఫ్లై ఓవర్ కింద అందరికీ కనిపించేలా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని శుక్రవారం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తరుణ్ కాకానిలతో కలిసి వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాష్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం తొలగించిన కాకాని విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాలని పలువురు కోరగా, విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం చేసి, విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. గొప్ప వాళ్ల గురించి భవిష్యత్ తరాలకు చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో దీనిని కాకాని సర్కిల్‌గా నామకరణం చేసే విధంగా కార్పొరేషన్‌లో తీర్మానం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తరుణ్ కాకాని మాట్లాడుతూ దేవినేని అవినాష్ చొరవతో ఇక్కడ విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్ఠ చేయగలిగామన్నారు. అందుకు సహకరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, యార్లగడ్డ వెంకట్రావు, కాకాని విజయ్‌కుమార్, గోగినేని ధనశేఖర్, ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

నోట్ల కట్టలుంటేనే టీడీపీ టికెట్

- ఓటమి ఖాయం అనే భయంతో సొంత డబ్బులు పెట్టేందుకు నసేమిరా
- కుటుంబీకుల ఒత్తిడితో వ్యూహం మార్చిన బాబు
- డిపాజిట్ చేసినోళ్లకే టికెట్ అంటూ షరతు
- ఆ క్రమంలో సీనియర్లను పక్కన పెడుతున్న వైనం
- దీంతో బిత్తరపోయిన గద్దె, దేవినేని ఉమా
- గుడివాడలో రావిని పక్కన పెట్టి వెనిగండ్లకు సీటు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీలో టికెట్ల గోల మొదలైంది. కేవలం డబ్బున్నోళ్లకే చంద్రబాబు టికెట్లు కట్టబెడుతున్నారనే ప్రచారం ఆ పార్టీలో జోరుగా సాగుతోంది. సీనియర్లు అయినా, పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నవారైనా సరే పట్టించుకోకుండా కేవలం కరెన్సీ కట్టలు తేగలిగిన వారికే టికెట్లు ఇస్తామని ఆ పార్టీ అధినేత చెబుతున్నారు. ధనం మూలం ఇదం 'దేశం'అనే ఆర్యోక్తిని చంద్రబాబు బాగా వంటపట్టించుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమ, అభివృద్ధి సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ వైఎస్సార్ సీపీ ఏక పక్ష విజయం సాధించడమే దానికి తార్కాణం. గత అసెంబ్లీ ఎన్నికల కంటే రానున్న ఎన్నికల్లో మరింత ఘోర పరాభవం తప్పదని చంద్రబాబు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఉనికినైనా చాటుకోవటానికి అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న డబ్బులను వెదజల్లుదామంటే కొడుకు లోకేష్, భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి అడ్డు తగులుతున్నారు. ఘోరంగా ఓడిపోవడానికి డబ్బులు తగలెయ్యడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేయడంతో చంద్రబాబు వ్యూహం మార్చారు. యథావిధిగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం అని గోబెల్స్‌ను తలదన్నే రీతిలో ఎల్లో మీడియాతో కలిసి ప్రచారం చేస్తున్నారు. దానిని అడ్డుపెట్టుకొని ఎన్నికల్లో టికెట్ కావాలంటే డబ్బులు డిపాజిట్ చేయాలని షరతు పెడుతున్నారు. దీనిపై పార్టీలోని సీనియర్లు బెంబేలెత్తిపోతున్నారు. జనరల్ నియోజకవర్గానికి సగటున రూ.35 కోట్లు డిపాజిట్ చేసిన వారికే టికెట్ ఇస్తామని కరాఖండీగా చెబుతున్నారు.

గద్దె సైలెంట్...

తూర్పు నియోజకవర్గం నుంచి గద్దె రామోహ్మనరావు వరుసగా రెండు సార్లు గెలిచారు. ఈసారి టికెట్ ఇవ్వాలంటే రూ.35 కోట్లు డిపాజిట్ చేయాలని చంద్రబాబు కోరినట్లు ఆయన వర్గీయులే చెబుతున్నారు. ఆ స్థాయిలో డిపాజిట్ చేయలేనని గద్దె తేల్చి చెప్పినట్లు చెబుతున్నారు. దీంతో మరో అభ్యర్థిని చూసుకొంటానని, ప్రత్యామ్నాయంగా ఎక్కడో చోట అవకాశం కల్పిస్తామని చంద్రబాబు చెప్పడంతో గద్దె నిశ్చేష్టుడైనట్లు టీడీపీ కీలక నేత ఒకరు పేర్కొన్నారు. దీంతో కొంత కాలంగా ఆయన అంటీ ముట్టనట్లు ఉంటున్నారు. నియోజకవర్గంలోని కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఉమా ఉక్కిరి బిక్కిరి....

ప్రజాదరణ పక్కన పెడితే చంద్రబాబు శిష్యుడు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీలో చక్రం తిప్పిన మాజీ మంత్రి దేవినేని ఉమాకు ఇప్పుడు కష్టాలు మొదలయ్యాయి. పాపం తన టికెట్‌కు లోకేష్ ఎసరు పెడుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు సంపాదించిన డబ్బు రూ.35 కోట్లు డిపాజిట్ చేస్తేనే టికెట్ అని, మైలవరంగానీ, పరిస్థితిని బట్టి ఇంకో నియోజకవర్గంలో గానీ అవకాశాలు కల్పిస్తామని లోకేష్ నిక్కచ్చిగా చెప్పడంతో ఉమా చంద్రబాబును ఆశ్రయించారు. బాబు సైతం లోకేష్ చెప్పిన మాటలకు వంత పలకడంతో దేవినేని డైలమాలో పడ్డారు. ఓటమి ఖాయంగా కనిపిస్తున్నప్పుడు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకోవడమా, లేదంటే పోటీకి దూరంగా ఉండి ఎమ్మెల్సీ ఇస్తే తీసుకోవడమా అనే మీమాంసలో ఉన్నారు.

రగిలిపోతున్న సీనియర్లు....

టీడీపీ ఆవిర్భావం నుంచి నమ్ముకొని అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ వెన్నంటి నడిచిన నాయకులను చంద్రబాబు, లోకేష్ గడ్డిపోచలా తీసి పారేస్తున్నారు. డబ్బున్న నేతలు, ఎన్నారైలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో సీనియర్లు రగిలిపోతున్నారు. గుడివాడలో పార్టీ పుట్టినప్పటి నుంచి ఉన్న రావి వెంకటేశ్వరావును పక్కన పెట్టి వెనిగండ్ల రామును అభ్యర్థిగా ఖరారు చేయడంలో కేవలం డబ్బు సంచులను చూసేనని టీడీపీ వర్గీయులే అంటున్నారు. గన్నవరంలో సైతం యార్లగడ్డ వెంకట్రావుకు టికెట్ ఖరారు చేయడంలో ఇదే ఫార్ములా పాటించినట్లు పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. ఇంకా ఇలా పార్టీలో ఎంత మందికి ఎర్త్ పెడతారోనని సీనియర్లు మదనపడుతున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులను డబ్బున్న వారిని, ఎన్నారైలను వెతుకులాడే పనిలో నిమగ్నమయ్యారు.

క్రీడల సాధనతో ఉన్నత శిఖరాలు



జ్యోతి ప్రజ్వలన చేసి తైక్వాండో జాతీయ పోటీలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి అప్పారావు


- న్యాయమూర్తి ఏబీ అప్పారావు

విజయవాడ స్పోర్ట్స్: క్రీడల సాధనతో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విజయవాడ రెండో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఏబీ అప్పారావు తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి 38వ తైక్వాండో బాలబాలికల పోటీలను న్యాయమూర్తి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించేందుకు వచ్చిన 300 మంది క్రీడాకారులతో విజయవాడకు క్రీడా శోభ సంతరించుకుందని చెప్పారు. కశ్మీర్ లాంటి దూర ప్రాంతాల నుంచి క్రీడాకారులు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ జాతీయ పోటీల్లో మెరుగైన క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి దేశ ఖ్యాతిని నలుదిశలా చాటాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పిస్తున్నాయని గుర్తు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి ఈ పోటీలకు వచ్చిన క్రీడాకారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. భారత తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రాండ్ మాస్టర్ బి.వి.రమణయ్య మాట్లాడుతూ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. వ్యక్తిగత స్పారింగ్, గ్రూప్ స్పారింగ్, వ్యక్తిగత తుల్, గ్రూప్ తుల్ విభాగాల్లో క్రీడాకారులు తలపడతారని వెల్లడించారు. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజర్ డి.వి.వి. ప్రసాద్, పలు రాష్ట్రాల తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యార్డులో 37,506 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 34,641 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 37,506 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 23,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,507 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు నృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనం



బంగారు గరుడ వాహనంపై జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

మంగళగిరి: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి శనివారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వారం నుంచి దర్శనం ఇవ్వనున్నారు. స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి జగన్మోహిని అలంకారంలో బంగారు గరుడ వాహనంపై స్వామి గ్రామోత్సవంలో భక్తులను కటాక్షించనున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల అనంతరం ప్రత్యేక పూజలు, తిరువంజనోత్సవం నిర్వహించుకుని ప్రత్యేక అలంకరణతో బంగారు గరుడ వాహనంపై తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ముక్కోటి ఉత్సవంలో ప్రధానమైన దక్షిణావృత్త బంగారు శంఖును శుక్రవారం ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి, పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి దర్శనం చేసుకున్న భక్తులు బంగారు శంఖుతో తీర్థం స్వీకరించనున్నారు. భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కోడూరు(అవనిగడ్డ): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన మానికొండ రమేష్‌కు తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన విజయశ్రీ(33)కు 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ కాంట్రాక్ట్ పద్ధతిలో కోడూరు పంచాయతీ ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే రమేష్ తన పని నిమిత్తం శుక్రవారం వేకువజామున కోడూరుకు వచ్చాడు. ఉదయం 6 గంటల సమయంలో కుమారుడు మణికంఠ లేచి బాత్‌రూమ్‌కి వెళ్లగా అక్కడ తల్లి విజయశ్రీ అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో కంగుతున్న మణికంఠ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి విజయశ్రీని పరిశీలించగా, ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. విజయశ్రీకి లోబీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, దీంతో స్పృహ కోల్పోయి మృతి చెంది ఉంటుందని మృతురాలి తల్లి సమ్మెట విశాలాక్ష్మి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

హైవేపై బీభత్సం సృష్టించిన కారు

విధి వైపరీత్యం అంటే ఇలాగే ఉంటుంది కాబోలు. ఎక్కడో కేరళ రాష్ట్రం నుంచి ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగులో ఓ మిషనరీ పరిశీలించడానికి వచ్చిన వ్యక్తి పని ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి వెళుతుండగా విజయవాడ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు డివైడర్‌ను దాటి ఇవతలి వైపునకు వచ్చి ఈయన ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కేరళ ఇంజినీర్ అక్కడికక్కడే మరణించారు.



హైవేపై బీభత్సం సృష్టించి ప్రమాదానికి కారణమైన కారు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ఓ వ్యక్తి హైవేపై బీభత్సం సృష్టించారు. చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం కోడూరుపాడులో జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళ్లితే.. రాజమహేంద్రవరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అంకం ప్రవీణ్ కుమార్ కారులో విజయవాడ వైపు నుంచి అతివేగంగా వస్తుండగా కోడూరుపాడు వద్ద కారు అదుపు తప్పింది. హైవే మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుకుని ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొనటంతో ఆ కారు వెళ్లి దాని ముందు ఉన్న 108 అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రవీణ్‌కుమార్ ఢీకొట్టిన కారులో వెనుక సీటులో కూర్చుని ప్రయాణిస్తున్న కేరళకు చెందిన ఇంజినీర్ థామస్ (60) దుర్మరణం చెందారు. ప్రమాదం జరగగానే ఎయిర్ బెలూన్ ఓపెన్ కావటంతో కారులో ముందు సీట్లలో కూర్చున వ్యక్తులు ప్రాణాలతో క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో 108 అంబులెన్స్ కూడా పాక్షికంగా దెబ్బతింది. ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు గ్రామంలోని ఓ ఫ్యాక్టరీలో మిషనరీ పరిశీలించేందుకు కేరళ నుంచి వచ్చిన థామస్ తిరిగి వెళ్లేందుకు కారులో గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరగా, ఈ రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ ఘటనపై వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరసింహారెడ్డి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌కు చెందిన బిక్క నరసింహారెడ్డి నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి నిస్వార్థంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డిని సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి అభినందించారు.

ఎస్ఆర్ఆర్‌లో కృష్ణా వర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కృష్ణా యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం జరిగింది. సమావేశంలో బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్సు, మ్యాథ్స్, ఇంగ్లిషు సబ్జెక్టుల ఎక్స్‌పర్ట్‌లు, సీనియర్ ఫ్యాకల్టీలు పాల్గొని 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సిలబస్, ప్రశ్నపత్రాల విషయాల గురించి చర్చించారు. కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జ్ఞానమణి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ వీర్రబ్రహ్మాచారి, అకడమిక్ ఆడిటర్ నవీన, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుందర్‌కృష్ణ ఆన్‌లైన్‌లో బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు.

క్లుప్తంగా

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురేంద్ర



లబ్బీపేట(విజయవాడతూర్పు): కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన వారు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి, తప్పక పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. పురేంద్ర అన్నారు. బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్‌మాల్‌లో రెడ్‌ఎఫ్‌ఎం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆటో ఎక్స్‌పోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇలాంటి ఎక్స్‌పోలు ఉపయోగపడతాయన్నారు . ఈ ఎక్స్‌పోలో బైక్స్, స్కూటర్స్, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్‌హెడ్ ఆదిల్‌బాషా, క్రాంతికుమార్, సుధాకర్, మాల్ ఇన్‌చార్జి జగన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ అన్నారు. ఆ కళాశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని పురస్కరించుకుని నేషనల్ మేథమెటిక్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాథ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, గణిత నమూనాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ అనురాధ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రియేటివిటీ, లాజికల్‌థింకింగ్, ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు పాజిటివ్ ఆటిట్యూడ్‌ని కలిగి ఉండాలని, ఎడ్యుకేషన్ అంటే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమన్నారు. కార్యక్రమంలో మేథమేటిక్స్ హెచ్‌ఓడీ వి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఖ్యాతిని పెంచాలి



విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ పోటీల్లో రాణించి విజయవాడ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని రోలర్ స్కేటింగ్ జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బచ్చు మాధవికృష్ణ కోరారు. చెన్నై, చండీగఢ్‌లలో ఇటీవల జరిగిన 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులు వరుణ్‌కృష్ణ, మదన సుచిత్ర, పోతల విజయ్‌డానియేల్, బుగతా జతీన్, కోపూరి శాన్విరఫియా, సీ.హెచ్.అభిరామ్, జి.ప్రణవ్‌రెడ్డి, పి.హరిచరణ్‌లను బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలోని బెజవాడ రోలర్ స్పోర్ట్స్ కార్యాలయంలో ఆమె శుక్రవారం అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

గుంటతిప్ప డ్రెయిన్‌ను త్వరలో ఆధునికీకరిస్తాం



ఆటోనగర్(విజయవాడతూర్పు): గుంటతిప్ప డ్రెయిన్ ఆధునికీకరణ పనులు చేసేందుకుగాను ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్ డాక్టర్ పీఎస్ ప్రకాశరావు అన్నారు. శుక్రవారం జేఆర్‌డీ టాటా ఐలా 17వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్ స్టేట్ జనరల్ కార్యదర్శి బి. రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్ ప్రకాశరావు, బి. రాజశేఖర్‌లను జేఆర్‌డీ టాటా ఐలా చైర్మన్ వినోద్‌బాబు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేఆర్‌డీ ఐలా కార్యదర్శి టి. శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కేఎస్ఎస్ శీతారాం పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలకు 'అండర్ పాస్'తో చెక్

- స్క్రూ బ్రిడ్జి వద్ద ఏర్పాటుకు మార్గం సుగమం
- ఆర్అండ్‌బీ, నగర పాలక సంస్థ అధికారుల పరిశీలన
- పటమటలంక, ఫకీరుగూడెం వాసులకు ప్రయోజనకరం
- దేవినేని అవినాష్ చొరవతో తీరిన సమస్య



అధికారులతో కలిసి అండర్‌పాస్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ రెహనా నాహీద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలోని ఫకీరుగూడెం స్క్రూ బిడ్జి వద్ద అండర్ పాస్ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. పటమటలంక, ఫకీరుగూడెం, రామలింగేశ్వరనగర్ ప్రజల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా దేవినేని అవినాష్ చొరవతో అధికారులు కదిలారు. తొలుత ఆ ప్రాంతంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న కుటుంబాలకు న్యూ రాజరాజేశ్వరిపేటలో శాశ్వత ఇళ్లు కేటాయించి, ఇక్కడ ఖాళీ చేయించారు. అనంతరం అండర్ పాస్ ఏర్పాటుకు సంబంధించి ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో కలిసి ఇటీవల దేవినేని అవినాష్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అండర్ పాస్ ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. నగర పాలక సంస్థలో తీర్మానం చేసి, వీలైనంత త్వరలోనే అండర్‌పాస్ ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని నిర్ణయించారు.

ఇదీ సమస్య..

గతంలో పటమటలంక నుంచి ప్రజలు నగరంలోకి వచ్చేందుకు స్క్రూబ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై దారి ఉండేది. దీంతో బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా రామలింగేశ్వరనగర్, పటమట లంక ప్రాంతాలకు చెందిన వారు నగరంలోకి వచ్చేవారు. జాతీయ రహదారి విస్తరణ, ఫ్లై ఓవర్‌ల నిర్మాణంతో వారికి దారిలేకుండా పోయింది. దీంతో పటమట లంక, రామలింగేశ్వర నగర్ ప్రజలు నగరంలోకి వచ్చేందుకు బెంజిసర్కిల్ మీదుగా రావాల్సి వస్తోంది. దీంతో వారు తీవ్రమైన ట్రాఫిక్‌ను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనికి పరిష్కారంగా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని చాలా కాలం నుంచి కోరుతున్నారు.

అవినాష్ చొరవతో..

పటమట లంక ప్రజలు ట్రాఫిక్ కష్టాలను దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ముందుగా వంతెన కింద తాత్కాలిక గుడిసెలు వేసుకుని ఉంటున్న కుటుంబాలకు న్యూ రాజరాజేశ్వరిపేటలో శాశ్వత ఇళ్లు కేటాయించారు. అనంతరం విషయాన్ని ఆర్అండ్‌బీ, నగర పాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు వచ్చి పరిశీలించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం అనంతరం అండర్‌పాస్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. తమ ప్రాంత ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు దేవినేని అవినాష్ అని అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి..



స్క్రూబిడ్జి వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని పటమటలంక ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ విషయాన్ని గతంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం దేవినేని అవినాష్ చొరవతో పటమటలంక వాసులకు ట్రాఫిక్ లేని దారి ఏర్పాటు కానుంది. ఇది దాదాపు 40 వేల మందికి ప్రయోజనకరంగా ఉంటుంది.

– వల్లూరు ఈశ్వరప్రసాద్, 9వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, పటమటలంక

మంచి పరిణామం..



మేము పటమటలంక వెళ్లాలంటే బెంజిసర్కిల్ మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా ప్రాంతంలో సబ్‌వే ఏర్పాటు చేస్తే ఎలాంటి ట్రాఫిక్ లేకుండా వెళ్లవచ్చు. అంతేకాక పటమటలంక, రామలింగేశ్వరనగర్ నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇటుగా వెళ్లవచ్చు.

– ఈద సులోచన, రిటైర్డ్ ఉద్యోగి ఫకీరుగూడెం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కొండారెడ్డి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 22వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి శంకుస్థాపన చేశారు. ధోబీకానా ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు చేసేందుకు వీఎంసీ నుంచి రూ.10లక్షల 34వేలు మంజూరవడంతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ప్రకటనలో తెలిపారు. కళానగర్, రిజిస్ట్రార్ ఆఫీస్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, ఆచార్య రంగా నగర్, త్రిపుల్ ఎస్ ఇడ్లీ హోటల్ రోడ్డు, బందరు రోడ్డు, లలితా జ్యూవెలరీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

గణితంపై మక్కువ పెంచుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గణితంపై విద్యార్థులు భయాన్ని పక్కన పెట్టి మక్కువ పెంచుకోవాలని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ (బీఎస్ఆర్‌కే) హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.నాగరాజు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న బీఎస్ఆర్‌కే స్కూల్ ఆవరణలో శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. నిత్యజీవితంలో గణితం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. గణితంపై విద్యార్థులు తయారు చేసిన వివిధ అంశాలతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయోలలో గణితశాస్త్ర దినోత్సవం..

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు గణిత శాస్త్రంపై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని లయోల కళాశాల విశ్రాంత అధ్యపకుడు ఎన్వీ రమణమూర్తి అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో గణితశాస్త్ర దినోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గణిత శాస్త్రంలో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పత్ర సమర్పణ, క్విజ్, పోటీలను నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, గణిత శాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాల రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గణిత ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఘనంగా జాతీయ గణిత దినత్సోవం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామనుజన్ జయంతిని పురస్కరించుకుని కృష్ణలంకలోని శ్రీచైతన్య స్కూల్ ఆవరణంలో జాతీయ గణిత దినోత్సవం(గణిత ఫెస్ట్)ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి గణిత శాస్త్రంలో రామానుజన్ కృషిని వివరించారు. స్కూల్ ఆవణంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. అకడమిక్ డీన్ ఆర్.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజలకు ఎంతో మేలు

'వై ఏపీ నీడ్స్ జగన్'లో దేవినేని అవినాష్



పథకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు ప్రవేశపెట్టి ప్రజల చెంతకే పాలనను తీసుకు వచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని, ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా 8వ డివిజన్ 63వ సచివాలయం, 20వ డివిజన్ 101వ సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించి, అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు.

ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ 63వ సచివాలయం పరిధిలో 2,463 మంది లబ్ధిదారులకు రూ.9 .76 కోట్లు, 101 సచివాలయం పరిధిలో 4,257 మందికి రూ. 11.95 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు తెలిపారు. కాగా 20వ డివిజన్ ప్రజల చిరకాల కోరిక అయిన రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 8వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి యలమంచిలి జయ, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, సురేష్, రాజు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన వెలుగు ఏసుక్రీస్తే



మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో నిర్వహించిన దీపారాధనలో పాల్గొన్న క్రైస్తవులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఏసుక్రీస్తు పుట్టుక ద్వారా లోకానికి వెలుగు వచ్చిందని మెస్సీయ ఫెలోషిప్ చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. క్రిస్మస్ పండుగలో భాగంగా శుక్రవారం రాత్రి క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. రత్నకుమార్ మాట్లాడుతూ క్రీస్తు జన్మించడం ద్వారా మానవునికి మోక్షం లభించిందన్నారు. కార్యక్రమంలో మెస్సీయ ఫెలోషిప్ వ్యవస్థాపకుడు సజ్జా ఎలియాజర్, జ్యోతి, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

సెయింట్‌జాన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దారితప్పి అల్లాడుతున్న ప్రజలను ఉద్ధరించేందుకు రక్షకుడు ఏసు జన్మించాడని బ్రదర్ ఎం ఆసీవ్ అన్నారు. మహాత్మా గాంధీరోడ్డులోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ జేవీ అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. పాఠశాల ప్రెసిడెంట్ మోనికా సుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, పాఠశాల అకడమిక్ డీన్స్ పాల్గొన్నారు.



సెయింట్‌జాన్స్ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్యం

దుర్గమ్మ సన్నిధిలో రద్దీ సాధారణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులతో పాటు అయ్యప్పలు, స్వాములు, భవానీలు తరలివచ్చారు. శబరిమలై యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారు కొందరయితే, ఇరుముడిని ధరించి శబరిమలైకు వెళ్తూ అమ్మవారిని దర్శించుకునేందుకు మరి కొంత మంది స్వాములు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ



గుణదల(విజయవాడ తూర్పు): నూతన సంవత్సర వేడుకల్లో యువతను ఉర్రూతలూగించే దిశగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు ఐకా ఈవెంట్ ఆర్గనైజేషన్ సంస్థ సీఈఓ డి.జయదుర్గ అన్నారు. గుణదల హయత్ ప్లేస్ హోటల్‌లో ఐకా న్యూ ఇయర్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జయదుర్గ మాట్లాడుతూ, ఈ నెల 31వ తేదీన మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో అట్టహాసంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఆర్ఆర్ఆర్ చిత్రంలో నాటు నాటు అంటూ పాడిన గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఈ వేడుకలకు హాజరు కానున్నారని తెలిపారు. తన బృందంతో పాప్ సాంగ్స్ పాడి యువతను ఉర్రూతలూగిస్తారని పేర్కొన్నారు. అనంతరం న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్‌ను సింగర్ రాహుల్ సిప్లి గంజ్‌తో కలిసి ఆవిష్కరించారు.

ప్రారంభమైన హోమగుండం నిర్మాణ పనులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జనవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే భవానీ దీక్ష విరమణకు అవసరమైన హోమగుండం నిర్మాణ పనులను శుక్రవారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహా మండపం వద్ద ఏర్పాటు చేసే హోమగుండం పనులకు చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆలయ స్థానాచార్య శివప్రసాద్‌శర్మ పూజాది కార్యక్రమాలను జరిపించారు. దీక్షవిరమణలను పురస్కరించుకుని ఏటా దేవస్థానం మహా మండపం ఎదుట రెండు, మహా మండపం దక్షణం వైపున మరో హోమ గుండాన్ని ఏర్పాటు చేస్తోంది. అదే రీతితో ఈ ఏడాది కూడా మూడు హోమగుండాలను ఏర్పాటు చేసేందుకు దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్. రమాదేవి, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా చిన్న లడ్డూల పంపిణీ..

దుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు ఇకపై చిన్న లడ్డూను ఉచితంగా అందచేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద శుక్రవారం ఉచిత లడ్డూ పంపిణీని చైర్మన్ కర్నాటి రాంబాబు లాంఛనంగా ప్రారంభించారు. తొలి రోజున అమ్మవారి ఆలయ ప్రాంగణంలో లడ్డూలను భక్తులకు పంపిణీ చేస్తున్నామని, శనివారం నుంచి ఉచిత ప్రసాదాల పంపిణీ కేంద్రంలో లడ్డూలను భక్తులకు అందజేస్తామన్నారు.

29న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి సమావేశం ఈ నెల 29వ తేదీన జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని పరిపాలనా భవనంలో నిర్వహించే ఈ సమావేశంలో రానున్న భవానీ దీక్షల ఏర్పాట్లు, సాధారణ పరిపాలనా అంశాలు చర్చకు రానున్నాయి. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈవో కేఎస్ రామారావులతో పాటు ఆలయ ముఖ్య విభాగాల అధికారులు హాజరు కానున్నారు.

జమాక్‌కు పూర్తి సహకారం

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో దేవినేని అవినాష్



దేవినేని అవినాష్, దుర్గాప్రసాద్‌లను గజమాలతో సన్మానిస్తున్న జమాక్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జమాక్ భవన సముదాయంలో నివసిస్తున్న ఇంటి యజమానులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం జమాక్ రెసిడెన్షియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవినేని అవినాష్ హాజరయ్యారు. ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ జమాక్ నూతన అధ్యక్షులు త్రిపురనేని హనుమాల్ నాగచంద్, కార్యదర్శి జానీబాషా, కోశాధికారి బి. రమేష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, మాజీ ఐలా చైర్మన్ దుర్గాప్రసాద్‌ను నూతన పాలకవర్గ సభ్యులు ఘనంగా గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జమాక్ కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ కత్తిక శివనాగేశ్వరరావు, ఐలా మాజీ కార్యదర్శి అన్నె శివనాగేశ్వరరావు, జమాక్ గౌరవాధ్యక్షుడు సుంకాని వెంకట త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

• ఆకట్టుకున్న అగ్రి ఎక్స్ పో





నేషనల్ ఫార్మర్స్ డేను పురస్కరించుకుని మారిస్ స్టెల్లా కళాశాలలో అగ్రి ఎక్స్ పోను శుక్రవారం నిర్వహించారు. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వ్యవసాయంలో ఉపయోగపడే కొన్ని యంత్ర నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. సోలార్ టెక్నాలజీ, రోబోటిక్స్, డ్రోన్ సహాయంతో వ్యవసాయం చేయడం వంటి అధునాతన పద్ధతులను వివరించారు. నూతన వంగడాలతో, సేంద్రియ పద్ధతులతో విద్యార్థులు సాగు చేసిన పంటను ప్రదర్శించారు. విజయవాడ పరిసర ప్రాంత రైతులు, కళాశాలలు, స్కూళ్ల విద్యార్థులు నమూనాలను తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

మహిళా వలంటీర్.. ఇక సబ్ ఇన్‌స్పెక్టర్



సత్యవేడు(తిరుపతి జిల్లా): సత్యవేడు-2 సచివాలయంలో వలంటీర్‌గా సేవలు అందిస్తున్న జి.శోభ ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, కోటమిట్ట గ్రామానికి చెందిన పారిజాతం(అమ్ము) రేషన్ షాపు నిర్వహిస్తూ తన ఇద్దరు కుమార్తెలు జి.శోభను బీఎస్సీ, జి.ఉషాను బీ.టెక్ చదివించారు. పెద్ద కుమార్తె శోభ గురువారం విడుదలైన ఎస్‌ఐ తుది ఫలితాల్లో 4వ జోన్ పరిధిలో 78వ ర్యాంక్ సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆమె విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. ప్రభుత్వ కాలేజీలోనే 2014లో డిగ్రీ పూర్తిచేశారు. నాలుగేళ్లుగా సత్యవేడు-2వ సచివాలయంలో వలంటీర్‌గా సేవలు అందిస్తున్నారు. ఇక్కడ పని చేస్తూనే ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు మండల అధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

38 డీవైఈవో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యాశాఖలో 38 డెప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీవైఈవో) పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరి 9 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. నోటిఫికేషన్ పూర్తి వివరాలను https://psc.ap. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అలాగే జూనియర్ ట్రాన్స్‌లేటర్ (తెలుగు)పోస్టుకు సంబంధించి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేసింది.

ఏసీబీ వలలో ఎలక్ట్రికల్ సబ్ ఇంజినీర్

పొలంలో బోరు కోసం రూ.70 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



ఏసీబీకి చిక్కిన సబ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్

కపిలేశ్వరపురం (మండపేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మారేడుబాక విద్యుత్ సబ్ స్టేషన్ సబ్ ఇంజినీర్ ప్రసాద్ రూ.70 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏసీబీ అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య ఆధ్వర్యంలోని అధికారుల బృందం వలపన్ని పట్టుకున్నారు. ఆమె కథనం ప్రకారం.. సబ్ ఇంజినీర్ ప్రసాద్ తమను లంచం అడుగుతున్నారంటూ దుళ్ల గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. తన మామయ్య ముత్యాల గోపాలకృష్ణకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో బోరు వేసుకునేందుకు అనుమతి కోసం ప్రసాద్‌ను కోరారు. ఇందుకోసం రూ.70 వేలు లంచం అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. శుక్రవారం శ్రీనివాసరావు నుంచి ప్రసాద్ రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

రూ.400 కోట్లతో క్రైస్తవుల సంక్షేమం

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ



సీతంపేట: గడిచిన నాలుగున్నర ఏళ్లలో క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.400 కోట్లు వెచ్చించిందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ తెలిపారు. విశాఖపట్నం లలితానగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉండగా క్రైస్తవుల కోసం రూ.150 కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా పాస్టర్లకు రూ.5,000 గౌరవ వేతనాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. క్రైస్తవుల సమస్యలపై చంద్రబాబు తన హయాంలో ఎప్పుడూ స్పందించలేదని, ఎయిడెడ్ స్కూల్స్, హాస్పిటల్స్‌పై ఆయన చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. టీడీపీ హయాంలో అన్యాక్రాంతమైన క్రైస్తవ ఆస్తులను మళ్లీ ఆయా సంస్థలకు అప్పగించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి జెరూసలెం యాత్రకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు.

రాష్ట్రంలో మరో కొత్త పార్టీ

'జై భారత్ నేషనల్ పార్టీ'ని ఏర్పాటు చేసిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

సాక్షి, అమరావతి: సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాణ 'జై భారత్ నేషనల్' పేరుతో రాష్ట్రంలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. తాను పార్టీ ఏర్పాటు చేసినట్లు ఆయన శుక్రవారం విజయవాడలో ప్రకటించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుపరిపాలన కోసమే జై భారత్ నేషనల్ పార్టీ ఏర్పాటు చేశానని చెప్పారు. ఇది ప్రజల్లో నుంచి పుట్టిన పార్టీ అని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో అన్ని పార్టీలు విఫలమయ్యాయని, తాను సాధించి చూపిస్తానని తెలిపారు. హోదా వద్దు ప్యాకేజీ ముద్దు... అని కొందరు అన్నారని విమర్శించారు.

'చింతకాయల'కు చెంపదెబ్బలు రాల్తాయ్!


విశాఖ గాదిరాజు ప్యాలెస్‌లో మిగులు భూమి ఉందంటూ 2018లోనే యూఎల్‌సీ జాబితా

- పక్కా సర్వేతో అసలు లెక్కలను తేల్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- క్రమబద్ధీకరణకు అవకాశమిస్తూ యజమానికి జేసీ నోటీసులు
- తద్వారా ఆ స్థలాన్ని క్రమబద్ధీకరించుకునే అవకాశమిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వాస్తవాలను పట్టించుకోకుండా అయ్యన్నపాత్రుడు దిగజారుడు ఆరోపణలు
- కుమారుడికి సీటు కోసం చంద్రబాబు మెప్పు పొందడానికి సీఎం కుటుంబంపై దుష్ప్రచారం
- గాదిరాజు ప్యాలెస్ అడిగారనడం అవాస్తవం: గాదిరాజు ప్యాలెస్ అధినేత రామకృష్ణరాజు
- ఇప్పటివరకు నేరుగా అయ్యన్న ముఖమే చూడలేదని స్పష్టీకరణ




విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఆక్రమణలో ఉన్న మిగులు భూమిని 0.3530 చదరపు మీటర్లుగా తెలుస్తూ 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జాయింట్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలతో 22ఏ జాబితాను విడుదల చేశారు. మిగులు భూమిగా తేల్చిన మొత్తాన్ని 22 ఏ 1(డీ) జాబితాలో టీడీపీ ప్రభుత్వమే చేర్చింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా భూముల సర్వేలో భాగంగా మళ్లీ పక్కాగా సర్వే చేసి గాదిరాజు ప్యాలెస్‌లో వాస్తవ మిగులు భూమి కేవలం 0.1141 చదరపు మీటర్లుగా తేల్చింది. అంతేకాకుండా దీన్ని క్రమబద్ధీకరించుకోవాలని గత మే నెలలోనే జాయింట్ కలెక్టర్.. స్థానిక తహసీల్దార్ ద్వారా నోటీసులు జారీ చేశారు. మిగులు భూమిని క్రమబద్ధీకరించుకోవడం ద్వారా పక్కాగా యాజమాన్య హక్కులను పొందేందుకు గాదిరాజు రామకృష్ణరాజుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వాస్తవాలు ఇలా ఉండగా... దొంగే దొంగ దొంగ అన్నట్టుగా అయ్యన్నపాత్రుడు అసత్య ఆరోపణలు చేశారు. వీటిపై స్పష్టత తీసుకునేందుకు శుక్రవారమంతా మీడియా ప్రయత్నించినా ఆయన ముఖం చాటేశారు. దీన్ని బట్టి కావాలనే ఆయన తప్పుడు ఆరోపణలు చేశారని తేటతెల్లమవుతోంది.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/విశాఖ సిటీ



☛ ఈ చిత్రంలో ఉంది.. టీడీపీ ప్రభుత్వం హయాంలో 2018 లో రూపొందించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూముల జాబితా. ఇందులో గాదిరాజు ప్యాలెస్ ఉన్న ప్రాంతం మిగులు భూమిగా ఉంది.



☛ ఈ చిత్రంలో ఉంది.. టీడీపీ ప్రభుత్వ హయాంలో గాదిరాజు ప్యాలెస్‌లో మిగులు భూమిగా ఉన్నట్టు తేల్చిన విస్తీర్ణం 0.3530 చదరపు మీటర్లు.



☛ ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గాదిరాజు ప్యాలెస్ ఉన్న ప్రాంతంలో యూఎల్‌సీ భూమి ఉన్నట్టు తేల్చిన విస్తీర్ణం కేవలం 0.1141 చదరపు మీటర్లు. తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పక్కాగా తేల్చిన సర్వే ప్రకారం మిగులు భూమి సుమారు 6 సెంట్ల మేర తగ్గింది. అంటే ప్రస్తుత ప్రభుత్వం పక్కాగా సర్వే చేసి వాస్తవ లెక్కలను తేల్చింది. దీన్నిబట్టి గత టీడీపీ ప్రభుత్వమే ఎక్కువ లెక్కలను చూపి గాదిరాజు యాజమాన్యాన్ని బెదిరించే ప్రయత్నం చేసిందని అర్థమవుతోంది. అయితే, టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు సీఎం కుటుంబంపై దుష్ప్రచారమే చేయడమే లక్ష్యంగా తప్పుడు ఆరోపణలకు దిగారు. గాదిరాజు ప్యాలెస్ కావాలని దాని యజమానిని ముఖ్యమంత్రి సతీమణి కోరారని అభూత కల్పనలను సృష్టించేశారు. ఇందుకు గాదిరాజు ప్యాలెస్ యజమాని రామకృష్ణరాజు ఒప్పుకోకపోవడంతో ఆ ప్యాలెస్‌ను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చారంటూ అసత్య ఆరోపణలు చేశారు. వాస్తవానికి అయ్యన్నపాత్రుడు తన కుమారుడికి ఎంపీ టికెట్, తనకు ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే చంద్రబాబు నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే చంద్రబాబు మెప్పు పొందొచ్చని దిగజారుడు రాజకీయానికి దిగారు.

రూ.5 వేల కోట్ల విలువైన భూములకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రక్షణ..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గీతం యూనివర్సిటీ మొదలుకుని అనేక మంది టీడీపీ నేతలు ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించేశారు. అందినకాడికి బినామీ పేర్లతో కబ్జా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.5 వేల కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా కోరుల నుంచి రక్షించింది. ఎక్కడికక్కడ ప్రభుత్వ భూముల్లో బోర్డులను పాతడంతో పాటు చుట్టూ అధికారులు రక్షణ కంచె ఏర్పాటు చేశారు. దీన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రధానంగా గీతం వర్సిటీ ఆక్రమించిన ప్రభుత్వ భూములను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్యాలెస్ అడిగారనేది పూర్తిగా అవాస్తవం..



గాదిరాజు ప్యాలెస్ ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి తన అనుచరులను పంపించి అడిగించారన్న టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. ఈ వ్యవహారంలో జిల్లా కలెక్టర్‌పై కూడా అభాండాలు వేయడం బాధ కలిగించింది. ప్యాలెస్ ఇవ్వడానికి నేను ఒప్పుకోకపోవడంతో ప్యాలెస్ స్థలాన్ని 22ఏలో పెట్టి జిల్లా కలెక్టర్ ద్వారా నోటీసులు ఇప్పించారని ఒక పత్రికలో వార్త రాయడం అన్యాయం. ఇంత దారుణమైన, అసలు సంబంధంలేని వార్తను నేనెప్పుడూ చూడలేదు. నేను అయ్యన్నపాత్రుడిని కలిసినట్లు చెప్పడం సమంజసం కాదు. ఇప్పటివరకు కనీసం నేరుగా కూడా ఆయనను చూడలేదు. వాస్తవానికి ఇదేం పెద్ద ప్యాలెస్ కాదు.. వేరే ప్రాంతంలో ఉన్న మోడల్‌ను చూసి నచ్చి ఇక్కడ నిర్మించుకున్నాను. పెద్దవారికి ఇది చాలా చిన్న విషయం.. ఇటువంటి బిల్డింగ్‌ను ఎవరైనా కట్టొచ్చు. మూడు నెలల కిందట అనారోగ్యానికి గురవడంతో హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటున్నా.. ఇప్పటికీ కోలుకోలేదు. ఈ పరిస్థితుల్లో నన్ను ఎవరూ, ఎక్కడా కలవలేదు. రాజకీయాలతో ఏ సంబంధంలేని నన్ను, జిల్లా కలెక్టర్‌ను ఇందులో ఎందుకు లాగారో అర్థం కావడం లేదు. గాదిరాజు ప్యాలెస్ స్థలాన్ని 1997లో కొనుగోలు చేశా.. అన్ని అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టా. ఈ భూమిలో కొంత స్థలం మిగులు భూమిలో ఉందని.. ఏడాదిన్నర క్రితమే నోటీసు ఇచ్చారు. రెవెన్యూ సిబ్బందిలో కొందరికి పూర్తి అవగాహన లేకపోవడంతో కొంత స్థలం మిగులు భూమిలో ఉందని చూపించారు. వాస్తవానికి గతంలోనే నిబంధనల ప్రకారం అన్నీ చెల్లించి ప్రతి గజాన్ని రిజిస్టర్ చేయించుకున్నా. అది యూఎల్‌సీ స్థలమని ఎవరైనా నిరూపిస్తే నా ఆస్తి రాసిస్తా.

–గాదిరాజు రామకృష్ణరాజు, గాదిరాజు ప్యాలెస్ యజమాని

వాస్తవాలు తెలుసుకోకుండా రాస్తే చర్యలు..



ప్యాలెస్‌కు సంబంధించిన భూమి చినవాల్తేరు గ్రామంలో సర్వే నెంబర్ 10/4ఏ2ఏ, 10/4ఏ2బీ/2ఏ, 10/5ఏ2లో 0.2937 చదరపు మీటర్ల విస్తీర్ణం మిగులు భూమిగా ఉన్నందున 2018లోనే ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా 22ఏ (1)(డీ) రిజిస్టర్‌లో నమోదైంది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 84 ప్రకారం.. సదరు మిగులు భూమిని క్రమబద్ధీకరించుకోవాలని గాదిరాజు ప్యాలెస్ యజమానిని కోరుతూ ఈ ఏడాది మే 23న సీతమ్మధార తహసీల్దార్ నోటీసు జారీ చేశారు. ఒక పత్రికలో పేర్కొన్న విధంగా ప్యాలెస్ యజమాని ఎప్పుడూ కలెక్టర్‌ను ఈ విషయంపై సంప్రదించలేదు. ఈ విషయంలో ఎవరి నుంచి ఎటువంటి ఒత్తిళ్లు లేవు. ప్రభుత్వ అధికారి ప్రతిష్టలకు భంగం కలిగించేలా వార్తలు ప్రచురిస్తే పరువునష్టం దావా వేసి న్యాయ, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్, విశాఖపట్నం

బాబు మెప్పు కోసమే అయ్యన్న అసత్యప్రచారం

డెప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఆగ్రహం



తిరుపతి కల్చరల్: కేవలం చంద్రబాబు మెప్పు కోసమే వైఎస్ కుటుంబంపై టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నోటికొచ్చినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని డెప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంత్రి ముత్యాలనాయుడు మీడియాతో మాట్లాడుతూ విశాఖలో గాదిరాజు ప్యాలెస్‌కు సంబంధించి అయ్యన్నపాత్రుడు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేయడంతోపాటు అక్కడ పారిశ్రామిక అభివృద్ధి కోసం సీఎం జగన్ చేసే ప్రయత్నాలు గిట్టని టీడీపీ నేతలు నిత్యం అడ్డగోలు అబద్ధాలతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలో ఉండగానే 2018లో గాదిరాజు ప్యాలెస్‌కు సంబంధించిన 3వేల చదరపు గజాల భూమిని 22ఏ 1డీ సీలింగ్‌లో పెట్టిందని చెప్పారు. ఆ భూమిని రెగ్యులరైజ్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఐదు నెలల కిందట ప్యాలెస్ యజమానికి నోటీసులు ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనకు, తన కుమారుడికి టికెట్ల కోసమే వైఎస్ జగన్ కుటుంబంపై అయ్యన్నపాత్రుడు బురదజల్లుతూ మతి భ్రమించి ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీ కుట్ర రాజకీయాలకు కాలం చెల్లిందని, వారి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టంచేశారు. అధికార దాహంతో అయ్యన్న చేసిన అసత్య ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఇంటి' దొంగల ఏడుపు!

- టిడ్కో ఇళ్లపై రామోజీ దుగ్ధ 20 ఏళ్ల రుణభారం మోపిన బాబు
- 300 చ.అ. ఇళ్లు ఉచితంగా అందించిన సీఎం జగన్



సాక్షి, అమరావతి: గత ఎన్నికలకు ముందు పట్టణ పేదలకు టిడ్కో ఇళ్లంటూ హడావుడిగా టెంకాయలు కొట్టిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఏ ఒక్కరికీ గృహ యోగం కల్పించకుండా దగా చేశారు! పేదలకు ఇళ్లంటూ రెండు దశాబ్దాల పాటు గృహ రుణాలు చెల్లించాల్సిన పరిస్థితి కల్పించారు! ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే పేదలు తలెత్తుకుని ఆత్మ గౌరవంతో జీవించేలా 31 లక్షలకుపైగా ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు గృహ యజ్ఞాన్ని చేపట్టారు. 300 చ.అడుగుల టిడ్కో ఇళ్లను పేదలకు ఉచితంగా అందించడంతో పాటు ఇతర టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు భారీ ఊరట కల్పించారు. పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తుంటే ఈనాడు రామోజీ కడుపు మంటతో రగిలిపోతున్నారు. పేదల గూడుపై తన కరపత్రికలో బురద చల్లుతున్నారు. 'ఇక్కట్ల ఇళ్లు.. జగన్‌కే చెల్లు!' తొమ్మిది చోట్ల పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందంటూ ఓ రోత కథనాన్ని రాసుకుని సంబరపడ్డారు! నిజానికి ఆయన చెబుతున్న తొమ్మిది చోట్ల వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే రోడ్లు, డ్రైన్‌లు, కల్వర్ట్‌లు, నీటి సరఫరా, సెప్టిక్ ట్యాంక్‌లు ఇతర పనులన్నీ పూర్తి అయ్యాయి. విశాఖపట్నం ఏఎస్ఆర్ కాలనీలో సిమెంట్ రోడ్లు లేవని, మురుగు కాల్వలు మచ్చుకైనా కనిపించడం లేదంటూ కన్నీళ్లు కార్చారు. అక్కడ 280 ఇళ్లలో లబ్ధిదారులు నిక్షేపంగా నివాసం ఉంటున్నారు.

అంశం	నాడు (2014-19)	నేడు (2019 నుంచి ఇప్పటి వరకూ)	టీడీపీ హయాంతో పోలిస్తే లబ్ధిదారులకు జరిగిన మంచి
300 చ.అ ఇళ్లు	లబ్ధిదారులు రూ.2.65 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉండేది	పూర్తి ఉచితంగా ఇళ్ల కేటాయింపు	గతంలో లబ్ధిదారులు రూ. 2.65 లక్షలు అప్పు చేసి, ఆపై 20 ఏళ్లలో వడ్డీతో రూ.7.20 లక్షలు చెల్లించాలి. ఉచితంగా 1,43,600 ఇళ్లను కేటాయించడం ద్వారా పేదలకు రూ.10,339 కోట్ల మేర సీఎం జగన్ ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది
365 చ.అ, 430 చ.అ ఇళ్లు	365చ.అ ఇళ్ల లబ్ధిదారులు తమ వాటాగా యూనిట్‌కు రూ.50 వేలు, 430 చ.అ ఇళ్ల లబ్ధిదారులు రూ. లక్ష చొప్పున చెల్లించాలి	లబ్ధిదారుల వాటా చెల్లింపుల్లో 50 శాతం రాయితీ	రాయితీ ఇవ్వడం ద్వారా 1,18,600 మంది లబ్ధిదారులపై రూ.482 కోట్ల మేర భారం తప్పించి భారీ ఊరట కల్పించిన సీఎం జగన్ ప్రభుత్వం
రిజిస్ట్రేషన్ ఫీజు	లబ్ధిదారులే చెల్లించాలి	రూ.1,200 కోట్ల ఫీజుల భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది	రిజిస్ట్రేషన్ ఫీజుల భారం తప్పించడం ద్వారా 2.62 లక్షల మందికి రూ.1,200 కోట్ల మేర లబ్ధి
బ్యాంక్ లోన్‌లు టైఅప్	రూ.185.80 కోట్లు	రూ.2,250.20 కోట్లు	-
పూర్తయిన ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు	0	1,68,036	-
లబ్ధిదారులకు అందించిన ఇళ్లు	0	81,474	-

చంద్రబాబు కోసం ఆవు కథ చెబుతావా పవన్?

- తల్లిని దూషించినోళ్ల సభకెళ్లడానికి ఎంత వాటా తీసుకున్నావ్?
- మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు



సాక్షి,అమరావతి: 'టీడీపీకి మద్దతిచ్చి గెలిపిస్తే.. నా తల్లిని దూషించావ్.. నా కుటుంబాన్ని అవమానించావ్.. కబడ్దార్ లోకేశ్.. నీ అంతు చూస్తా...' అని గతంలో పవన్‌కళ్యాణ్ అన్నారని, మరి ఇప్పుడు యువగళం ముగింపు సభకు పవన్ ఎందుకు వెళ్లారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రశ్నించారు. 'నీకు గానీ.. నీ తల్లికి గానీ లోకేశ్ క్షమాపణలు చెప్పారా? లేకుంటే నీ కుటుంబంలో ఎవరి కాళ్లయినా లోకేశ్ పట్టుకున్నారా? మరెందుకు, నువ్వు వాళ్లను క్షమించాల్సి వచ్చింది' అని పవన్‌ను ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు, లోకేశ్‌లను దొంగలని, వాళ్లకు ఓట్లేయవద్దని పవన్ చెప్పారని... మరి ఇప్పుడు పవన్ చెప్పినట్లు ప్రజలు వారికి ఎందుకు ఓట్లు వేయాలన్నారు. చంద్రబాబు దగ్గర తీసుకున్న ప్యాకేజీ ఎంతో ప్రజలకు చెప్పాలని పవన్‌ను డిమాండ్ చేశారు. చంద్రబాబును సీఎంను చేయటం కోసం పవన్ ఆవు కథ చెబుతున్నారని పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో చంద్రబాబు బాగుండాలని, ఆయన అధికారంలోకి రావాలనేది పవన్‌కు తెలిసిన ఆవు కథ అని చెప్పారు. చంద్రబాబు అధికారంలో లేనప్పుడేమో అందరూ బాబుకు ఓటేయ్యండి.. బాబును గెలిపించండని పవన్ అంటారని, తీరా ఆయన అధికారంలో ఉంటే లాలూచీ కుస్తీలో భాగంగా బాబును కాదని తనకు మాత్రమే ఓటేయ్యండని పవన్ అంటారని గుర్తుచేశారు. ఇలా చేసినందుకే 2019లో జనం తెడ్డు కాల్చి ఇద్దరికీ వాతలు పెట్టారని పేర్ని నాని వ్యాఖ్యానించారు. ఏ నాయకుడైనా పాదయాత్ర చేపడితే ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో చిత్తశుద్ధితో చేస్తారని, కానీ.. లోకేశ్ యాత్ర మాత్రం అందుకు పూర్తి భిన్నంగా సాగిందన్నారు. లోకేశ్ నడిచిన కిలోమీటర్లన్నీ దొంగ లెక్కలే అని ఆరోపించారు. లోకేశ్‌ది జంపింగ్ జపాంగ్ యాత్ర అని అన్నారు. యువగళం అనేది అట్టర్ ఫ్లాప్ సినిమా అని దానికి అందరూ ఒకే వేదికపైకి వచ్చి బిల్డప్ ఇచ్చారని ఎద్దేవా చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

చంద్రబాబు, లోకేశ్, పవన్‌లు సర్కస్ చేస్తూ ప్రజలను మోసం చేయడానికి దొంగ హామీల్ని ఎరచూపుతున్నారని, దీనిని గమనించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు నాని సూచించారు. సినీ నటుడు తారకరత్న చనిపోతే చూడటానికి లోకేశ్‌కు మనసు రాలేదని, కుంభకోణాలకు పాల్పడి చంద్రబాబు అరెస్టయితే లోకేశ్ పాదయాత్ర ఆపేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మార్పుపై చంద్రబాబు, లోకేశ్, పవన్‌వి సిగ్గులేని మాటలని మండిపడ్డారు. రాజకీయాల్లో అభ్యర్థులను మార్చటం ప్రారంభించింది చంద్రబాబే అని, తాము ఎన్నికల అభ్యర్థుల్ని మార్చుకుంటే తప్పేంటని, వైఎస్సార్‌సీపీలో సవాలక్ష మార్పులు జరిగితే బాబు, పవన్, లోకేశ్‌లకు వచ్చిన నొప్పేంటని నాని ప్రశ్నించారు. సీఎం జగన్ చేస్తున్న రాజకీయ ఎక్స్‌పెరిమెంట్‌తో చంద్రబాబుకు చుక్కలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు 5,756 దరఖాస్తులు

- రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా స్థాయి హౌసింగ్ కమిటీల ఏర్పాటు
- సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అర్హులైన జర్నలిస్టులందరికీ సంతృప్తకరస్థాయిలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఐఅండ్‌పీఆర్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 5,756 దరఖాస్తులు అందాయని, వీటిలో ఇప్పటికే 4,742 దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన పూర్తి చేసి సంబంధిత జిల్లా కలెక్టర్లకు జాబితాలను పంపించామన్నారు. ఇంకా మిగిలి ఉన్న అర్హులైన అక్రిడేటెడ్ జర్నలిస్టులందరూ జనవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీవో నంబర్ 535లో పేర్కొన్న నిబంధనలకు సరైన సమాచారం ఇవ్వకపోవడం, అనుభవ పత్రాలు జతచేయకపోవడం, దరఖాస్తులు అసంపూర్తిగా నింపిన 935 మంది జర్నలిస్టులకు తమ దరఖాస్తులను సరిదిద్దుకునేందుకు మరో అవకాశం కల్పించామన్నారు. ఈ విషయమై సంబంధిత జర్నలిస్టులకు ఎస్ఎంఎస్ ద్వారా సందేశాలు పంపామన్నారు. వివరాలు సరిచేసుకున్న అనంతరం సదరు జర్నలిస్టుల దరఖాస్తులను వెరిఫై చేసి కలెక్టర్లకు పంపిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 79 మంది జర్నలిస్టుల దరఖాస్తులు మాత్రమే ధృవీకరణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వాటి వెరిఫికేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ మంత్రి చైర్ పర్సన్‌గా, జిల్లా కలెక్టర్, డీఆర్వో, సబ్ కలెక్టర్ లేదా ఆర్డీవో, డీఐపీఆర్వో, ముగ్గురు జర్నలిస్టులు సభ్యులతో కూడిన జిల్లా స్థాయి హౌసింగ్ కమిటీల ఏర్పాటు ప్రక్రియ 26 జిల్లాల్లో ఇప్పటికే పూర్తయిందన్నారు. ఈ కమిటీల ద్వారా ఇళ్ల స్థలాలకు అనువైన భూములను గుర్తించే ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. రెవెన్యూ శాఖ వెరిఫికేషన్ అనంతరం పూర్తిస్థాయిలో ఇళ్ల స్థలాలకు అర్హులైన జర్నలిస్టుల తుది జాబితా రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ విలువ ప్రకారం 60 శాతం ప్రభుత్వం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అక్రిడేటెడ్ జర్నలిస్టులందరూ సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ వైద్యులు గుర్తింపు కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గ్రామాలు, పట్టణ మురికివాడల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే గ్రామీణ వైద్యులు ఐకమత్యంగా ఉంటేనే గుర్తింపు కొరకు పోరాడగలమని కమ్యూనిటీ పారా మెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తోరాటి ప్రభాకరరావు, వీటీటీ రాజు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రామకృష్ణాపురంలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గౌరవాధ్యక్షుడు టి.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల వృత్తి పరిరక్షణకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ ఇచ్చారని, అనంతరం వివిధ కారణాలతో నిలిచిపోయిన ఈ శిక్షణను మరలా పునరుద్ధరించి, సర్టిఫికెట్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడిగా రొక్కం నాగేశ్వర రెడ్డి(నంద్యాల జిల్లా), ప్రధాన కార్యదర్శిగా బళ్ళా శ్రీనివాస రావు (తూర్పు గోదావరి), కోశాధికారిగా కవర్తపు కృష్ణమూర్తి (కృష్ణా), ఉపాధ్యక్షులుగా ములగలేటి శేషసాయి (గుంటూరు), కార్యనిర్వాహక అధ్యక్షులుగా షేక్ ఖాజా వలి (ప్రకాశం), కార్యనిర్వాహక కార్యదర్శిగా పర్ల దస్తగిరి (నంద్యాల), మల్లోజు జయరామ్ (ఏలూరు) సహాయ కార్యదర్శిగా, జూలకంటి రఘునాథరెడ్డి (కర్నూలు)లను ఎన్నుకున్నారు.

జేఎన్–1 అంత ప్రమాదకరం కాదు

ఎక్కువ మందికి సోకే అవకాశాలే తప్ప తీవ్రత ఉండకపోవచ్చు

- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి
- వారం, పది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది
- ఎక్కువ మంది గుమిగూడిన చోటికి వెళ్తే మాస్క్ పెట్టుకోవాలి
- మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జాగ్రత్త పడాలని సూచన



డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కరోనా కొత్త వేరియంట్ జేఎన్–1 అంత ప్రమాదకరమేమీ కాదని.. దాని గురించి అతిగా ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. వారం, పది రోజుల్లో ఈ ఇన్ఫెక్షన్ వ్యాప్తి ఎలా ఉంటుందనే దానిని బట్టి దీని తీవ్రత, చూపబోయే ప్రభావంపై మరింత స్పష్టత వస్తుందని చెప్పారు. ఇది ఒమిక్రాన్ సబ్ వేరియెంట్ కాబట్టి ఎక్కువ మందికి సోకవచ్చన్నారు. అంతే తప్ప తీవ్ర లక్షణాలు ఉండటంగానీ, ప్రమాదకరంగా మారే అవకాశంగానీ తక్కువని స్పష్టం చేశారు. కొన్నిరోజులుగా దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివిధ అంశాలపై స్పష్టతనిచ్చారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

''నా అంచనా ప్రకారం.. ఇప్పటికే నమోదైన కేసుల పరిస్థితిని చూస్తే ఈ వైరస్ అంతగా ప్రమాదకారి కాదు. సాధారణ జలుబు, దగ్గు, సైనసైటిస్, ఒళ్లు నొప్పులు వంటి స్వల్ప లక్షణాలు ఉంటాయి. అందరూ అన్నిచోట్లా మాస్క్ వేసుకోవాల్సిన అవసరం లేదు. కేన్సర్, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. బయటికి వెళ్లినప్పుడు మాస్క్ ధరిస్తే చాలు.

డబ్ల్యూహెచ్‌వో పరిశీలిస్తోంది

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) జేఎన్–1ను వేరియెంట్ ఆఫ్ ఇంట్రెస్ట్‌గా ప్రకటించింది. అంటే వచ్చే 10–15 రోజులు ఇది ఎంతగా విస్తరిస్తుంది, ఒకరి నుంచి మరొకరికి ఎంత వేగంగా వ్యాపిస్తుంది (ఇన్ఫెక్టివిటీ), సీరియస్ ఇన్ఫెక్షన్‌గా మారుతుందా (విరులెన్స్) అన్న అంశాలను పరిశీలిస్తారు. ఇప్పటి వరకు ఉన్న డేటా మేరకు ఈ వైరస్‌కు విరులెన్స్ అంత ఎక్కువగా లేదు. వ్యాపించే సామర్థ్యం ఒమిక్రాన్ అంతలేదు.. కానీ డెల్టా కంటే ఎక్కువగా ఉంది. ఈ వేరియంట్‌కు సంబంధించి కేరళలో ఎక్కువగా, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదవుతున్నాయి. సింగపూర్‌లో ఈ కేసులు అధికంగా వచ్చాయి. యూఎస్, యూరప్‌లోనూ నమోదవుతున్నాయి.

రోగ నిరోధక శక్తి ముఖ్యం

ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు రోగ నిరోధకశక్తి (ఇమ్యూనిటీ) ముఖ్యం. ప్రస్తుత పరిస్థితుల్లో మనలో ఎంత ఇమ్యూనిటీ ఉందనే దానిపై ఏఐజీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తున్నాం. వారం, పది రోజుల్లో ఇది పూర్తవుతుంది. బూస్టర్ డోస్ వేసుకోవాలా వద్దా అన్న దానిపై స్పష్టత వస్తుంది. ఇమ్యూనిటీ ఉన్నవారు బూస్టర్ డోస్‌ను వేసుకోవాల్సిన అవసరం లేదు.

మన దేశ ప్రజల్లో హైబ్రిడ్ ఇమ్యూనిటీ ఉంది




''మళ్లీ కరోనా వ్యాప్తి నేపథ్యంలో బూస్టర్ డోస్ తీసుకోవాలా వద్దా అని చాలా మంది డాక్టర్లను సంప్రదిస్తున్నారు. అమెరికాలో అయితే 65ఏళ్ల దాటినవారు బూస్టర్ డోస్ తీసుకోవాలని సూచిస్తున్నారు (చివరి డోస్ తీసుకుని ఏడాది దాటిన వారికి). అదే భారత్‌లో చాలా వరకు వ్యాక్సిన్ వేసుకోవడం, కరోనా సోకి ఉండటంతో ఏర్పడిన 'హైబ్రిడ్ ఇమ్యూనిటీ' ఉంది. ఒకవేళ వైరస్ సోకినా అది తీవ్ర వ్యాధిగా మారకుండా ఈ ఇమ్యూనిటీ ఉపయోగపడుతుంది. ఒమిక్రాన్ స్పైక్ ప్రొటీన్లలో మార్పులతో జేఎన్–1 వేరియంట్ ఏర్పడినందున గతంలో తీసుకున్న వ్యాక్సినేషన్, కోవిడ్ సోకడం వల్ల వచ్చిన ఇమ్యూనిటీని ఇది తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే దీనితో జ్వరం, గొంతునొప్పి, గొంతులో గరగర, దగ్గు, తలనొప్పి వంటి స్వల్ప అస్వస్థతే కలుగుతోంది. వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. విదేశీ పర్యటనలు, దూరప్రాంతాలకు వెళ్లి వచ్చినవారికి లక్షణాలు ఉంటే టెస్ట్ చేయించుకోవాలి. ఈ వైరస్ దీర్ఘకాలిక ప్రభావం (లాంగ్ కోవిడ్) చూపే అవకాశాలు కూడా ఉన్నందున దీని వ్యాప్తిని నియంత్రించడం అవసరం..''

– డాక్టర్ గోపీచంద్ ఖిల్నానీ,
డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ ఎయిర్ పొల్యూషన్ అండ్ హెల్త్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ మెంబర్

గ్రామాలు కళకళలాడుతున్నా కంటగింపేనా?

గ్రామాభివృద్ధిని కూడా ఓర్వలేకపోతున్న రామోజీ

- ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాల నిర్మాణం పచ్చ కళ్లకు కనిపించడం లేదా?
- ఇప్పటికే 27,608 భవన నిర్మాణాలు పూర్తయినా అసత్య రాతలేనా?
- 6,800 సచివాలయ భవనాలు ప్రారంభం
- పూర్తయ్యే దశలో మరో 2,784



సాక్షి, అమరావతి: 'గ్రామ సీమలే దేశానికి పట్టుగొమ్మలు' అన్న మహాత్మాగాంధీ సూక్తిని ఆచరణలో పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలన్నింటినీ తీసుకెళ్లారు. ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో భారీ ఎత్తున గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ భవనాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో ఇవి అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు విస్తృత సేవలందిస్తున్నాయి. మరికొన్ని నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. అయితే ప్రతి అంశంలోనూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈనాడు పత్రిక మరో అసత్య కథనానికి తెగబడింది. శుక్రవారం తన ప్రధాన సంచికలో 'ఆరంభ శూరత్వం.. ఆపై అలసత్వం!' అంటూ విషం చిమ్మింది. ఈ కథనానికి సంబంధించి అసలు వాస్తవాలివీ..

ఊరూరా గ్రామ సచివాలయాల నిర్మాణం..

రాష్ట్ర ప్రభుత్వం ఏటా వివిధ సంక్షేమ పథకాల రూపంలో లక్షల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తోంది. ఇందులో ఎలాంటి వివక్ష, పక్షపాతం లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా అర్హుల జాబితాను సిద్ధం చేయిస్తోంది. ఇందుకోసం దాదాపు ప్రతి గ్రామంలోనూ సచివాలయాలను నిర్మిస్తోంది. మొత్తం 10,893 గ్రామ సచివాలయాల భవనాలను మంజూరు చేసి.. ఇప్పటికే 6,800 భవనాలను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా చేసింది. మరో 2,784 పూర్తయ్యే దశలో ఉన్నాయి. అలాగే రైతులకు వారి స్వగ్రామాల్లోనే విత్తు నుంచి విక్రయం వరకు సేవలందజేయడానికి రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 5,252 రైతు భరోసా కేంద్రాల భవనాలను ప్రారంభించింది. మరో 2,182 భవనాలు నిర్మాణం పూరయ్యే దశలో ఉన్నాయి. అదేవిధంగా కుగ్రామాల్లో వైద్య సేవలను అందించడానికి ఇప్పటికే 3,017 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేసి వాటిని ప్రారంభించింది. మరో 2,395 నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఇవన్నీ పచ్చ పత్రిక ఈనాడుకు, దాని అధినేత రామోజీరావు కళ్లకు కనిపించడం లేదు. అందుకే యథేచ్ఛగా ప్రభుత్వంపై ఇష్టానుసారం విషం కక్కారు.

చంద్రబాబు కనీస ఆలోచన అయినా చేశారా రామోజీ?

వైఎస్ జగన్ ప్రభుత్వం ఒక్కోటి రూ.43.60 లక్షల చొప్పున ప్రతి ఊరిలో గ్రామ సచివాలయాలు నిర్మిస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు.. ఇలా ఏ ఒక్కదాని గురించి కనీస ఆలోచన కూడా చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.11,000 కోట్లతో నాడు– నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తే ఇది ఈనాడు పత్రికకు అభివృద్ధిలా కనిపించలేదు. గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.107 కోట్లతో పాఠశాలల చుట్టూ 98.98 కి.మీ మేర ప్రహరీ గోడలు కట్టారని తన కథనంలో మురిసిపోయింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.612 కోట్లతో 189 కిలోమీటర్లు పొడవునా ప్రహరీ గోడలు నిర్మించింది. అయినా సరే ఈనాడుకు ఇదంతా అభివృద్ధిలా కనిపిస్తే ఒట్టు!

ఈనాడు ఆరోపణ: 36,749 కొత్త భవనాలకు ఆగమేఘాలపై అనుమతులిచ్చారు. 14,956 మాత్రమే పూర్తి చేశారు. అంటే 50 శాతం కూడ పూర్తి చేయలేకపోయారు.

వాస్తవం: ప్రభుత్వం ఈ భవనాలను మంజూరు చేశాక, 2020, 2021ల్లో రెండేళ్లపాటు కరోనాతో ఏ ఒక్క పని పూర్తి స్థాయిలో చేపట్టలేని పరిస్థితి. అయినా, ఇప్పటికే ప్రారంభోత్సం అయినవి, నిర్మాణం తుది దశలో ఉన్నవి అన్నీ కలిపితే 27,608 భవనాల నిర్మాణం దాదాపు పూర్తయ్యింది.

ఈనాడు ఆరోపణ: నిర్మాణంలో ఉపయోగించే స్టీల్, సిమెంట్ ధరలు పెరిగినా.. పనులు మంజూరు చేసినప్పటి ధరలే ఇప్పటికీ అమలులో ఉన్నాయి. గిట్టుబాటు కాక పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

వాస్తవం: ఒక్కో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి గతంలో రూ.40 లక్షల చొప్పున మంజూరు చేయగా, ఇప్పుడు దాని నిర్మాణ ధరను రూ.43.60 లక్షలకు పెంచారు. అప్పట్లో రూ. 21.80 లక్షల చొప్పున మంజూరు చేసిన ఒక్కో రైతు భరోసా కేంద్రం నిర్మాణాన్ని రూ. 23.94 లక్షలకు ప్రభుత్వం పెంచింది. అలాగే ఒక్కో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ.17.50 లక్షల చొప్పున కేటాయించగా దాన్ని రూ.20.80 లక్షలకు పెంచారు.

ప్రజావాణి వినిపించడమే ఆకాశవాణి లక్ష్యం

ఆకాశవాణి ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వసుధాగుప్తా



75 సంవత్సరాల ఆకాశవాణి స్మృతి స్థూపం ఆవిష్కరణ సభలో డాక్టర్ వసుధాగుప్తా తదితరులు

విజయవాడ కల్చరల్: ప్రజావాణి వినిపించడమే విజయవాడ ఆకాశవాణి కేంద్రం లక్ష్యమని ఆకాశవాణి ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ న్యూఢిల్లీ డాక్టర్ వసుధా గుప్తా అన్నారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం అమృతోత్సవ వేడుకలు, 75 సంవత్సరాల ఆకాశవాణి ప్రస్థానం, ప్రతిభావాణి పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఆకాశవాణి కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత 75 సంవత్సరాల స్మృతి స్థూపాన్ని డాక్టర్ వసుధాగుప్తా ఆవిష్కరించి ప్రసంగించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ బి.వెంకటేశ్వర్లు, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇంజినీరింగ్ ఎస్.సోమేశ్వరరావు, దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కొండలరావు ప్రసంగించారు.

ప్రతిభావాణి పురస్కారాల ప్రదానం

ఆకాశవాణిలో పని చేసి సంగీత రంగానికి చెందిన అన్నవరపు రామస్వామి, మల్లాది సూరిబాబు తదితరులకు ప్రతిభావాణి పురస్కారాలను ప్రదానం చేశారు.

తప్పుడు వార్తలు రాస్తున్నందునే ఆంధ్రజ్యోతి బహిష్కరణ

ఏపీ సచివాలయ సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో పదోన్నతుల్లో ఎస్టీ, దివ్యాంగులకు అన్యాయం జరుగుతోందని ఆంధ్రజ్యోతి తప్పుడు వార్తలు రాసిందని, దానిపై వాస్తవాలు వివరించి క్షమాపణ చెప్పాలని కోరినప్పటికీ ఆ పత్రిక చెప్పలేదని, ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి పత్రికను బహిష్కరిస్తున్నామని ఏపీ సచివాలయ సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు.2022–23 ప్యానెల్ సంవత్సరానికి ఎస్టీ, దివ్యాంగుల కోటాలో 8 ఎస్‌వో పోస్టులు ఉన్నాయని, ఈ రెండు కేటగిరీల్లో 2020 కి ముందు చేరిన ఏఎస్‌వోలందరికీ ప్రమోషన్లు వచ్చాయని చెప్పారు. 2021లో చేరిన వారు మాత్రమే ఉన్నారని, వారికి సెప్టెంబర్ 2022 నాటికి ప్రొబేషన్ పిరియడ్ రెండేళ్ల పూర్తి కాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే వారికి కేటాయించిన 8 ఎస్‌వో పోస్టులను వారికే రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆ పోస్టుల్లో ఒక్క పోస్టును కూడా జనరల్ అభ్యర్థికి కేటాయించలేదని స్పష్టం చేశారు. 2013 లో చేరిన ఏఎస్‌ఓలు 2022–23 ప్యానెల్ లో ప్రమోషన్ కు అర్హత సాధించి ప్రమోషన్ ఉత్తర్వులు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కోర్టు కేసుల వల్ల డీపీసీ ఆలస్యం అవుతుండటంతో వారు ప్రమోషన్‌కు ప్యానెల్ ఆమోదం పొందారని, దీంతో 2023 సెప్టెంబర్ తర్వాత వచ్చిన ఖాళీల్లో వారికి ప్రమోషన్ ఇవ్వడానికి సీఎం అనుమతించారని వివరించారు. ఇంత స్పష్టంగా వివరణ ఇచ్చినప్పటికీ ఆంధ్రజ్యోతి వాస్తవాలను ప్రచురించలేదని పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

ఆ'నంది'ద్దాం రండి..

- నేడు నంది నాటకోత్సవాలు ప్రారంభం
- వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదిక
- ఏడు రోజుల పాటు 38 ప్రదర్శనలు
- ప్రతిభ చాటనున్న 1,200 మంది కళాకారులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం



నంది నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పోసాని కృష్ణమురళి, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/పాత గుంటూరు: నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురాడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలకు వేళయింది. ఈ ఉత్సవాలకు గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికవుతోంది. ఫలితంగా సుందరంగా ముస్తాబై అందరికీ ఆహ్వానం పలుకుతోంది. నాటకోత్సవాల నేపథ్యంలో చేసిన విద్యుత్ దీపాలంకరణ, 100 అడుగుల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్, బెలూన్, నంది విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శనివారం నాటకోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నాటకోత్సవాలను ప్రారంభించనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి, మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకలు 29 వరకు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కళాభిమానులు ఈ నాటకోత్సవాల కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ప్రాథమిక దశలో మెప్పించి తుది పోటీలకు అర్హత పొందిన కళాకారులు ఈ ఉత్సవాల్లో సత్తా చాటి బహుమతులు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. మొత్తం ఐదు విభాగాలుగా పోటీలు జరగనున్నాయి. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, కళాశాల, యూనివర్సిటీ స్థాయి నాటికలు, బాలల నాటికల ప్రదర్శనలు ఆహూతులను అలరించనున్నాయి. ఈ పోటీల్లో 73 అవార్డులు గెలుచుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 38 నాటక సమాజాల నుంచి 1,200 మంది కళాకారులు పాల్గొంటున్నారు. కళాకారులకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా ఏర్పాటు చేశారు. ఏసీ హోటల్లో వారికి బస ఏర్పాటు చేశారు. ప్రత్యేక భోజన ఏర్పాట్లూ చేశారు. నాటక ప్రదర్శనలను కళాకారులు, విద్యార్థులు, కళాభిమానులు ఉచితంగా తిలకించే అవకాశం కల్పించారు. సత్య హరిశ్చంద్ర నాటకకర్త బలిజేపల్లి లక్ష్మీకాంత కవి పేరుతో వేదికను ఏర్పాటు చేశారు.

నేటి నాటక ప్రదర్శనలివే

- శనివారం ఉత్సవాల ప్రారంభ సభానంతరం ఉదయం 11 గంటలకు రాజాంకు చెందిన కళాసాగర నాటక సంక్షేమ సంఘం వారి 'శ్రీకాళహస్తీశ్వర మహత్యం'పద్య నాటక ప్రదర్శనతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. కళారత్న డాక్టర్ మీగడ రామలింగ స్వామి రచనలో రూపుదిద్దుకున్న ఈ నాటకానికి మీగడ మల్లికార్జున స్వామి దర్శకత్వం వహిస్తారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీకళానికేతన్ హైదరాబాద్ వారి 'ఎర్ర కలువ' సాంఘిక నాటకం ప్రదర్శితమవుతుంది. రచన: ఆకురాతి భాస్కర్ చంద్ర. దర్శకత్వం : డాక్టర్ వెంకట్ గోవాడ
- సాయంత్రం 5 గంటలకు గుంటూరు అమృత లహరి థియేటర్ ట్రస్ట్ వారి నాన్నా.. నేనొచ్చేస్తా సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుంది. రచన: తాళాబత్తుల వెంకటేశ్వరరావు. దర్శకత్వం: అమృత లహరి.
- సాయంత్రం 6.30 గంటలకు తెనాలి శ్రీదుర్గా భవాని నాట్యమండలి వారి శ్రీరామభక్త తులసీదాసు పద్య నాటకం ప్రదర్శితమవుతుంది. రచన: డాక్టర్ ఐ.మల్లేశ్వరరావు. దర్శకత్వం : ఆదినారాయణ



విద్యుత్ దీప కాంతుల్లో వేంకటేశ్వర విజ్ఞానమందిరం

వైఎస్సార్, ఎన్టీఆర్ రంగస్థల పురస్కారాలు

నాటక రంగానికి విశేష కృషి చేసిన కళాకారులను గుర్తించి వైఎస్సార్, ఎన్టీఆర్ రంగస్థల పురస్కారాలు అందించేందుకు ఈ ఏడాది ఒక కళాకారుడిని, కళా సంస్థను ఎంపిక చేసినట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి, మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయకుమార్ రెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ రంగస్థల అవార్డును కాకినాడకు చెందిన యంగ్ మెన్స్ హ్యాపీక్లబ్, ఎన్టీఆర్ రంగస్థల పురస్కారానికి విశాఖపట్నానికి చెందిన డాక్టర్ మీగడ రామలింగస్వామి ఎంపికైనట్లు వెల్లడించారు.

73 అవార్డులు

నాటకోత్సవాల ఏర్పాట్లను రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ పోసాని కృష్ణ మురళి, ఎండీ టి.విజయకుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం జన్మదినం పురస్కరించుకుని ఆయన పేరున కళా ప్రాంగణం ఏర్పాటు చేసి నంది నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 7 రోజుల పాటు 73 అవార్డుల కోసం 38 నాటక సమాజాలు, 1200 మంది కళాకారులు పోటీ పడతారని చెప్పారు. అనంతరం నాటక ప్రదర్శనల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

15 మంది న్యాయనిర్ణేతలు

నాటక ప్రదర్శనలు పరిశీలించి స్వర్ణ, రజిత, కాంస్య నందుల విజేతల ఎంపికకు 15 మంది న్యాయ నిర్ణేతలు నియమితులయ్యారు. ఎఫ్‌డీసీ సంస్థ తరఫున నటులు, జడ్జిల ఆతిథ్యం కోసం రెండు కమిటీలు పనిచేస్తున్నాయి. మొదటిసారి నటీనటులకు ఏసీ హోటల్ గదుల్లో బస ఏర్పాటుచేశారు. వీరికి టీటీడీ కల్యాణ మండపంలో 'మెస్' ఏర్పాటు చేస్తున్నారు. ఆడిటోరియం వద్ద శానిటేషన్, మెడికల్ ఎమర్జెన్సీ డెస్క్, ఫైర్ సర్వీస్, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

- థియేటర్ స్టేజిపైన ప్రత్యేక లైటింగ్, సౌండ్ ఏర్పాటు కోసం 'సురభి' వారిచేత ఏర్పాట్లు చేయించారు. రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకు రోజుకు ఐదు విభాగాల్లో ఐదు ప్రదర్శనలు ఉంటాయి.
- 'నంది నాటకోత్సవాల'లో కొంత కాలంగా కాలేజీ – యూనివర్సిటీ స్థాయి విద్యార్థులకు పోటీల విభాగం ఉంటున్నది. యువతరంలో నాటకరంగ రంగం పట్ల ఆసక్తి కలిగించడానికి పెద్దఎత్తున కాలేజి, యూనివర్సిటీ విద్యార్థులను ఈ నాటకోత్సవాలలో భాగస్వామ్యులను చేయాలని సంస్థ నిర్ణయించింది. గుంటూరులో జరగనున్న ఈ ప్రదర్శనల్లో నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం, థియేటర్ ఆర్ట్స్ శాఖల విదార్థులు నాటక సమాజాలు, ప్రేక్షకుల నుంచి 'ఫీడ్ బ్యాక్' సేకరించనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు జరిగే బాలల నాటికల ప్రదర్శనలు చూడడానికి నగరంలోని పాఠశాలల విదార్థులను ఆయా యాజమాన్యాలతో మాట్లాడి అనుమతించనున్నారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన



స్టాల్స్‌లో మొక్కలను పరిశీలిస్తున్న సందర్శకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏపీ ఫ్లవర్ షో–2023 నగర వాసులను ఆకట్టుకుంటుంది. ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ ప్రదర్శన ప్రారంభించి, స్టాల్స్‌ను సందర్శించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన నర్సరీల నిర్వాహకులు ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇంటి ఆవరణలో పెంచే మొక్కలతో పాటు, కుండీల్లో పెంచే మొక్కలు, అరుదైన మొక్కలు ప్రదర్శనలో ఉంచారు. నగరంలోని మొక్కల ప్రేమికులు ఈ ప్రదర్శనను తిలకిస్తున్నారు. వివిధ రకాల గులాబీ మొక్కలు, అరుదైన బోన్సాయ్ మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనను గరిమెళ్ల జానకిరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



ప్రదర్శన ప్రారంభోత్సవంలో దేవినేని అవినాష్



ప్రదర్శనకు ఉంచిన బోన్సాయ్ మొక్కలు





క్రిస్మస్ సందడి

క్రిస్మస్ వేడుకలు సమీపిస్తుండటంతో నగరంలో పండగ వాతావరణం నెలకొంది. క్రిస్మస్ నక్షత్రాలు, ట్రీలు, గాలిపటాలు, శాంతాక్లాజ్ ప్రతిమలు, ఇతర బొమ్మలు, అలంకరణ సామగ్రి, బహుమతులు నగరంలోని దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. దీంతో క్రైస్తవులు దుకాణాలకు వచ్చి వీటిని కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కేంద్ర ఎన్నికల సంఘ బృందానికి స్వాగతం పలికిన కలెక్టర్



కేంద్ర బృందానికి స్వాగతం పలుకుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశానికి హాజరైన కేంద్ర ఎన్నికల సంఘం బృందానికి జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్వాగతం పలికారు. నగరంలోని నోవాటెల్ హోటల్‌లో సమీక్ష సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడకు విచ్చేసిన ప్రతినిధుల బృందానికి కలెక్టర్ ఢిల్లీరావు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. సమావేశానికి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సీపీ టీకే రాణాతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. కాగా కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ జాషువా కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన కృష్ణా కలెక్టర్, ఎస్పీ

క్లుప్తంగా...

పారిశ్రామికవేత్త, దాత రాజేశ్వరి కన్నుమూత



చాగల్లు: తూర్పు గోదావరి జిల్లా చాగల్లులోని జైపూర్ షుగర్ ఫ్యాక్టరీ చైర్‌పర్సన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత రాజేశ్వరి రామకృష్ణన్ (94) తమిళనాడు రాష్ట్రం కోయంబత్తురులోని స్వగృహంలో శుక్రవారం కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు ఆర్.ప్రభు కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. భర్త పీఆర్ రామకృష్ణన్ పారిశ్రామిక వేత్త. ఆమె స్థానిక జైపూర్ షుగర్ ఫ్యాక్టరీ యజమానిగా, పారిశ్రామికవేత్తగా, విద్యాదాతగా ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితురాలు. రాజేశ్వరి దివంగత వెలగపూడి రామకృష్ణన్ కుమార్తె. ఆమె చాగల్లులో 1964లో చక్కెర కర్మాగారం స్థాపించారు. డిస్టిలరీస్, కో–జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెంలో డిస్టిలరి, ఒరిస్సా రాష్ట్రం రాయగడలో షుగర్ ఫ్యాక్టరీ, డిస్టిలరి పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. చాగల్లు ప్రాంతంలో రైతులతో వాణిజ్య పంట చెరుకును సాగు చేయించి అభివృద్ధికి కృషి చేశారు. తండ్రి జన్మస్థలమైన గుంటూరులో కో–ఎడ్యుకేషనల్ కాలేజీ కోసం ఆయన పేరు మీద ఉన్న భూమితో సహా సుమారు రూ.50 లక్షలు విరాళంగా అందించారు. చాగల్లులో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు స్థలంతో పాటు, ఏలూరులోని సీఆర్ రెడ్డి కాలేజీలో ఇంజినీరింగ్ విభాగానికి విరాళాలు అందించారు. నిడదవోలులోని పురుషుల కళాశాల, మహిళా కళాశాల, కంటి ఆస్పత్రికి విశేష విరాళాలు అందజేశారు. ప్రత్యక్షంగా పరోక్షంగా వేల కుటుంబాలకు జీవన ఉపాధి కల్పించిన ఆమె మరణం చాగల్లు పరిసర ప్రాంత రైతులకు తీరని లోటు అని ఫ్యాక్టరీ ఆక్యూపేయర్ ఆళ్ల శివకుమార్ తెలిపారు.

చంద్రబాబు నివాసంలో చండీయాగం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం చండీయాగం, సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే శతచండీ పారాయణ ఏకోత్తర వృద్ధి మహాచండీ యాగం, సుదర్శన నారసింహ హోమంలో భాగంగా మొదటి రోజు చంద్రబాబు దంపతులు యజ్ఞక్రతువులు నిర్వహించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు పార్టీ నేతలు కుటుంబ సభ్యులతో కలిసి యాగంలో పాల్గొన్నారు.

నేడు వ్యూహం ప్రీ రిలీజ్ ఈవెంట్



ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామ్ గోపాల్ వర్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం వ్యూహం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు చిత్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ చెప్పారు. ఈవెంట్ నిర్వాహణ ఏర్పాట్లను శుక్రవారం నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. మీడియాతో వర్మ మాట్లాడుతూ ఈ నెల 29న వ్యూహం సినిమాను విడుదల చేస్తామన్నారు. సినిమాలో చంద్రబాబు, పవన్, చిరంజీవి, షర్మిల, సోనియా, రాహుల్ పాత్రలు ఉంటాయని చెప్పారు. 2009 నుంచి నుంచి 2019 ఎన్నికల వరకూ సీఎం వైఎస్ జగన్‌కు సంబంధించిన అన్ని ఘట్టాలు ఇందులో చూపించినట్లు తెలిపారు. జనవరిలో వ్యూహంకు కొనసాగింపుగా శపథం రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. తమ సినిమాలకు ఎన్నికల కోడ్ అడ్డు రాదన్నారు. సీఎం జగన్ ఆలోచనా విధానం నచ్చింది కాబట్టే సినిమాలు తీస్తున్నానన్నారు. శపథం సినిమాలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సక్సెస్‌లు, ఫెయిల్యూర్‌లు చూపించనున్నట్లు వర్మ పేర్కొన్నారు.



వణికిస్తున్న చలిగాలులు

మన్యం ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లావ్యాప్తంగా దట్టంగా పొగమంచు కురుస్తుండడంతోపాటు చలిగాలుల తీవ్రత పెరిగింది. శుక్రవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 7.3 డిగ్రీలు, అరకులోయలో 9.5 డిగ్రీలు, మినుములూరులో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం పది గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తోంది. సాయంత్రం 4 గంటల నుంచి చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. - సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



తోటకూర గింజలతో శ్రీవారి పాదాలు

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ తోటకూర గింజలతో శ్రీవారి పాదాలు, శంఖు, చక్రాలు, నామం రూపొందించి అందర్నీ అబ్బురపరిచారు. దీనికి 3,280 తోటకూర గింజలను వినియోగించారు. ఈ చిత్రంతో పాటు వేంకటేశుని సుప్రభాతాన్ని సూక్ష్మలిపిలో లిఖించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని తయారు చేసినట్టు రవికుమార్ శనివారం తెలిపారు.

- మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా)

స్వచ్ఛ ఓటర్ల జాబితా ముఖ్యం

- పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలి
- స్వీప్ కార్యక్రమాలు క్రియాశీలకంగా ఉండేలా చూడాలి
- పటిష్ట ప్రణాళికతో ఎన్నికలు సజావుగా నిర్వహించాలి
- పొరపాట్లకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరం
- రాష్ట్ర అధికారులకు ఈసీఐ ప్రతినిధుల బృందం ఆదేశం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు అనేది అత్యంత కీలకమని, 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా రాష్ట్ర అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారులు ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీలో 100శాతం స్వచ్ఛత ఎంత ముఖ్యమో... ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని ఈసీఐ ప్రతినిధుల బృందం సారథి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)–2024, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై శుక్రవారం విజయవాడలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ వ్యాస్, స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మేరా, అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్‌తోపాటు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనా, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, స్టేట్ పోలీస్ నోడల్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ తదితరులు హాజరయ్యారు. ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ అర్హత ఉన్నవారందరూ ఓటు నమోదు చేసుకునేలా, ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించడం ప్రధానమని చెప్పారు. బూత్, నియోజకవర్గ స్థాయిలో గతంలో నమోదైన పోలింగ్ శాతాలను పరిశీలించి... తక్కువగా ఉన్నచోట అందుకు కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి అవరోధాలు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకు సమగ్ర, పటిష్ట ఎన్నికల నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) అవసరమని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాతోపాటు సుశిక్షితులైన మానవవనరులు, మెటీరియల్ తదితరాలపై దృష్టిసారించాలన్నారు. ప్రస్తుతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వేదికలు ఓటర్ల జాబితా రూపకల్పన, ఎన్నికల నిర్వహణలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయని, ఈఎస్ఎంఎస్, సువిధ, ఈఎన్‌కోర్, సీవిజిల్, ఈటీపీబీఎంఎస్, ఓటర్ టర్నవుట్, కౌంటింగ్ ఓట్స్ యాప్‌లపై అధికారులు, సిబ్బందికి తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు. జిల్లాస్థాయిలోనూ సమర్థ మానవ వనరులతో ఐటీ టీమ్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాగా, ఓటు హక్కుపై స్ఫూర్తిదాయకమైన ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు, విశ్వసనీయత పెంపొందిస్తూ క్షేత్రస్థాయి తనిఖీల ఆధారంగా ఓటుకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం, మద్యం, డబ్బు తదితరాల అక్రమ రవాణాలను అడ్డుకునేందుకు సరిహద్దు జిల్లాలు, రాష్ట్రాల మధ్య సమన్వయం, ఎన్నికల సమయంలో నమోదైన కేసుల విచారణ, రాజకీయ తటస్థత కలిగిన ఎన్జీవోలు, పౌర సంస్థల భాగస్వామ్యం, పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖల మధ్య సమన్వయం, ఓటింగ్ శాతం పెంపు కోసం వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు తదితరాలపై ఈసీఐ అధికారులు పలు సూచనలు చేశారు.

కలెక్టర్లు, ఎస్పీల పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఈ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు ఎస్ఎస్ఆర్–2024, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎస్పీలు శాంతిభద్రతల పరిరక్షణ, గత ఎన్నికల నిర్వహణ సమయంలో ఉల్లంఘనలకు సంబంధించి నమోదైన కేసుల విచారణ, అక్రమ మద్యం, డబ్బు తరలింపులను అడ్డుకునేందుకు తీసుకుంటున్న చర్యలు, చెక్‌పోస్టుల మ్యాపింగ్, సమస్యాత్మక, వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

పారదర్శకంగా ఎస్ఎస్ఆర్–2024: సీఈవో

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో దరఖాస్తులు అందాయన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఆర్–2023 కింద ఈ ఏడాది జనవరి 5న తుది జాబితా ప్రచురించిన తర్వాత నుంచి దాదాపు 90 లక్షల దరఖాస్తులు వచ్చాయని.. వీటిలో 89 లక్షల దరఖాస్తుల పరిష్కారం పూర్తయిందన్నారు. మిగిలినవి ఈ నెల 26లోపు పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. జిల్లా అధికార యంత్రాంగం ఎస్ఎస్ఆర్–2024, ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి ప్రతి దశలోనూ సమస్యను గుర్తించడంతోపాటు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 26 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



తిరుమలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.



తిరుమల ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా

గణనాథుని సేవలో న్యాయమూర్తులు





ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమశేఖర్‌లకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వారిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమశేఖర్ వేర్వేరుగా కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

తిరుమలకు వైకుంఠ శోభ

- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం
- శనివారం తెల్లవారుజాము నుంచే వైకుంఠ ద్వారదర్శనం
- పది రోజుల దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి



తిరుమలలో భక్తుల రద్దీ

తిరుమల: తిరుమల పుణ్యక్షేత్రంలో పది రోజుల పాటు జరగనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శ్రీవారి ఆలయంలో ఈనెల 23వ తేదీ తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాలు జరగనున్నాయి. 23వ తేదీన ఉదయత్పూర్వం తిరుప్పావైతో శ్రీవారిని మేల్కొలిపి ఏకాంతంగా ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తారు. సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు చేపట్టారు. శనివారం వేకువజాము ఒంటి గంట 45 నిమిషాల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభిస్తారు. అనంతరం ఉ.6 గంటల నుంచి సామాన్య భక్తులకు దర్శనాలు ప్రారంభమవుతాయి. శనివారం ప్రారంభమైన వైకుంఠ ద్వార దర్శనం జనవరి ఒకటో తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులను అనుమతిస్తారు.

టోకెన్లు జారీ

తిరుపతిలోని 9 కేంద్రాల్లో 23వ తేదీ నుంచి జనవరి 01వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనార్థం ఉచితంగా టోకన్ల జారీని గురువారం అర్ధరాత్రి నుంచే ప్రారంభించారు. రోజుకు 40 వేల చొప్పున 10 రోజుల పాటు టోకెన్లు జారీ చేస్తారు. 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి శుక్రవారం రాత్రి భక్తులకు టోకెన్లు అందించారు. అలాగే రెండు లక్షలకు పైగా రూ.300 ప్రత్యేక దర్శన టికెట్లు, మహా లఘు దర్శనం కోసం రోజూ 2,000 శ్రీవాణి టికెట్లను కూడా మంజూరు చేశారు. ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సిఫారసు లేఖలు రద్దు చేశారు. ఈ పది రోజుల పాటు రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న ప్రముఖులకు మాత్రమే దర్శనం కేటాయిస్తారు. మూడు లక్షల 50 వేల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచారు. ఇక భక్తుల సౌకర్యార్థం అన్నదాన భవనంలో 10రోజుల పాటు ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ చేయనున్నారు. ఇక వైకుంఠ ఏకాదశి రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా రెండువేల మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు.

నేడు స్వర్ణరథంపై ఊరేగనున్న స్వామి వారు

శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు సహస్రదీపాలంకార సేవ జరుగుతుంది.

ఏఆర్ఆర్‌పై వచ్చే నెలలో ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ


- ప్రతిపాదనలపై జనవరి 8 వరకూ అభ్యంతరాలు స్వీకరణ
- జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకూ విశాఖలో విచారణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ఏఆర్ఆర్), ట్రాన్స్‌మిషన్ టారిఫ్ ఆర్డర్ (టీఎఫ్‌టీ) నివేదికలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) వచ్చే ఏడాది జనవరిలో బహిరంగ విచారణ చేపట్టనుంది. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో)తో పాటు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు, స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎస్ఎల్‌డీసీ), ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో)లు గత నెల 30న ఏపీఈఆర్సీకి నివేదించాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఏఆర్ఆర్, 5వ కంట్రోల్ పీరియడ్ 2024–2029 నియంత్రణ కాలానికి సంబంధించి నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను మండలికి సమర్పించాయి. ఈ నివేదికలన్నింటినీ ఈ నెల 10, 12 తేదీల్లో అధికారిక వెబ్‌సైట్లు, ప్రముఖ దినపత్రికల్లో ప్రచురించడం కూడా జరిగింది. దీనికి సంబంధించిన నివేదిక ప్రతులను రూ. 100 చెల్లించి ఎవరైనా పొందవచ్చని ఏపీఈఆర్సీ తెలిపింది. ప్రతిపాదనలపై వచ్చే నెల 8 వరకూ ఏపీఈఆర్సీ ఈ–మెయిల్ ద్వారా అభ్యంతరాలు స్వీకరించనుంది. అనంతరం జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ విశాఖలోని ఏపీఈఆర్సీ క్యాంపు కార్యాలయంలో విచారణ చేపట్టనుంది. ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సా.4.30 గంటల వరకూ షెడ్యూల్ ప్రకారం కమిషన్ విచారిస్తుంది. ప్రజలు, పారిశ్రామిక, సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొనేదానిని బట్టి వారి నుంచి వచ్చే స్పందన ఆధారంగా షెడ్యూల్‌లో మార్పులను ఏపీఈఆర్సీ చైర్మన్ చేసే అవకాశం ఉంది. అవసరమైతే మరో రోజు బహిరంగ విచారణలు కొనసాగించవచ్చని మండలి స్పష్టం చేసింది. అలాగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొనాలనుకునే వారు ఆ విషయాన్ని ముందుగా చెప్పాలి. తమ ఉద్దేశాలు, అభ్యంతరాలు, సూచనలను ఏ విద్యుత్ సంస్థపై సమర్పించాలని అనుకుంటున్నారో సంబంధిత సంస్థ అధికారులకు తెలియజేస్తూ, పేరు, తేదీ వివరాలతో ఆ కాపీని ఏపీఈఆర్సీకి కూడా పంపాలి. ఇలా నమోదు చేసుకున్న వ్యక్తుల పేర్లు రోజువారీ జాబితాను కమిషన్ తమ వెబ్‌సైట్లో ఉంచుతుంది. జాబితాలో పేరున్నవారు నేరుగా క్యాంపు కార్యాలయంలో విచారణకు హాజరు కావచ్చు. ఒకవేళ విచారణ రోజున స్వయంగా రాలేకపోతే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారు తమ విజ్ఞప్తులను దాఖలు చేయవచ్చు. ఇళ్లు, కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభ్యంతరాలను సమర్పించేందుకు సాధారణ ప్రజలకు వీలు కలిగేలా మీటింగ్ లింక్‌ను అందిస్తారు. ఈ మొత్తం బహిరంగ విచారణలు ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 23-12-2023

క్రిస్మస్ కళ







శాంటా ఊరికి వెళదామా?

క్రిస్మస్ రోజున శాంటా తాత వస్తాడు. బహుమతులెన్నో తెస్తాడు. శాంటా ఉత్తర ధ్రువం నుంచి వస్తాడని అందరూ అంటారు. కాదు శాంటా మా ఊరి నుంచి వస్తాడు అంటారు ఫిన్‌లాండ్ దేశస్థులు. ఫిన్‌లాండ్‌లోని 'రొవానియమి' పెద్ద టూరిస్ట్ అట్రాక్షన్. ప్రతి క్రిస్మస్‌కు పర్యాటకులు అక్కడకు వెళ్లి శాంటా ఊరు ఇదేనంటూ సందడి చేస్తారు. ఈ ఊరి విశేషాలు చాలానే ఉన్నాయి. పిల్లలకు చెప్తే అబ్బుర పడతారు.

'జింగిల్ బెల్స్ జింగిల్ బెల్స్ జింగల్ ఆల్ ద వే'... ఎర్రని దుస్తుల్లో, తలమీద టోపీతో, గుబురు గెడ్డంతో, రైన్ డీర్లు లాగే స్లెడ్జ్ బండి మీద, బోలెడన్ని కానుకలు మూటగట్టుకుని క్రిస్మస్ రాత్రి ఆకాశ వీధుల గుండా క్రిస్మస్ తాత వస్తాడని పిల్లలకు ఒక నమ్మకం. క్రిస్మస్ వచ్చే ముందే తల్లిదండ్రులు పిల్లల్ని 'క్రిస్మస్ తాత ఏం ఇస్తే బాగుంటుందని అనుకుంటున్నావు' అని అడుగుతారు. కొందరు పిల్లలు 'ఫలానాది ఇవ్వు' అని క్రిస్మస్ తాతకు లెటర్లు రాస్తారు. కొందరు పిల్లలు ఇవేవీ అడక్కుండా తమకోసం ఏం ఇస్తాడో చూద్దాం అని ఉత్సుకతతో ఎదురు చూస్తారు.

ఎవరి బాల్యంలో అయినా ఇది అద్భుతమైన జ్ఞాపకం. క్రిస్మస్ తాత అంటూ ఎవరూ రారు అని పిల్లలకు తెలిసినా... ఏమో వస్తాడేమో అనుకునే అమాయకమైన వయసు అది. వస్తాడేమో అనిపించే ఉత్సుకత ఉండే ప్రాయం అది. అందుకే తల్లిదండ్రులు, బంధువులు చిన్నారులు ఉన్నచోట వారు నిద్ర పోయాక వారి కోసం తల దగ్గర కానుకలు పెట్టి వెళతారు. పిల్లలు తెల్లారి లేచి వాటిని చూసుకుని 'శాంటా ఇచ్చాడు' అని సంబర పడతారు.

శాంటా తాత ఎవరు?

ఇది బైబిల్ పాత్ర కాదు. క్రీ.శ.280 కాలంలో టర్కీలో సెయింట్ నికొలస్ అనే ఒక బిషప్ క్రిస్మస్ పండుగ నాడు పేదవారికి, ముఖ్యంగా పిల్లలకు ఎంతో కొంత సహాయం చేసేవాడట. నిద్రపోతున్న వారి పక్కన కానుకలు, డబ్బు పెట్టి వెళ్లేవాడట. సాక్సుల్లో బంగారు నాణెలు పెట్టి ఇళ్లల్లో పడేసేవాడని అంటారు. పండగంటే ఆనందం పంచడమే కదా. ఇది అందరికీ నచ్చింది. ఇలా ఒక తాత వచ్చి కానుకలు ఇస్తే బాగుండు అనే కోరిక పెరిగింది. మంచి కోరికను తీర్చడానికి ప్రపంచమంతా ముందుకొస్తుంది. అందుకే క్రిస్మస్ తాత అందరి తాత అయ్యాడు. సెయింట్ నికోలస్ కాస్తా శాంటా క్లాజ్ అయ్యాడు.



శాంటా ఊరు

నిజమైన శాంటా క్లాజ్ టర్కీ వాడైనా కాల క్రమంలో నార్త్‌పోల్ వాడయ్యాడు. దీనికి కారణం 1893–96ల మధ్య థామస్ నాస్ట్ అనే అమెరికన్ కార్టూనిస్టు శాంటా క్లాజ్ బొమ్మలు పత్రికలకు గీసి శాంటా నార్త్‌పోల్ వాడని అడ్రస్ పెట్టాడు. దానికి కారణం ఆ రోజుల్లో నార్త్ పోల్ (ఉత్తర ధ్రువం) ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు కనుక దాని చుట్టూ ఒక దైవిక కల్పనలు సాగేవి. సెయింట్స్ అక్కడే ఉంటారని అనుకొని ఉండొచ్చు. అదీగాక అక్కడ ఎప్పుడూ మంచు పడుతూ ఉంటుంది కనుక క్రిస్మస్ అంటే మంచుకాలం కనుక థామస్ నాస్ట్ ఏకంగా 24 గంటలూ మంచు ఉండే ప్రాంతాన్ని శాంటా క్లాజ్ తావును చేసి ఉంటాడు. ఇక అక్కడ రైన్‌డీర్లు ఉంటాయి కాబట్టి వాటిని వాహనంగా మార్చారు.

ఫిన్‌లాండ్ ఊరు

ఫిన్‌లాండ్ దేశం వారు శాంటా తమ ఊరి వాడేనని ఒక వాదన మొదలుపెట్టారు– పర్యాటక ఎత్తుగడే కావచ్చు. ఫిన్‌లాండ్ ఆర్కిటిక్ సర్కిల్‌లో వచ్చే దేశం కాబట్టి అక్కడ ఎప్పుడూ మంచే కాబట్టి శాంటా ఊరు తమ దేశంలోదే అనుకుని ఉండొచ్చు. అంతటితో ఆగక 'రొవానిఎమి' అనే ఊరిని శాంటా ఊరిగా టూరిస్ట్ ఎట్రాక్షన్ చేశారు. ఇక్కడ శాంటా ఇల్లు, శాంటా పోస్టాఫీసు, శాంటా తిరిగే స్లెడ్జ్‌బళ్లు అన్నీ ఉంటాయి. మైనస్ 12 డిగ్రీల చల్లదనం ఉండే క్రిస్మస్ కాలంలో కూడా టూరిస్టులు శాంటా ఊరికి వెళ్లి సందడి చేస్తారు. మత భావనలు పొందుతారు. ఈ ఊరి వారు శాంటాతో మాట్లాడాలనుకునే పిల్లల కోసం ఒక టెలిఫోన్ నంబర్ కూడా ఇచ్చారు. ఇక్కడి పోస్టాఫీసుకు ప్రతి సంవత్సరం 200 దేశాల నుంచి రెండు లక్షల ఉత్తరాలు శాంటా నుంచి పిల్లలకు వస్తాయి. ఇక్కడకు వెళ్లిన పర్యాటకులు ఇక్కడి పోస్టాఫీసులో ఉత్తరం రాసి పడేస్తే కరెక్ట్‌గా క్రిస్మస్‌కు అందేలా పంపుతారు. అంటే శాంటా పంపినట్టు పంపుతారు. అదో సరదా.

శాంటా అబద్ధం కావచ్చు.

కాని శాంటా ఉంటాడన్న పిల్లల అమాయక కామన అబద్ధం కాకూడదు.

ఈ క్రిస్మస్ రోజున అందరు పిల్లలకూ, ముఖ్యంగా ఆట వస్తువులు లేని పేద పిల్లలకు మీరే శాంటాగా మారండి. హ్యాపీ క్రిస్మస్.

పదిహేడు సంవత్సరాల వయసులో ఫైనాన్షియల్ మ్యాటర్స్ గురించి చాలా తక్కువమందికి ఆసక్తి ఉంటుంది. జిందాల్ మాత్రం అలా కాదు. హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన పదిహేడు సంవత్సరాల కశ్వీ జిందాల్‌కు ఆర్థిక విషయాలు అంటే బోలెడు ఆసక్తి. ఆ ఆసక్తి ఆమెను ఆర్థికరంగానికి సంబంధించిన అనేకానేక విషయాల గురించి తెలుసుకునేలా, 'ఇన్వెస్ట్ ది చేంజ్'కు శ్రీకారం చుట్టేలా చేసింది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలలో డిజిటల్ అక్షరాస్యత పెరిగేలా కృషి చేస్తోంది. రకరకాల ప్రభుత్వ పథకాల గురించి తన బృందంతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది కశ్వీ జిందాల్...

ఆ అ అలా మొదలైంది

ఆర్థిక అక్షరాస్యత

సేవా పథం


కశ్వీ జిందాల్

ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సకీనా బతుకుదెరువు కోసం దిల్లీకి వచ్చిన కశ్వీ జిందాల్ ఇంట్లో చిన్నాచితకా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఒకసారి రోడ్డు ప్రమాదం నుంచి తృటిలో బయటపడిందామె. ఇక అప్పటి నుంచి ఆమెకు భయం పట్టుకుంది. 'ఒకవేళ నాకు ఏమైనా అయితే పిల్లల పరిస్థితి ఏమిటి?'

ఆ భయంలో ఆమెకు సరిగ్గా నిద్రపట్టేది కాదు. అలాంటి రోజుల్లో ఒకరోజు 'ఇన్వెస్ట్ ది చేంజ్' స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సమావేశానికి హాజరైంది. ఆ సమావేశంలో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన గురించి తెలుసుకుంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదానికి గురైనా, చనిపోయినా రక్షణగా నిలిచే పథకం ఇది. సంవత్సరానికి ఇరవై రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఈ పథకంలో తన పేరు నమోదు చేసుకున్న సకీనా 'ఇప్పుడు నిశ్చింతగా ఉంది' అంటుంది.

ఈ పథకంలో తన పేరు నమోదు చేసుకోవడానికి ముందు సకీనాకు బ్యాంకు ఎకౌంట్ లేదు. దీంతో కశ్వీ బృందం సకీనాకు బ్యాంక్ ఎకౌంట్ రిజిస్టర్ చేయించింది.

తండ్రి ఫైనాన్షియల్ రంగంలో పనిచేస్తుండడంతో జిందాల్‌కు ఫైనాన్షియల్ మార్కెట్స్‌కు సంబంధించిన విషయాలు ఆసక్తిగా తెలుసుకునేది. తండ్రి విసుక్కోకుండా ఓపిగ్గా చెప్పేవాడు. దీంతో జిందాల్‌కు ఎకనామిక్స్ అనేది ఫేవరెట్ సబ్జెక్ట్ అయింది. ఫైనాన్స్ రంగంలోనే తన కెరీర్ ఏర్పాటు చేసుకోవాలనే భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

తమ అపార్ట్‌మెంట్‌లో హౌస్‌కీపింగ్ పనిచేసే వ్యక్తి మరణించాడు. అతడి వయసు 31 సంవత్సరాలు మాత్రమే. అతడి మీద కుటుంబం మొత్తం ఆధారపడి ఉంది. ఆ సమయంలో ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఇతర వర్కర్‌లతో మాట్లాడుతున్నప్పుడు వారికి ప్రాథమిక ఆర్థిక విషయాలు, ప్రభుత్వ పథకాల గురించి ఏమీ తెలియదు అని అర్థం అయింది.

ఈ నేపథ్యంలో జిందాల్ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన...మొదలైన ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ తరువాత స్వచ్ఛంద సంస్థ 'ఇన్వెస్ట్ ది ఛేంజ్' ప్రారంభించింది.

తొలిరోజు నుంచి 'ఇన్వెస్ట్ ది చేంజ్' నిర్వహించిన అవగాహన సదస్సులకు అద్భుత స్పందన లభించింది. ఆ సదస్సుల తరువాత 'ఫలానా స్కీమ్‌లో చేరుతాము' అంటూ ఫోన్లు వెల్లువెత్తేవి. వారు స్కీమ్‌లో చేరేలా ఆన్‌లైన్ అప్లయింగ్, ఫామ్–ఫిల్లింగ్ వరకు జిందాల్ బృందం ప్రతి పని దగ్గరుండి చూసుకునేది. ఏదైనా అప్లికేషన్ ఆమోదం పొందకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించేది.

'ఇన్వెస్ట్ ది చేంజ్'లో పదిహేనుమంది వాలంటీర్లు ఉన్నారు.

వారి నమ్మకమే మన బలం



గొప్ప లక్ష్యాలతో ముందుకు వచ్చినప్పటికీ ప్రజల్లో నమ్మకం పాదుకొల్పడం అనేది అతి పెద్ద సవాలు. వారి నమ్మకాన్ని గెలుచుకుంటే సగం విజయాన్ని సాధించినట్లే. వ్యక్తిగత విషయాలు కూడా మనతో పంచుకుంటారు. నా వయసు అనేది పెద్ద సమస్యగా మారింది. ఈ చిన్న అమ్మాయికి ఏం తెలుస్తుంది... అంటూ నన్ను పెద్దగా పట్టించుకునే వారు కాదు. అయితే నా ఉపన్యాసాల ద్వారా వారిని ఆకట్టుకొని వారికి నా పట్ల నమ్మకం కుదిరేలా చేసే దాన్ని.

– కశ్వీ జిందాల్,
ఇన్వెస్ట్ ది చేంజ్–ఫౌండర్

'రోటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్' భాగస్వామ్యంతో ప్రాథమిక ఆర్థిక విషయాలు, ప్రభుత్వ పథకాల గురించి ఎన్నో ప్రాంతాలలో ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది జిందాల్.

'ఇన్వెస్ట్ ది చేంజ్' ఎంతోమందిని ప్రభావితం చేసింది. మార్పు తీసుకు వచ్చింది. ఆఫీస్ బాయ్‌గా పనిచేసే ప్రకాష్ మండల్... కోవిడ్ కల్లోలంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాడు. అతడికి ఉపయోగపడే గవర్నమెంట్ పాలసీల గురించి తెలియజేసి సహాయపడింది జిందాల్ బృందం.

'ఎన్నో స్కీమ్‌లు ఉన్నప్పటికీ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన నాకు నచ్చాయి. దీనికి కారణం సంవత్సరానికి చాలా తక్కువ మొత్తం కడితే సరిపోతుంది. స్కీమ్‌లో చేరాలనుకున్నప్పుడు ఫామ్స్ నింపడం, ఇతరత్రా విషయాలలో ఇబ్బంది పడ్డాను. ఇలాంటి సమయంలో జిందాల్ బృందం నాకు సహకరించింది' అంటున్నాడు ప్రకాష్.

భవిష్యత్‌లో ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి మరిన్ని కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలనుకుంటుంది జిందాల్.

'ఆర్థిక అక్షరాస్యత అనేది మనల్ని స్వతంత్రులను చేస్తుంది. తెలివైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. ప్రభుత్వ పథకాలతో పాటు పొదుపు మార్గాల గురించి కూడా తెలియజేస్తున్నాం' అంటుది కశ్వీ జిందాల్.

ముగ్గు ముచ్చట






సి. ఇందు సాయి
తడ, సూళ్లూరుపేట
తిరుపతి జిల్లా

9 చుక్కలు
1 వచ్చేవరకు
సరి చుక్క





కృష్ణవేణి
కొత్తగూడెం



20 చుక్కలు,
6 వరుసలు
6 వచ్చేవరకు



పద్మావతి
పల్లకడియం
తూర్పు గోదావరి జిల్లా

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



ఇంటిప్స్

- గ్లాసు నీళ్లల్లో బిర్యానీ ఆకు, దాల్చిన చెక్కను ముక్కలు చేసి వేయాలి. దీనిలో బోరిక్ యాసిడ్ రెండు టీస్పూన్లు వేసి మూడు గంటలపాటు నానబెట్టాలి. తరువాత ఈ నీటిని సింక్‌లో పోస్తే బొద్దింకలు రావు.
- నిమ్మకాయ ముక్కలు, పుదీనా ఆకులు వెనిగర్‌ను సమపాళ్లల్లో తీసుకుని ఐస్‌క్యూబ్ ట్రేలో పోసి రాత్రంతా రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ఉదయం ఈ ఐస్‌క్యూబ్‌ను తీసి దుర్వాసన వస్తోన్న సింక్‌లో వేస్తే దుర్వాసన పోతుంది.
- టొమాటో చుట్టూ చిన్నగా గాటు పెట్టి మరుగుతున్న నీటిలో వేయాలి. నిమిషం తరువాత తీసేసి ఐస్‌వాటర్‌లో వేయాలి. నిమిషం తరువాత టొమాటోను పట్టుకుని లాగితే తొక్క సులభంగా వచ్చేస్తుంది.
- బాణలిలో కొద్దిగా నీళ్లుపోసి ఆవిరైపోయేవరకు వేడిచేయాలి. బాణలిలో ఒక్క నీటిచుక్క కూడా లేనప్పుడు నూనె వేసి ఫ్రైచేస్తే ఏ పదార్థమైనా బాణలికి అంటుకోదు.





ఈ రిక్షానే ఆసరాగా...

జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరిలా, పరిమళాలు వెదజల్లే పూలపాన్పులా ఉండదు. తమకున్న వనరులను ఉపయోగించుకుని పైగి ఎదగడానికి ప్రయత్నించి పెద్దవాళ్లు అయిన వాళ్లే ఎక్కువ. వీరు ఎంతోమందికి ప్రేరణగా కూడా నిలుస్తుంటారు. ఈ కోవకు చెందిన వ్యక్తే మీనాక్షి దేవి. జీవితాన్ని కష్టాల సుడిగుండంలో కొట్టుకుపోనివ్వకుండా... ఈ–రిక్షా లాగుతూ కుటుంబానికి జీవనాధారంగా మారింది. ఇలా తనకెదురైన కష్టాలకు ఎదురీదుతూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది మీనాక్షి దేవి.


మీనాక్షి దేవి



జమ్ము కశ్మీర్‌లోని దోడా జిల్లా భదర్వా టౌన్‌కు చెందిన 39 ఏళ్ల మీనాక్షి జీవితం ఏడాది క్రితం వరకు ఆనందంగా సాగింది. భర్త పమ్మి శర్మ, ఇద్దరు పిల్లలతో ఎంతో చక్కగా సాగిపోతున్న వీరి సంసారంలో అనుకోని ఉపద్రవం ఏర్పడింది. మీనాక్షి భర్తకు కిడ్నీలు పాడయ్యాయి. చికిత్సకోసం అనేక ఆసుపత్రులు తిరిగారు. మెడికల్ బిల్లులు పెరిగాయి కానీ సమస్య తీరలేదు. ఈ క్రమంలో వారు దాచుకున్న డబ్బులు మొత్తం ఆవిరైపోయాయి. ఉన్న కారు అమ్మేసి, వ్యాపారాన్ని మూసేసి అప్పులు తీర్చినా ఇంకా కొన్ని అప్పుల భారం అలానే ఉండిపోయింది.

ఏ దారీ దొరక్క...

భర్త సంపాదించే స్థితిలో లేకపోవడంతో మీనాక్షి దేవి కుటుంబ పోషణ కోసం పని వెతుక్కోవాల్సి వచ్చింది. కానీ తను చేయగలిగింది దొరకలేదు. ఈఎమ్ఐ ద్వారా కొన్న ఆటో ఒకటి ఇంట్లో ఉండడంతో అప్పుడప్పుడు పమ్మిశర్మ మీనాక్షికి సరదాగా ఆటో నేర్పించేవాడు. అప్పటి డ్రైవింగ్ స్కిల్స్‌ను మరింత మెరుగు పరుచుకుని ఆటో నడపాలనుకుంది మీనాక్షి. ఆమె కోరిక మేరకు ఆటో నడపడాన్ని పూర్తిస్థాయిలో నేర్పించాడు ఆమె భర్త. ఆ తరువాత సబ్సిడీలో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కోని, దాన్ని నడపడం ప్రారంభించింది మీనాక్షి. దానిమీద వచ్చిన డబ్బులతో భర్త మెడికల్ బిల్స్ కట్టడంతోపాటు, కొడుకులిద్దరి బాగోగులను చూసుకుంటోంది. ఇలా ప్రతికూల పరిస్థితుల్లో ఆటో డ్రైవర్‌గా మారిన మీనాక్షి దేవి చినాబ్ లోయలోనే తొలి ఈ–రిక్షా మహిళా డ్రైవర్‌గా నిలవడం విశేషం.

మరో ఆప్షన్ లేక..

"ప్రారంభంలో ఆటో నడుపుతానన్న నమ్మకం మీనాక్షికి లేదు. రద్దీగా ఉండే భదర్వా టౌన్‌లో ఆటో నడపడానికి చాలా భయపడేది. కుటుంబం గడవడానికి మరో గత్యంతరం లేదు. అందుకే ఎంతో కష్టపడి, ధైర్యంగా ఆటో నడపడం నేర్చుకుని అండగా నిలుస్తోంది. మీనాక్షిని చూస్తే నాకు తృప్తిగానే గాక, గర్వంగానూ ఉంది. రోజురోజుకి పెరిగిపోతున్న మెడికల్ బిల్స్ నన్ను తీవ్రంగా కుంగతీసేవి. ఒక దశలో తీవ్ర నిరాశకు లోనై.. పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన పడేవాడిని. నా రెండు కిడ్నీలు పనిచేయడం లేదు. ఎంతకాలం ఉంటానో కూడా తెలియని పరిస్థితుల్లో నా భార్య ఆటో నడుపుతూ నాకు మానసిక ప్రశాంతతను కల్పిస్తోంది" అని మీనాక్షి భర్త ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

"నాలుగు నెలల క్రితం తొలిసారి ఆటోతో ఆటోస్టాండ్‌లో అడుగు పెట్టాను. అక్కడ ఉన్న మిగతా డ్రైవర్లంతా నన్ను ఒక ఏలియన్‌లా చూశారు. కొంతమంది అయితే ఈమె కస్టమర్లను భద్రంగా ఇంటికి తీసుకెళుతుందో లేదో అంటూ చెవులు కొరుక్కునేవారు. లేదు. ఇరుగు పొరుగు, బంధువులు ఆటో నడపవద్దు అని నిరుత్సాహ పరిచారు. కానీ ఇది నా కుటుంబ జీవనాధారం. అందుకే నేను ఎవరి మాటలను పట్టించుకోకుండా ముందుకు సాగాను. రోజురోజుకీ నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పుడు రోజుకి పదిహేను వందల నుంచి రెండు వేలరూపాయల వరకు సంపాదిస్తున్నాను" అని మీనాక్షి సగర్వంగా చెబుతోంది.

శాస్త్ర నియమానుసారంగా కర్మలు చేస్తూనే ఈ ప్రపంచంలో నూరేళ్లు నిండుగా బతకాలని కోరుకోవాలి. ఈ విధంగా చేసే కర్మలు నిన్ను అంటవు. మానవ శరీరంలో లిప్తం కావు.
– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 23 డిసెంబర్ 2023

ఇది విజయమా... వైఫల్యమా?

చరిత్ర సృష్టించటం మంచిదే. కానీ ఆ చరిత్ర తరతరాలు చెప్పుకొనేలా వుండాలి. ఈ నెల 4న ప్రారంభమై ఎజెండా అంశాలన్నీ పూర్తికావటంతో ఒకరోజు ముందు గురువారం నిరవధిక వాయిదా పడిన పార్లమెంటు సమావేశాలు ఫలవంతమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. లోక్‌సభ వరకూ చూస్తే ఈ సమావేశాలు దాదాపు 62 గంటలు సాగాయి. అత్యంత కీలకమైన 18 బిల్లులు చర్చల అనంతరం ఆమోదం పొందాయి. ఇందులో భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), సాక్ష్యాధారాల చట్టం స్థానంలో కొత్త చట్టాలుగా వస్తున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులున్నాయి. టెలికమ్యూనికేషన్ల బిల్లు వుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్‌ల నియామకాల బిల్లుంది. వార్తాపత్రికలు, మేగజిన్‌ల కొత్త రిజిస్ట్రేషన్ చట్టం తాలూకు బిల్లు కూడావుంది. మొత్తంగా లోక్‌సభ 74 శాతం ఉత్పాదకతను చూపింది. రాజ్యసభ సైతం 17 బిల్లుల్ని ఆమోదించింది. సమావేశాలు 65 గంటల పాటు సాగాయి. దాని ఉత్పాదకత రేటు 79 శాతం వుంది. ఈ 17వ లోక్‌సభకు సంబంధించి ఇవి 14వ సమావేశాలు. వీటన్నిటా ఈ సమావేశాలే అత్యంత ఫలవంతమైనవని గణాంకాలు వివరిస్తున్నాయి. వచ్చే సాధారణ ఎన్నికల్లోగా మరో సమావేశం మాత్రమే జరుగుతుంది. అందులో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టడం మినహా మరే ఇతర కార్యకలాపాలూ వుండకపోవచ్చు. అయితే బాధాకరమైన అంశమేమంటే... ఈ ప్రధాన బిల్లుల చర్చల్లో దాదాపుగా విపక్షం లేదు. ఇరవై రెండేళ్ల నాటి చేదు అనుభవాన్ని గుర్తుకు తెస్తూ ఈనెల 13న యువకులు పదడుగుల ఎత్తునున్న ప్రేక్షకుల గ్యాలరీ నుంచి కిందకు దూకి పొగగొట్టాలు వదిలి దిగ్భ్రమపరిచారు. పార్లమెంటు వెలుపల సైతం అదే సాగింది. అమెరికాలో వున్న ఖలిస్తానీ తీవ్రవాది పన్నూ పార్లమెంటుపై దాడిచేస్తామని అంతకు చాలారోజులముందే బెదిరించాడు. అప్రమత్తంగా వుండాలని ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం సూచించాయి. అయినా పార్లమెంటు భద్రత వ్యవహారాలు చూసే వ్యవస్థ నిద్రాణమై వుంది. దాడి జరిగి పదిరోజులు గడుస్తున్నా దానికి సూత్రధారులెవరో ప్రజలకు తెలియలేదు. 2001 దాడినుంచి భద్రతా వ్యవస్థలు ఏ గుణపాఠమూ నేర్చుకోలేదని ఈ పరిణామం తెలియజేసింది. ఇదిగాక దేశాన్ని ఆశ్చర్యపరిచిన ఘటన మరొకటుంది. అది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సభా బహిష్కరణ. ఇన్ని చేదు ఉదంతాల మధ్య సమావేశాలు ఫలవంతంగా జరిగాయని అనుకోగలమా?

విపక్షాలు పాలకులను నిలదీయటం, అర్థవంతమైన చర్చల ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సర్వసాధారణం. తమ సూచనలనూ, సలహాలనూ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించే ప్రభుత్వానికి మూకుమ్మడిగా తమ అసమ్మతిని తెలియజేయటానికి వాకౌట్ ఒక ఆయుధం. తగిన జవాబిచ్చినా విపక్ష సభ్యులు ఉద్దేశపూర్వకంగా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని, నినాదాలు చేస్తున్నారని, ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని, అధ్యక్ష స్థానాన్ని కించపరుస్తున్నారని, దురుద్దేశాలు ఆపాదిస్తున్నారని భావించినప్పుడు అందుకు కారకులైనవారిపై సస్పెన్షన్ వేటు వేయటం కూడా కొత్తేమీ కాదు. కానీ అటువంటి ఉదంతాలు రాను రాను పెరుగుతుండటం, రివాజుగా మారటం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి ఉభయ సభలనుంచీ 146 మంది ఎంపీలు సస్పెండయ్యారు. లోక్‌సభలోకి యువకులు చొరబడటంపై ప్రధాని, హోం మంత్రి ప్రకటన చేయాలంటూ సభలో ఆందోళన నిర్వహించటం, వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు ప్రదర్శించటం కారణంగా ఈ సస్పెన్షన్లు చోటుచేసుకున్నాయి. కొందరు ఎంపీలపై సభాహక్కుల కమిటీకి ఫిర్యాదు వెళ్లింది. దేశం మొత్తాన్ని దిగ్భ్రమలో పడేసిన ఉదంతంపై ప్రకటన చేసే విషయంలో కేంద్రం ఎందుకంత పట్టుదలకు పోయిందో ఆశ్చర్యం కలిగిస్తుంది. లోక్‌సభలో దాడిచేసిన ఉదంతంపై ప్రకటన చేసినంత మాత్రాన విపక్షాలకు లొంగిపోయినట్టు కాదు... సంప్రదాయ విరుద్ధం అసలే కాదు. ఈ ఉదంతం వెనక ఏ శక్తులున్నాయో, వారి ఉద్దేశాలేమిటో వివరించటం వల్ల, తదనంతరం తీసుకున్న పటిష్ఠ చర్యలేమిటో చెప్పటంవల్ల దేశ ప్రజలకు సాంత్వన కలుగుతుంది.

ఈ సస్పెన్షన్ల పర్యవసానంగా అత్యంత కీలకమైన బిల్లులపై విపక్షం ఆలోచనలేమిటో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఉదాహరణకు ఐపీసీ స్థానంలో వచ్చిన భారతీయ న్యాయసంహిత బిల్లు పోలీసులకు తగినంత జవాబుదారీతనం ఇవ్వకుండానే వారికి విస్తృతాధికారాలు కట్టబెడుతున్నదని నిపుణులంటున్నారు. సీఆర్‌పీసీ స్థానంలో తెచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహితలో ఏ చర్య ఉగ్రవాదమో, ఏది కాదో నిర్ణయించే అధికారాన్ని పోలీసులకు ఇచ్చారు. దీన్ని న్యాయస్థానాల్లో సవాలు చేస్తామని విపక్షాలంటున్నాయి. ఇక టెలికాం బిల్లు అంశానికొస్తే జాతీయ భద్రతా ప్రయోజనాల కోసమంటూ తాత్కాలికంగా టెలికాం సర్వీసుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొనేందుకు అది వీలుకల్పిస్తోంది. సీఈసీ, ఈసీల నియామకం సంగతి సరేసరి. వీటన్నిటిపైనా లోతైన చర్చ సాగొద్దా? పౌరుల్లో తలెత్తిన సందేహాలకు సమాధానాలు దొరకాల్సిన అవసరం లేదా? కనీసం అందుకోసమైనా విపక్షాల సస్పెన్షన్లు ఎత్తివేసివుంటే పాలకపక్షం పెద్ద మనసు వెల్లడయ్యేది. గత దశాబ్దం వరకూ రాజీవ్‌గాంధీ హయాంలో 66 మంది ఎంపీల సస్పెన్షనే రికార్డుగా నమోదైతే, ఈసారి ఆ సంఖ్య 146కి ఎగబాకటం ఆందోళనకరం. సమావేశాల అంతరాయానికి కారకులెవరన్న అంశాన్నలా వుంచితే... సమన్వయంతో, సదవగాహనతో మెలగి పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యాన్ని నిలబెట్టడం ఇరుపక్షాల బాధ్యత కాదా?

న్యాయం వేగంగా జరిగేనా?

కేంద్ర ప్రభుత్వం నూతనంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలను తెచ్చింది. పార్లమెంట్ భద్రతా వైఫల్యం గురించిన ప్రతిపక్షాల ఆందోళన, బదులుగా అత్యధిక ఎంపీలు సస్పెండ్ కావడంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త బిల్లులు చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. ఇందులో పోలీసు కస్టడీ సంభావ్య వ్యవధికి సంబంధించిన భారీస్థాయి విస్తరణ, పౌర హక్కుల పరిరక్షణ మూలాన్నే దెబ్బతీస్తోంది. ఈ నూతన చట్టాలు వలసవాద తార్కికతకు తిరిగి శంకుస్థాపన చేశాయి. ఇక్కడ ప్రజలను గరిష్ఠ స్థాయిలో నియంత్రించడమే ప్రభుత్వ ప్రధాన ఆసక్తిగా ఉంది. అయితే దర్యాప్తు, విచారణ సమయంలో సమయపాలన, సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా న్యాయబద్ధతకూ, సామర్థ్యానికీ కట్టుబడి ఉండే నేర న్యాయవ్యవస్థను మాత్రం బీఎన్ఎస్ఎస్ ఊహిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ లా బిల్లులను వేగంగా ఉపసంహరించుకుంది; వాటికి బదులుగా భారతీయ న్యాయ సంహిత (ఐపీసీ, 1860 స్థానంలో తీసుకొచ్చిన బీఎన్ఎస్-2), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 స్థానంలో వచ్చిన బీఎన్ఎస్ఎస్-2) కొత్త వెర్షన్‌లను తెచ్చింది. అలాగే, భారతీయ సాక్ష్య చట్టాన్ని (ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 స్థానంలో తెచ్చిన బీఎస్‌బీ-2) తెచ్చింది. వీటి సారాంశం కచ్చితంగా, వివరంగా ఉన్నప్పటికీ, ఈ చట్టాలలో దాగి ఉన్న వాక్చాతుర్యం గురించి ఆందోళన చెందవలసి ఉంటుంది. క్రిమినల్ చట్టం, న్యాయం విషయంలో ఏదైనా పరివర్తనా దృష్టిని చూడటం వీటిల్లో కష్టమనే చెప్పాలి. మొత్తం మీద మితిమీరిన నేరీకరణ (క్రిమినలైజేషన్), విస్తృతమైన పోలీసు అధికారాల ద్వారా ప్రభుత్వ నియంత్రణను అసమంజసంగా విస్తరించే వ్యవస్థ వైపు మనం వెళ్తున్నట్లు కనిపిస్తోంది.



పోలీసులకు విస్తృత అధికారాలా?

బీఎన్ఎస్ఎస్‌కి చెందిన ఒక ప్రత్యేక అంశం పౌర హక్కులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. కానీ అది పెద్దగా ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు. బీఎన్ఎస్ఎస్‌లో పోలీసు కస్టడీ సంభావ్య వ్యవధికి సంబంధించిన భారీస్థాయి విస్తరణ, పౌర హక్కుల పరిరక్షణ మూలాన్నే దెబ్బతీస్తోంది. సాధారణ క్రిమినల్ చట్టం ప్రకారం ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీ గరిష్ఠ పరిమితిని 60 రోజులు లేదా 90 రోజులకు (నేర స్వభావాన్ని బట్టి) బీఎన్ఎస్ఎస్ విస్తరించింది. ఇప్పటివరకూ ఉన్న చట్టం ప్రకారం, పోలీసు కస్టడీని అరెస్టయిన మొదటి 15 రోజులకు పరిమితం చేస్తారు. అయితే బీఎన్ఎస్ఎస్‌లోని ఈ కస్టడీ విస్తరణ పోలీసుల మితిమీరిన చర్యల ప్రమాదాన్ని పెంచుతుంది. పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తుల భద్రత గురించి ఇప్పటికే ఎన్నో ఆందోళనలు ఉన్నాయి. నిర్బంధపూరితంగా, బలవంతంగా పొందుపర్చే కల్పిత సాక్ష్యాలకు చెందిన అధిక ప్రమాదం కూడా ఉంటుంది. అయినప్పటికీ బీఎన్ఎస్ఎస్ పోలీసు అధికారాలను దిగ్భ్రాంతికరంగా విస్తరించిందనే చెప్పాల్సి ఉంది. విశేషమేమిటంటే, మన సాధారణ క్రిమినల్ చట్టం ఇప్పుడు ప్రత్యేక చట్టాలకే పరిమితమైన నిబంధనలను కలిగి ఉండటం. వాస్తవానికి, ఈ నిబంధనలు పోలీసు కస్టడీ వ్యవధిపై 'ప్రత్యేక చట్టాలు' అందించిన వాటికంటే కూడా మించి ఉన్నాయి.

ఈ పోలీసు కస్టడీ విస్తరణను భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని అత్యంత విస్తారమైన, అస్పష్టమైన నేరాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. అనేక నేరాలు మితిమీరిన నేరీకరణ గురించిన కసరత్తులా ఉన్నాయి. రాజ్య భద్రతను పరిరక్షించడానికి ఉద్దేశించిన నేరాలకు ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. ఉదాహరణకు, బీఎన్ఎస్-1లోని విస్తృత పదాలతో కూడిన నిబంధనలు, తప్పుడు సమాచారానికి శిక్ష (భారతదేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రత లేదా భద్రతకు హాని కలిగించే తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారం) వంటివి బీఎన్ఎస్-2లోనూ అలాగే ఉన్నాయి. పునర్నిర్మించిన బీఎన్ఎస్‌లో 'విద్రోహం' అనే పదాన్ని తొలగించినప్పటికీ, దానికి మరోరూపమైన నేరం – భారత సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతకు హాని కలిగించడం– రెండు వెర్షన్లలోనూ విస్తారమైన, అస్పష్టమైన పదాలతో బాధించడం కొనసాగింది. బీఎన్ఎస్-1 కూడా 'వ్యవస్థీకృత నేరం', 'ఉగ్రవాద చర్య'పై విస్తారమైన పదాలతో కూడిన నేరాలను పరిచయం చేసింది. ప్రత్యేకించి వాటిని ఎదుర్కోవడానికి వాటి ప్రస్తుత నిర్వచనాలకు మించి నిర్వచించింది. 'చిన్న వ్యవస్థీకృత నేరం' అనేది ఒకటి కొత్తగా చేరింది. ఇందులో స్నాచింగ్, పిక్-పాకెటింగ్, బ్లాక్‌లో టిక్కెట్లను విక్రయించడం వంటి వివిధ రకాల వ్యవస్థీకృత దొంగతనాల గురించిన అస్పష్టమైన జాబితా ఉంది.

ఈ నేరాల పరిధి బీఎన్ఎస్-2లో విస్తృతంగా కొనసాగుతుండగా, చిన్న వ్యవస్థీకృత నేరాల, వ్యవస్థీకృత నేరాల పరిధిని స్పష్టం చేయడానికి, పరిమితం చేయడానికి ప్రయత్నం అయితే జరిగింది. 'ఉపా'లోని సెక్షన్ 15 కింద ఉన్న 'ఉగ్రవాద చట్టం' నిర్వచనానికి అనుగుణంగానే బీఎన్ఎస్-2 కూడా ఉంది. అయినప్పటికీ, ఉపాపై పెట్టిన తీవ్రవాద నేరాలకు బీఎన్ఎస్ వర్తింపు గురించి స్పష్టత లేదు. బీఎన్ఎస్-2లో కొత్తగా జోడించిన వివరణ ప్రకారం, పోలీసు సూపరింటెండెంట్ స్థాయి కంటే తక్కువ స్థాయి లేని అధికారి ఈ నిబంధన లేదా చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967 ప్రకారం కేసు నమోదు చేయాలా వద్దా అని నిర్ణయిస్తారు. అధికారి ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకుంటారనే దానిపై నిజమైన మార్గదర్శకత్వం లేని ఇది ఒక ఆసక్తికరమైన నిబంధన.

చట్టంలోని అనేక సానుకూల అంశాలు మన నేర న్యాయ వ్యవస్థలో ప్రాథమిక పరివర్తనలపై ఆధారపడి ఉంటాయి. దర్యాప్తు, విచారణ సమయంలో సమయపాలన, సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, న్యాయబద్ధతకూ, సామర్థ్యానికీ కట్టుబడి ఉండే నేర న్యాయ వ్యవస్థను బీఎన్ఎస్ఎస్ ఊహించింది. శోధనకు, నిర్బంధానికి సంబంధించిన ఆడియో-వీడియో రికార్డింగ్ తప్పనిసరి అవసరం అనేది పోలీసు పనితీరులో మరింత జవాబుదారీతనం, పారదర్శకత తేవడంలో ఒక ముఖ్యమైన దశ అవుతుంది. ఏది ఏమైనప్పటికీ, మనం లోతైన నిర్మాణాత్మక అడ్డంకులను పరిష్కరిస్తే తప్ప, సత్వర న్యాయం, సమర్థవంతమైన దర్యాప్తునకు చెందిన లక్ష్యాలను న్యాయబద్ధంగా సాధించలేమని గుర్తించడం చాలా ముఖ్యం.

కస్టడీలో సీసీటీవీ కెమెరాలుండాలి

అధికంగా ఉన్న ఖాళీలు, ఇప్పటికే అధిక భారం మోస్తున్న న్యాయవ్యవస్థ సమస్యలను పరిష్కరించకుండా సమయపాలనను చేరుకోలేము. విచారణలో ఫోరెన్సిక్ నిపుణుల తప్పనిసరి ప్రమేయం, విచారణ సమయంలో ఆడియో-వీడియో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం (పోలీసుల వాంగ్మూలాల రికార్డింగ్‌తో సహా), మౌలిక సదుపాయాలు, పరికరాలు, సిబ్బంది శిక్షణలో అభివృద్ధి అవసరం. ఫోరెన్సిక్స్‌లో, సామర్థ్య సమస్యలతో పాటు, మన నేర న్యాయ వ్యవస్థలో ఉపయోగించే పద్ధతుల శాస్త్రీయ ప్రామాణికతకు సంబంధించి చాలా లోతైన సమస్య ఉంది. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ద్వారా దేశంలో ఫోరెన్సిక్ సైన్స్ సామర్థ్యాన్ని పెంపొందించడానికి గణనీయమైన తోడ్పాటు అవసరం. అయితే ఫోరెన్సిక్, నిపుణుల సాక్ష్యాలకు సంబంధించిన విధానం గురించి ప్రాథమిక ప్రశ్నలు ఎక్కువగా పరిష్కృతం కాలేదు. సమర్థత, న్యాయం గురించి మనం జాగ్రత్త పడినట్లయితే, కస్టడీ హింసను నిరోధించడానికి పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే ప్రయత్నం విధిగా ఉండాలి. ఇవి ఏ నేపథ్యంలో అమలు అవుతాయో తగినంతగా లెక్కించకుండానే మనం తరచుగా సాంకేతికత, సామర్థ్యానికి చెందిన ప్రశ్నలను పరిశీలిస్తాము.

మొత్తంగా ఈ చట్టాలు మన నేర న్యాయ వ్యవస్థలో పాతుకుపోయిన అన్యాయాలను సరిదిద్దే అవకాశాలను కోల్పోయాయి. బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్‌బి రెండు వెర్షన్‌ల మధ్య మార్పులు ఉన్నాయి, కానీ నేర చట్టానికి సంబంధించిన విధానంలో ఎటువంటి ప్రాథమిక మార్పు వీటిలో లేదు. ఇప్పటికే ఉన్న క్రిమినల్ చట్టాన్ని నిర్వీర్యం చేసే బదులు, ఈ నూతన చట్టాలు వలసవాద తార్కికతకు మళ్లీ శంకుస్థాపన చేశాయి. ఇక్కడ ప్రభుత్వ ప్రధాన ఆసక్తి ప్రజలను గరిష్ఠ స్థాయిలో నియంత్రించడంగానే ఉంది.

– అనూప్ సురేంద్రనాథ్, జెబా సికోరా
వ్యాసకర్తలు ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ 'ప్రాజెక్ట్ 39ఏ'లో పనిచేస్తున్నారు.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏమైంది మనకు?



మన క్రీడలు, ప్రజాస్వామ్యానికి సంబంధించి ఒక సిగ్గుచేటైన నేరారోపణ వస్తుంది. అయినా భారత రెజ్లింగ్ సమాఖ్యకు వాళ్ల వర్గమే తిరిగి ఎన్నికవుతుంది. అగ్రశ్రేణి మల్లయోధులు తమ కెరియర్ నుంచి విరమణ ప్రకటిస్తారు. కానీ మంత్రులు, నాయకులు ఎవరినుంచీ కూడా ఒక వ్యాఖ్యానం రాదు. మన సామూహిక నైతికతా, వివేకమూ ఏమైనాయి?

– యశోవర్ధన్ ఝూ ఆజాద్, మాజీ ఐపీఎస్

జడ్జ్ చేయొద్దు



జనం ఎవరిదో ఒకే ఒక్క పోస్ట్ చూస్తారు. కేవలం దాని ద్వారా వాళ్లకు ఆటిజం లేదా ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్) ఉందని నిర్ణయించేస్తారు. ఇది ఎంత చిరాకు కలిగిస్తుందో చెప్పలేను. మీ వికృత అంచనాలతో ఎదుటివారిని శల్యపరీక్ష చేయడం మానుకోండి.

– అర్నేసా బులిజుస్కిక్ కుస్తూరా
పరిశోధకురాలు

సీతాకోకల్లా...



సీతాకోకచిలుక జీవితకాలం కేవలం కొన్ని రోజుల నుంచి వారమే ఉంటుంది. అయినప్పటికీ ఎంత సంతోషంగా ఎగురుతుంది! అది అందరికీ ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ పంచుతుంది. మన జీవితాలు కూడా అలా ఉండాలి.

– మాతా అమృతానందమయి
ఆధ్యాత్మిక గురువు

ఇదీ అప్పు



పెరుగుతున్న ఇండియా రుణాల వల్ల, మీరు అత్యధిక పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. 2014: 54 లక్షల కోట్లు. 2023: 205 లక్షల కోట్లు. ఈ గణాంకాల మీద జనాలు రాజకీయం చేస్తున్నారు. కానీ ఇవి తెలుసుకోవాల్సిన కీలక వాస్తవాలు.

– అక్షత్ శ్రీవాస్తవ, ఆర్థిక నిపుణులు

ఇంకా చేయలేదా?



ఇంకా కొంత మంది ఎంపీలను గనక బహిష్కరించివుంటే, మన వెలుగులు జిమ్మే నూతన పార్లమెంట్ ఇక అచ్చమైన భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలా ఉండేది.

– రమేశ్ శ్రీవత్స్, కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

శత వసంతాల విద్యాకుసుమం

సికింద్రాబాద్‌లో బేగంపేట్ మీదుగా వెళ్తుంటే ఓ పెద్ద ప్రహరీ గోడపై 'ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట్, 1923లో నెలకొల్పబడినది' అని పెద్ద అక్షరాలు కన్పిస్తాయి. లోపల విశాలమైన మైదానాల్లో నిజాం కాలం నాటి తెలుపు రంగులో తళతళ మెరిసే భవంతుల సముదాయం కన్పిస్తుంది. ఈ సంవత్సరం ఈ బడికి వందేళ్లు పూర్తయ్యాయి. గొప్ప వారి పిల్లల కోసం ఏడవ నిజాం 1923లో 'జాగీర్దార్స్ కాలేజీ' పేరిట దీనిని ప్రారంభించారు. దీని కోసం ఒక బేగం 88 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చింది. మిగతా స్థలం కోసం జాగీర్దార్లు విరాళాలు ఇచ్చారు. నవాబులు, జాగీర్దారుల పిల్లలు, ఇంకా నగరంలోని ధనవంతుల పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా దీనిని ఏర్పాటు చేశారు. జాగీర్దారుల వార్షిక ఆదాయంలో 2 శాతం సొమ్మును వసూలు చేసి స్కూల్ భవనాల నిర్మాణాలు చేపట్టారు. అందువల్ల వారి పిల్లలకు విద్య ఉచితంగా లభించేది. ఆరంభంలో ఐదుగురు విద్యార్థులు, ఆరుగురు టీచర్లతో కేంబ్రిడ్జ్ తరహాలో పాఠాలు మొదలు పెట్టారు. 1930 నాటికి విద్యార్థుల సంఖ్య 150కి పెరిగింది. 1950లో జాగీర్దారీ విధానాన్ని రద్దు చేయడంతో ఆ కాలేజీకి 1951లో 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్' అని పేరు మార్చారు.

ఏడవ నిజాంకు తన స్టేట్‌లో లండన్‌లోని ఇంగ్లీష్ స్కూల్ స్థాయిలో ఒక పాఠశాలను కులీనుల పిల్లల కోసం ఏర్పాటు చేయాలనుకున్నాడు. తన వద్ద పనిచేసే ఓ ఆంగ్ల అధికారితో తన ఆలోచన పంచుకోగా ఆయన లండన్‌లోని 'ఈటన్ రెసిడెన్షియల్ స్కూల్' మాదిరి గురుకుల విద్యాలయం బాగుంటుందని చెప్పాడు. అలా ఆ ఆలోచన నిర్మాణ రూపానికి వచ్చింది.

ఈ స్కూల్లో చదివి ఉన్నత పదవుల్లో ఉన్నవారే ఈ స్కూల్ ఘనతకు నిదర్శనంగా నిలుస్తారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, ప్రోక్టర్ అండ్ గాంబ్లే సి ఓఓ శైలేష్ జేజురికార్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ పాల్ సింగ్ బంగా, ఎయిర్ మార్షల్ జె చలపతి, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, విప్రో వైస్ చైర్మన్‌గా పనిచేసిన టీకే కురియన్, క్రికెట్ కామెంటేటర్ హర్ష భోగ్లే.. ఇంకా కొందరు రాజకీయ నాయకులు, సినీనటులు ఈ స్కూల్‌లో చదువుకున్నారు. ఇదే స్కూల్‌లో 1986 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ విద్యార్థిగా ఉన్నప్పుడే 18 ఏళ్ల లోపు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. తన స్కూల్ అనుభవాలని చెబుతూ సత్య నాదెళ్ల తమ స్కూల్‌లో పాడుకొనే 'తు షహీన్ హై' అనే ఇక్బాల్ గీతం ఇప్పటికి స్ఫూర్తినిస్తోంది అన్నారు. ఖరీదైన విద్యాలయమైనా హైదరాబాద్ కీర్తి కిరీటంలో ఈ స్కూల్ ఓ రత్నంలా భాసిల్లుతోంది.

– బి. నర్సన్
తెలంగాణ బ్యాంకు విశ్రాంత అధికారి | 94401 28169

రైతుకు భరోసానిచ్చే సంక్షేమ కేంద్రాలు

సందర్భం



డా॥ శామ్యూల్ జాన్ ఆదూరి

అన్ని దేశాల్లోని అన్ని జీవన రంగాలను ప్రభావితం చేసినట్లే మన దేశపు వ్యవసాయ రంగాన్ని కూడా ప్రపంచీకరణ ప్రభావితం చేసింది. బహుళజాతి కంపెనీల ప్రవేశం, స్వేచ్ఛావాణిజ్యం, ఉపాధి అవకాశాల పెరుగుదల, నగదు ప్రవాహం వల్ల గ్రామీణ జీవనశైలిలో వచ్చిన మార్పులు వ్యవసాయ అంతర్నిర్మిత అంశాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, పెరుగుతున్న అక్షరాస్యత, రైతులెవరూ తమ పిల్లల్ని వ్యవసాయం వైపు ప్రోత్సాహించకపోవటం వల్ల... వ్యవసాయ భూముల్లో పనిచేసే కూలీల లభ్యత ఇబ్బందిగా మారింది. పెరుగుతున్న ఇంధన ధరలు, సకాలంలో రైతులకు అందుబాటులో ఉండని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సమాచారం, సలహాలు– వెరసి వ్యవసాయం లాభసాటి కాకపోగా కనీసం గిట్టుబాటు కూడా కానీ సందర్భంలో మధ్యతరగతి రైతులు కూడా తమ పొలాల్ని కౌలుకు ఇస్తున్న పరిస్థితి! ఇలాంటి సంకట స్థితిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం, రైతు సమీకృత సంక్షేమం కోసం 'రైతు భరోసా కేంద్రా'(ఆర్‌బీకే)లను ప్రవేశపెట్టింది.

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సమీకృత సంక్షేమం కోసం, వ్యవసాయాన్ని బలోపేతం చేయటం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయిక ఆదాయం మూల స్తంభంలా మార్చటానికీ, వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాలైన నాణ్యమైన, వ్యవసాయ ఉత్పాదకాలు, సేవలు, సలహాలు, పథకాలు, శిక్షణలు, ఒకే చోట లభ్యమయ్యేలా... గ్రామ సచివాలయాలకు అనుబంధంగా, గ్రామం యూనిట్‌గా ప్రారంభించినవే ఆర్‌బీకేలు.

'విత్తనం నుండి విక్రయం వరకు' అనే నినాదం కలిగిన ఈ కేంద్రాలు అందించే సేవలు అమూల్యం. వీటి సేవలు మొదటిగా విత్తనంతో మొదలవుతాయి. రైతులను కల్తీ విత్తనాల బెడద నుండి తప్పించటానికీ, విత్తనాలు రైతు చేతికి రాకముందే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల్లో కలిపి 200 ఉన్న డాక్టర్ 'వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్' లలో విత్తన పరీక్షలూ, అంకురోత్పత్తి సామర్థ్య (జర్మినేషన్) పరీక్షలూ పూర్తి చేసుకుని సీల్ వేయబడిన ధృవీకృత విత్తన సంచులు రైతులకు అందుబాటులో ఉంటాయి. కేవలం వరి, పత్తి, మిరప లాంటి విత్తనాలే కాకుండా సేంద్రియ ఎరువులా ఉపయోగపడే, అత్యంత డిమాండ్ ఉండే పచ్చిరొట్ట (గ్రీన్ మెన్యూర్) విత్తనాలు అవసరమైనన్ని రైతులకు అందుబాటులో ఉంటున్నాయి. ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో నీటి పరీక్షలు, భూసార పరీక్షలతో పాటు ఎరువుల పరీక్షలు కూడా రైతులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి.



రైతు భరోసా కేంద్రాలు అందించే మరో అతి ముఖ్యమైన సేవ, 'ఈ– క్రాప్ బుకింగ్'. ఇది పంటకు ఆధార్ కార్డ్ లాంటిది. దీంట్లో రైతు పేరు, భూమి విస్తీర్ణం, భూమి సర్వే నంబర్‌తో పాటు సాగు చేస్తున్న పంట పొలంలో నిలబడిన రైతు ఫొటోతో సహా, రైతు భరోసా కేంద్ర ఉద్యోగితో నమోదు చేయబడే ఈ వివరాలు ఒక పంట సీజన్ వరకు చెల్లుబాటు అవుతాయి. ఈ నమోదు వివరాలు ఉచిత పంట బీమా పథకాని (ఫ్రీ-క్రాప్ ఇన్సురెన్స్)కి, ఆటోమేటిక్‌గా అనుసంధానం చేయబడ్తాయి. అన్ని రకాల సబ్సిడీలకూ, మద్దతు ధరకూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంటనష్ట పరిహారానికీ ఈ నమోదు మాత్రమే ప్రామాణికం.

ఆర్‌బీకేలు అందించే మరొక సేవ వ్యవసాయ యాంత్రీకరణ (ఫార్మ్ మెకనైజేషన్). వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రవేశ పెట్టటం దీని ముఖ్య ఉద్దేశ్యం. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య అయిన వ్యవసాయ కూలీల కొరతను అధిగమించటానికి చేస్తున్న ప్రయత్నం ఇది. ఇందులో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, స్ప్రింకర్లు, ఇతర పనిముట్లు సబ్సిడీల ద్వారా అందచేసి సాగుఖర్చును పరిమితం చేయటం, తక్కువ పెట్టుబడికి ఎక్కువ దిగుబడి దీని ఉద్దేశ్యం. వ్యవసాయానికి సంబంధించిన రైతుల సందేహాలను నివృత్తి చేసు కోటానికి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్, టోల్ ఫ్రీ నంబర్ – 155251 లను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుతారు.

చివరిగా ఉత్పత్తుల విక్రయానికి సంబంధించిన సేవలు కూడ ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు కాబడిన రైతులు తమకు ఇష్టమైతే తమ ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాలలో కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా అమ్ముకోవచ్చు. అంతే కాకుండా ప్రైవేటు వ్యాపారులు అసలు కొనుగోలు చెయ్యని రంగు మారిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని కూడ ఇక్కడ కొన్ని పరిమితులతో అమ్ముకోవచ్చు. అమ్ముకున్న 21 పని దినాలలో వాళ్ళకు నగదు అందచేయబడుతుంది.

రైతు భరోసా కేంద్రాలు అందిస్తున్న సేవలు సమగ్రంగా, వినూత్నంగా, అవసరార్థంగా ఉండటంతో దాదాపుగా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలే కాకుండా, ఇథియోపియా దేశం కూడా, ఈ రైతు భరోసా కేంద్రాలను తమ దగ్గర ఏర్పాటు చేసే నిమిత్తం, అధ్యయనం చేయటానికి ఉన్నతస్థాయి అధికారుల బృందాలను ఏపీకి పంపాయి. రైతులు వీటి సేవలు సక్రమంగా ఉపయోగించుకోగలిగితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆశించిన ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించటానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు.

వ్యాసకర్త ఆంధ్రా యూనివర్సిటీ సోషియాలజీ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ | 83175 63725
(నేడు జాతీయ రైతు దినోత్సవం)

దైవ లీల

భగవంతుడు గతం, వర్తమానం తెలుసుకోవడానికి వీలు కల్పించాడు కానీ భవిష్యత్తులో ఏం జరగబోతుందో తెలియకుండా చేసి పెద్ద మెలిక పెట్టాడు. అందువల్లే మానవ జీవితాల్లో పలు మలుపులు చోటుచేసుకుంటూ ఉంటాయి. అనుకోనివి, ఊహకందనివి జరుగుతుంటాయి. వాటి వల్ల కలిగే మంచి లేదా చెడు అనేదంతా వారి వారి ప్రారబ్ధం మీద ఆధారపడి ఉంటుంది అంటారు.



ఓ భక్తుడు దేవేంద్రుడిని స్తుతిస్తూ నడుస్తున్నాడు. ఇంద్రుడు ఎదురుపడి 'ఏం కావాలి' అని అడిగాడు. 'నాకు కొద్దిగా అమృతం కావా'లని కోరాడు భక్తుడు. వెంటనే ఇంద్రుడు మూతపెట్టిన ఓ చిన్న అమృత పాత్ర సృష్టించి ఇచ్చాడు. 'జాగ్రత్తగా ఇంటికి తీసుకుపో. ఎవరికీ తెలీకుండా రహస్యంగా అమృతాన్ని సేవించు. నీకిక ఏ వ్యాధీ రాదు. మరణమూ రాదు. కానీ ఒక నిబంధన. ఇంటికి పోతున్నప్పుడు ఈ పాత్రను ఎక్కడా కింద ఉంచకూడద'న్నాడు. సరేనని భక్తుడు ఇంటికి బయలుదేరాడు. సరిగ్గా అదే సమయంలో కడుపు నొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకోదలచిన వ్యక్తి ఎదురయ్యాడు. ఇంతలో భక్తునికి మూత్ర విసర్జన అవసరం వచ్చింది. దీంతో తన దగ్గర ఉన్న అమృత పాత్ర అతడికి ఇచ్చి 'దీనిలో విషం ఉంది. కింద పెట్టకుండా జాగ్రత్తగా పట్టుకో' అని చెప్పి, చెట్టు చాటుకు వెళ్లాడు. వెంటనే అమృత పాత్ర తీసుకున్న వ్యక్తి... అమృతాన్ని విషంగా భావించి ఆత్మహత్య చేసుకోవడానికి తాగాడు. కడుపు నొప్పి నుంచి వెంటనే విముక్తి పొందాడు. భక్తుడు భవిష్యత్తుని తెలుసుకోగలిగితే ఇలా జరిగేదేనా? అదే భగవంతుడి లీల!

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.ఏకాదశి ఉ.7.56 వరకు, తదుపరి ద్వాదశి తె.6.21 వరకు (తెల్లవారితే ఆదివారం), నక్షత్రం: భరణి రా.10.16 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: ఉ.8.23 నుండి 9.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.29 నుండి 7.58 వరకు, అమృతఘడియలు: సా.5.39 నుండి 7.12 వరకు, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి, గీతా జయంతి; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.30, సూర్యాస్తమయం: 5.27.

లైఫ్@360



అస్త్మా

దమ్ముందా? ఇలా చేసి చూడండి!

చలికాలంలో చర్మసమస్యలు, జుట్టు రాలిపోవడం వంటివి ఎంత సాధారణమో, ఆస్త్మారోగులకు ఆయాసం ఎక్కువ కావడం, ఆర్థ్రైటిస్ అంటే కీళ్ల జబ్బులు ఉన్నవారికి కీళ్లనొప్పులు పెరగడం అంతే సహజం. గతవారం మనం కీళ్లజబ్బులకు పరిష్కార మార్గాలు తెలుసుకున్నాం కాబట్టి ఈవారం ఆస్త్మా రోగులు ఏం చేయాలి, ఏం చేయకూడదు... వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

దగ్గు, బ్రాంకైటిస్, ఉబ్బసం, న్యుమోనియా మొదలైనవన్నీ శ్వాసవాళాలకి, ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధులే. ఆస్తమా లేదా ఉబ్బసం అనేది ఒక దీర్ఘకాలిక శ్వాసకోశ సంబంధ వ్యాధి. దీనికి వయసుతో నిమిత్తం లేదు. చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా ఎవరికైనా రావచ్చు. సరిపడని తత్వం అంటే ఎలర్జీ, దుమ్ము, ధూళి, పొగ, ధూమపానం, ఘాటైన వాసనలు, కాలుష్య వ్యర్థాలు, చలి వాతావరణం సరిపడకపోవటం వంటివి. ముందుగా శీతాకాలంలో ఆస్త్మా రోగులు ఎలా ఉండాలో చూద్దాం.

- శరీర తత్వాన్ని అనుసరించి ఏ పదార్థం తీసుకుంటే ఉబ్బసం వస్తుందో, ఆ పదార్థం లేదా పదార్థాలను పూర్తిగా మానివేయాలి.
- నిల్వ ఉన్న పదార్థాలకు ఉబ్బసం వ్యాధిగ్రస్తులు దూరంగా ఉండాలి.
- మంచినీరు ఎక్కువగా తాగాలి. ఉబ్బసం ప్రకోపించినప్పుడు, మరింతగా ఎక్కువ నీరు తాగాలి.
- రోగ నిరోధకశక్తిని పెంచేది విటమిన్–సి. అందువలన విటమిన్ 'సి' పుష్కలంగా ఉండే పండ్లు, కూరలు అవసరం. ఆ క్రమంలో ప్రతిరోజు కనీసం ఒక సిట్రస్ పండు అయినా తప్పనిసరిగా తినాలి.
- మాంసాహారులయితే ఒమేగా–3 ఫాటీ యాసిడ్స్‌తో కూడిన చేపలను, కోడిమాంసాన్ని తీసుకోవచ్చు. శ్వాసనాళాలలోని జిగురు పొర పల్చబడకుండా ఉండటానికి కోడి మాంసం దోహదం చేస్తుంది.
- ఉబ్బసానికి వాడే అల్లోపతి మందులు చాలావరకు స్టెరాయిడ్ మందులు. వీటి వలన మంచితోబాటు కీడు కూడా జరుగుతుంది.
- ఉదయం పూట వేప నూనె ముక్కులో రెండు చుక్కలు వేసుకోవాలి. రాత్రి నిద్రించే ముందు ఆవు నెయ్యి గోరువెచ్చగా చేసి ముక్కులో వేసుకోవాలి.
- రాత్రి పడుకొనే ముందు ఆవాల నూనె ఛాతీ మీద, గొంతుకు రాయాలి.
- ఆస్తమాతో బాధపడుతున్న వారు చికిత్సకు ప్రాధాన్యం ఇస్తున్నట్టే.. ఆహారపరమైన మార్పులు చేసుకోవడం కూడా అవసరం అవుతుంది. కొన్ని రకాల ఆహార పదార్థాల విషయంలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా స్పందించినప్పుడు అది ఆహార పరమైన అలర్జీలకు దారితీస్తుంది. ఇది కొంతమందిలో ఆస్తమాకు దారితీయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

వీటిని దూరం పెట్టాలి..

- పులిసిన పదార్థాలు
- పొగ తాగటం
- మత్తుపానీయాలను సేవించటం
- మసాలా దినుసులు
- తీపి పదార్థాలు
- కడుపునిండా తినడం

కొన్ని ఆహార పదార్థాలు ఆస్తమాకు కారణం కాకపోయినా, ఆస్తమా లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. కనుక వాటికి దూరంగా ఉండడం అవసరం. సల్ఫైట్స్ అనే ప్రిజర్వేటివ్ ఆస్తమా లక్షణాలను పెంచుతుంది. ప్యాకేజ్డ్ పచ్చళ్లు, ప్యాకేజ్డ్ లెమన్ జ్యూస్, డ్రై ఫ్రూట్స్ పై సల్ఫైట్స్ ఉంటాయి. కాఫీ, టీ, కొన్ని రకాల సుగంధ, మసాల దినుసుల్లోని శాలిసిలేట్స్ కూడా ఉబ్బసాన్ని పెంచుతాయి. ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో వాడే ప్రిజర్వేటివ్‌లు, ఆర్టిఫీషియల్ కలర్స్, ఫ్లావర్స్ తోనూ సమస్య పెరుగుతుంది.

విటమిన్ డి

ఆస్తమా నుంచి రక్షణనిచ్చే వాటిలో విటమిన్ డి ది కీలక పాత్ర. ముఖ్యంగా 6 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు పిల్లలకు డి విటమిన్ లోపం లేకుండా చూసుకోవాలి. గుడ్లు, చేపలు, పాలు రూపంలో విటమిన్ డి అందుతుంది. పాలు, గుడ్లు కొందరిలో అలర్జీకి కారణమవుతాయి. పడని వారు వీటిని తీసుకోకూడదు.

విటమిన్ ఎ

శరీరంలో విటమిన్ ఎ తగినంత ఉన్న పిల్లలకు ఆస్తమా సమస్య తక్కువగా ఉంటున్నట్టు పలు అధ్యయనాలు గుర్తించాయి. పిల్లలలో విటమిన్ ఎ అధికంగా ఉంటే వారి ఊపిరితిత్తుల పనితీరు మెరుగ్గా ఉంటుందట. క్యారట్, బ్రకోలీ, ఆలుగడ్డ, పాలకూర తదితర వాటిల్లో విటమిన్ ఎ ఎక్కువగా లభిస్తుంది.

పండ్లు

రోజూ ఒక యాపిల్ తీసుకుంటే ఆస్తమా రిస్క్ తగ్గుతుంది. ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. అరటిపండులో ఉండే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఆస్తమా నివారణకు ఉపయోగపడతాయి.

మెగ్నీషియం

మెగ్నీషియం తక్కువగా ఉంటే శ్వాసకోశ వ్యవస్థ పనితీరు కూడా తగ్గుతుందని వైద్యులు అంటున్నారు. కనుక గుమ్మడి గింజలు, చేపలు, డార్క్ చాక్లెట్, పాలకూర తదితర మెగ్నీషియం తగినంత లభించే వాటిని తీసుకోవాలి.

చలికాలంలో ఈ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఉపశమనం.



ఇవి తీసుకోండి.. రక్తహీనత రాదు!

మన శరీరంలో పోషకాలు, ఆక్సిజన్ ప్రతి కణానికి సరిగ్గా అందడం లో రక్తం పాత్ర ముఖ్యమైనది. సరైన ఆరోగ్యం కోసం తగినంత రక్తం శరీరంలో ఉండాల్సిన అవసరం ఉంది. శరీరంలో రక్తం లోపించిన పరిస్థితిని అనీమియా అంటారు. రక్తం సరిగ్గా ఉండటానికి సరైన ఆహారాలు తినటం ఎంత ముఖ్యమో ప్రాసెస్డ్ ఆహారాలు, కృత్రిమ షుగర్స్ గల ఆహారాలు తగ్గించడం కూడా అంతే ముఖ్యం.

- ఐరన్ అనేది ఎర్ర రక్త కణాలలోని హిమోగ్లోబిన్‌లో కనిపించే ఒక ఖనిజం. హిమోగ్లోబిన్ ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని భాగాలకు చేరవేస్తుంది. శరీరంలో ఐరన్ లోపం ఉన్నప్పుడు, ఎర్ర రక్త కణాలు సరిగా ఉత్పత్తి కావు, గుడ్లు, మాంసం, చేపలు, టోఫు, పప్పులు, చిక్కుళ్ళు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల ఐరన్ లోపం తలెత్తకుండా ఉంటుంది.
- విటమిన్ బి 12 అనేది ఒక విటమిన్, ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం. విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు, ఎర్ర రక్తకణాలు సరిగా పనిచేయలేవు.
- అందువల్ల ఆహారంలెక విటమిన్–బి 12 లభించే మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, గుడ్లు తీసుకోవాలి.
- ఫోలిక్ యాసిడ్ అనేది ఒక విటమిన్, ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా అవసరం. ఫోలిక్ యాసిడ్ లోపం ఉన్నప్పుడు, ఎర్ర రక్త కణాలు సరిగా పెరగలేవు, అందువల్ల ఫోలిక్ యాసిడ్ ఉండే గుడ్లు, మాంసం, చేపలు, ఆకుకూరలు, బీన్స్, చిక్కుళ్ళు తీసుకోవాలి.
- ప్రోటీన్లు అనేవి శరీరం నిర్మాణాత్మక భాగాలు. ప్రోటీన్లు ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా అవసరం.
- ప్రోటీన్ల–మూలం మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, పప్పులు, చిక్కుళ్ళు, ధాన్యాలు, ఆకుకూరలు, తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది, ఈ ఐరన్ మన రక్తం లోని హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో ముఖ్యమైనది. ఆకు కూరల్లాంటి ఐరన్ రిచ్ ఫుడ్స్ తినడం వల్ల రక్తం పెరిగి అనీమియా వంటి సమస్య రాకుండా ఉంటుంది.

చిక్కుళ్ళు, పప్పు దినుసులు

చిక్కుళ్ళు, పప్పు దినుసుల్లో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇందులో ఉన్న ప్లాంట్ బేస్డ్ ఐరన్ రక్త వృద్ధికి సహాయపడాలంటే వీటితో పాటు విటమిన్ సి అధికంగా ఉన్న ఫుడ్స్ కూడా తీసుకోవాలి. అలాగే వీటిలో ఫోలియేట్, విటమిన్ బి 6 కూడా ఉండటం వల్ల రక్తం తయారవ్వటానికి ఇవి బాగా దోహదం చేస్తాయి.

నట్స్, సీడ్స్

బాదం, గుమ్మడి గింజలు, సన్‌ఫ్లవర్ గింజలు వంటి నట్స్, సీడ్స్ లో ఫోలియేట్, ఐరన్, విటమిన్ ఇ ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్ ఇ ఎర్ర రక్తకణాలు నష్టపోకుండా కాపాడుతుంది.

బీట్ రూట్

బీట్ రూట్స్ లో ఐరన్, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. అందుకని మన శరీరం లో బ్లడ్ లెవల్స్ పెరగడానికి ఇది సహాయపడుతుంది. అలాగే ఈ బీట్‌రూట్స్‌లో ఉండే నైట్రేట్స్ రక్త ప్రసరణ సవ్యంగా జరగడానికి అలాగే రక్తంలో ఆక్సిజన్ సరిగ్గా ఉండటానికి సహాయపడతాయి.

సిట్రస్ పండ్లు

నారింజ పళ్ళు, ద్రాక్ష, నిమ్మకాయలు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి అనేది మన శరీరంలో రక్తం పెరగడానికి అవసరం అయ్యే ఐరన్ గ్రహించడానికి సహాయపడుతుంది. అందుకనే ఐరన్ రిచ్ ఫుడ్స్ తో పాటు ఈ సిట్రస్ పండ్లు కూడా తీసుకోవటం మంచిది.

హెల్త్ టిప్స్

చిన్న సమస్యలకు ఇంటి చిట్కాలు



కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే వ్యర్థపదార్థాల నుంచి కాలేయానికి రక్షణ దొరుకుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

- తులసి ఆకులు, వ్యాధి నిరోధక శక్తిని వద్ధి చేయడమే కాదు, శ్వాసకోశ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఓ ఐదారు ఆకుల కషాయాన్ని మరగించి టీ మాదిరి చేసుకుని తాగితే, దగ్గు, జలుబు, ఆస్తమా అదుపులోకి వస్తాయి.
- పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.



- మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ బాగా సాయమవుతుంది.

ఒక కప్పు నీటిలో ఒక పూవు చొప్పున వేసి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



- అల్లం, జీర్ణశక్తిని పెంచడంతో పాటు కడుపులోని వికారాన్ని తగ్గిస్తుంది. అల్లం రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటే, ఆకలి పెరుగుతుంది.



- పడుకునే ముందు చెర్రీపండ్లు తిన్నా లేదా జ్యూస్ తాగినా.. అందులో ఉండే 'మెలటోనిన్' వల్ల చక్కగా నిద్ర పడుతుంది

మీకు తెలుసా?

సాధారణంగా కొందరు ఉదయం నిద్రలేచిన వెంటనే వేడి నీరు తాగుతారు. ఇది జీర్ణక్రియలో సహాయపడుతుంది. అయితే వేడినీటిలో నెయ్యి కలుపుకుని తాగడం వల్ల జీర్ణ వ్యవస్థకు మరింత మేలు జరుగుతుంది.



- ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. నెయ్యిలో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు చాలా మేలు చేస్తాయి. ఇది కాకుండా, కేలరీలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు ఎ, ఇ మొదలైనవి నెయ్యిలో లభిస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది.
- చర్మ సంబంధిత సమస్యల నుంచి బయటపడవచ్చు. చర్మం ఆరోగ్యంగా... ప్రకాశవంతంగా మారుతుంది. కొవ్వు కరిగిపోతుంది. ఎముకలు దృఢంగా తయారవుతాయి. ఇది వెచ్చని నీటితో లేదా ఆహారంతో ఉదయాన్నే ఖాళీ కడుపుతో తీసుకోవచ్చు.
- ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతోపాటు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి.



సినిమా

ఆడా లేరు... ఈడా లేరు...

ఈ ఏడాది కొంతమంది కథానాయికలను తెలుగు తెర మిస్సయింది. ఆ మాటకొస్తే తెలుగులో మాత్రమే కాదు.. ఏ భాష తెరపైనా ఈ తారలు కనిపించలేదు. ఆడా లేరు.. ఈడా లేరు అన్నట్లు ఎక్కడా కనిపించకుండా ఆ నాయికలు ఏం చేస్తున్నారో చూద్దాం.

2023 రౌండప్

'లవ్ స్టోరీ (2021)', 'శ్యామ్ సింగ రాయ్ (2021)', 'విరాటపర్వం (2022)' సినిమాలతో రెండేళ్లుగా తెలుగు తెరపై సందడి చేసిన సాయి పల్లవి ఈ ఏడాది మాత్రం సిల్వర్ స్క్రీన్‌కి దూరమయ్యారు. చెప్పాలంటే 2023లో నటిగా సాయిపల్లవి పూర్తిగా బ్రేక్ తీసుకున్నట్లే. ఎందుకంటే ఆమె హీరోయిన్‌గా చేసిన సినిమాలేవీ తెలుగులోనే కాదు... ఇతర భాషల్లో కూడా విడుదల కాలేదు. 2022లో తమిళంలో చేసిన 'గార్గి' చిత్రం తర్వాత సాయి పల్లవి నటించిన మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రాలేదు. ప్రస్తుతం నాగచైతన్యతో 'తండేల్', శివ కార్తికేయన్‌తో ఒక చిత్రం... సాయి పల్లవి కమిట్ అయిన సినిమాలు ఇవే. 'తండేల్' షూటింగ్ జరుగుతోంది. శివ కార్తికేయన్‌తో చేస్తున్న సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. సో.. వచ్చే ఏడాది డబుల్ ధమాకాలా సాయి పల్లవి ఈ రెండు చిత్రాలతో థియేటర్స్‌లో సందడి చేస్తారు.

★★★

హీరోయిన్‌గా 'కార్తికేయ 2', '18 పేజెస్', 'అంటే.. సుందరానికీ' సినిమాలో ఓ అతిథి పాత్ర, 'బటర్ ఫ్లై'తో డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ ఇలా.. 2022లో అనుపమా పరమేశ్వరన్ ఫుల్ ఫామ్‌లో కనిపించారు. కానీ ఈ ఏడాది వెండితెరపై సందడి చేయలేదు. తెలుగులో అనుపమ చేస్తున్న 'డీజే టిల్లు' సీక్వెల్ 'డీజే టిల్లు స్క్వేర్' చిత్రం ఈ ఏడాది విడుదలకు ముస్తాబైనా కొన్ని కారణాల వల్ల వచ్చే ఏడాది ఫిబ్రవరి 9కి వాయిదా పడింది. దాంతో ఈ ఏడాది ఆమె కనిపించలేదు. ప్రస్తుతం అనుపమ చేతిలో రవితేజ 'ఈగల్', తెలుగులో ఓ లేడీ ఓరియంటెడ్ మూవీ ఉన్నాయి. ఇతర భాషల్లో మరో రెండు సినిమాలు ఉన్నాయి. జనవరిలో 'ఈగల్', ఫిబ్రవరిలో 'డీజే టిల్లు స్క్వేర్' విడుదలవుతాయి. చూస్తుంటే.. 2024లో అనుపమా పరమేశ్వరన్ ముచ్చటగా మూడు సార్లయినా వెండితెరపై మెరిసే అవకాశం ఉంది.

★★★

గత ఏడాది రెండు తెలుగు సినిమాలు (పక్కా కమర్షియల్, థ్యాంక్యూ), రెండు తమిళ సినిమాలు (తిరుచిత్రంబలం, సర్దార్)లతో కెరీర్‌లో దూకుడు పెంచినట్లుగా కనిపించారు రాశీ ఖన్నా. కానీ ఆ స్పీడ్‌కు ఈ ఏడాది స్పీడ్ బ్రేకర్ పడింది. రాశీ ఖన్నా సైన్ చేసిన హిందీ చిత్రం 'యోధ' రిలీజ్ వచ్చే ఏడాదికి వాయిదా పడింది. అలాగే తెలుగులో శర్వానంద్‌తో రాశీ ఖన్నా కమిట్ అయిన సినిమా ప్రస్తుతానికి హోల్డ్‌లో ఉంది. ఇలా రాశీ ఖన్నా వెండితెరపై మెరవలేక పోయారు. అయితేనేం.. తమిళంలో రాశీ ఖన్నా ఓ హీరోయిన్‌గా నటించిన 'అరణ్మణై 4', హిందీ 'యోధ' రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. మరో రెండు ప్రాజెక్ట్స్ కూడా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ స్టేజ్‌లో ఉన్నాయి. సో.. వచ్చే ఏడాది రాశీ ఖన్నా జోరు మళ్లీ కనిపిస్తుంది.

అన్నట్లు మరో మాట.. తెలుగులో 'తెలుసు కదా' అనే సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ ఓ హీరోగా, 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధీ శెట్టి మరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయం కానున్నారు. ఇక గత ఏడాది 'కేజీఎఫ్ 2' వంటి బ్లాక్ బస్టర్, తమిళంలో 'కోబ్రా' చిత్రంతో తెరపై కనిపించిన శ్రీనిధీ శెట్టి ఈ ఏడాది కనిపించలేదు.

★★★

తెలుగులో 'హీరో', తమిళంలో 'కలగ తలైవన్' సినిమాలతో గత ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై మెరిశారు నిధీ అగర్వాల్. కానీ ఈ ఏడాది మాత్రం స్లో అయ్యారు. ఈ ఏడాది ఆమె హీరోయిన్‌గా నటించిన ఏ చిత్రం ఏ భాషలో కూడా వెండి తెరపైకి రాలేదు. నిధి నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం షూటింగ్ దశలో ఉంది.

★★★

నాని 'గ్యాంగ్‌లీడర్', శర్వానంద్ 'శ్రీకారం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ ప్రియాంకా అరుళ్ మోహన్ సుపరిచితురాలే. గత ఏడాది 'ఈటీ', 'డాన్' వంటి తమిళ చిత్రాలతో వెండితెరపై మెరిశారామె. అయితే ఈ యంగ్ బ్యూటీ కూడా ఈ ఏడాది వెండి తెరపై కనిపించలేదు. ప్రియాంక హీరోయిన్‌గా నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ ఏడాది రిలీజ్‌కు షెడ్యూలై, ఆ తర్వాత సంక్రాంతికి షిఫ్ట్ అయ్యింది. అలా ఈ ఏడాదిని మిస్ అయ్యారు ప్రియాంక. ప్రస్తుతం తెలుగులో 'సరిపోదా శనివారం', 'ఓజీ', తమిళంలో 'బ్రదర్' చిత్రాలు చేస్తున్నారు ప్రియాంకా అరుళ్ మోహన్.



● సాయి పల్లవి



● అనుపమా పరమేశ్వరన్



● రాశీ ఖన్నా



● శ్రీనిధీ శెట్టి



● నిధీ అగర్వాల్




● ప్రియాంక

ఆస్కార్ రేసు నుంచి 2018 చిత్రం అవుట్

● పది విభాగాల్లో షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించిన అకాడమీ


భారతీయ సినీ ప్రేమికులకు నిరాశ ఎదురైంది. 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీకి భారతదేశం తరఫున అధికారిక ఎంట్రీగా వెళ్లిన మలయాళ సినిమా '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' ఆస్కార్ షార్ట్‌లిస్ట్ జాబితాలో చోటు దక్కించుకోలేక పోయింది. 96వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 10న లాస్ ఏంజెల్స్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకకు సంబంధించిన కార్యక్రమాలను వేగవంతం చేశారు అకాడమీ నిర్వాహకులు. ఇందులో భాగంగా.. డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్, ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్, మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్, ఒరిజినల్ స్కోర్ మ్యూజిక్, ఒరిజినల్ సాంగ్ మ్యూజిక్, యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్, లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్, సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్.. ఇలా మొత్తం పది విభాగాల్లో ఆస్కార్‌కు నామినేషన్ బరిలో ఉన్న షార్ట్ లిస్ట్‌ను ప్రకటించారు మేకర్స్. హాలీవుడ్ చిత్రాలు 'బార్బీ, ఓపెన్ హైమర్'ల హవా ఈ షార్ట్‌లిస్ట్ జాబితాలో కనిపించింది. ఇక ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్ కోసం 88 దేశాల చిత్రాలు పోటీ పడగా, 15 చిత్రాలు షార్ట్‌లిస్ట్ అయ్యాయి. ఈ లిస్ట్‌లో మలయాళ '2018' సినిమాకు చోటు దక్కలేదు. కాగా ఇండో–కెనెడియన్ ఫిల్మ్‌మేకర్ నిషా పహుజా దర్శకత్వం వహించిన 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో షార్ట్ లిస్ట్ అయింది. ఇప్పటికే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో 'టు కిల్ ఏ టైగర్' అవార్డ్స్‌లతో సత్తా చాటింది. జార్ఖండ్‌లో గ్యాంగ్ రేప్‌కు గురైన తన కుమార్తెకు న్యాయం జరగాలని ఓ తండ్రి చేసే పోరాటం నేపథ్యంలో 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ కథనం ఉంటుంది. ఆస్కార్ నామినేషన్ కోసం పదిహేను డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్స్‌తో 'టు కిల్ ఏ టైగర్' పోటీ పడాల్సి ఉంది. ఇక అన్ని విభాగాల్లోని ఆస్కార్ నామినేషన్స్ జనవరి 23న వెల్లడి కానున్నాయి. ఇందుకోసం జనవరి 11 నుంచి జనవరి 16 వరకు ఓటింగ్ జరుగుతుంది.

ప్రస్తుతానికి ప్రకటించిన ఆస్కార్‌లోని పది విభాగాల షార్ట్ లిస్ట్ జాబితాలో ఒక్క ఇండియన్ చిత్రానికి కూడా చోటు లభించలేదు. ఇక '2018' విషయానికొస్తే కేరళలో 2018లో సంభవించిన వరదల ఆధారంగా ఈ సినిమాను జూడ్ ఆంటోనీ జోసెఫ్ డైరెక్ట్ చేశారు. టొవినో థామస్, కుంచాకో బోబన్, అపర్ణా బాలమురళి, అసిఫ్ అలీ, వినీత్, తన్వి రామ్, అజు వర్గీస్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈ ఏడాది మార్చిలో విడుదలై బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించింది. దాదాపు రూ. 150 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను ఈ చిత్రం వసూలు చేసింది.





ఆస్కార్ బరిలో నిలిచి నామినేషన్ దక్కించుకోలేకపోయిన నాలుగో మలయాళ చిత్రంగా '2018: ఎవ్రీ వన్ ఏ హీరో' చిత్రం నిలిచింది. గతంలో 70వ ఆస్కార్ అవార్డ్స్‌కు 'గురు (1997)', 83వ ఆస్కార్ అవార్డ్స్‌కు 'అదామింటే మకాన్ అబు (2011)', 93వ ఆస్కార్ అవార్డ్స్ కోసం 'జల్లికట్టు (2019)', 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' చిత్రాలను ఆస్కార్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగపు నామినేషన్ కోసం ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అకాడమీకి పంపింది.



● బార్బీ పోస్టర్

ప్రేమకు జై

అనిల్ బురగాని, ఆర్. జ్వలిత జంటగా నటించిన చిత్రం 'ప్రేమకు జై'. శ్రీనివాస్ మల్లం దర్శకత్వంలో అనసూర్య నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌ని ప్రముఖ పాటల రచయిత శివశక్తి దత్త విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. నూతన నటీనటులు చాలా బాగా నటించారనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో జరిగిన ఒక వాస్తవ ఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. హీరో హీరోయిన్లతో పాటు ప్రతినాయకుడు దుబ్బాక భాస్కర్ బాగా నటించారు. మా సినిమాని నూతన సంవత్సరంలో విడుదల చేయనున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఉరుకుందా రెడ్డి, సంగీతం: చైతు, లైన్ ప్రొడ్యూసర్: మైలారం రాజు.



● అనిల్, జ్వలిత

ఇష్క్ జైసా కుచ్..

హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా రూపొందిన చిత్రం 'ఫైటర్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మమతా ఆనంద్, రామన్ చిబ్, అంకు పాండే నిర్మించారు. ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా నుంచి 'ఇష్క్ జైసా కుచ్..' అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు. ''హృతిక్ రోషన్, దీపికా పదుకోన్‌ల మధ్య వచ్చే ఫుల్ రొమాంటిక్ సాంగ్ 'ఇష్క్ జైసా కుచ్..'. దీపిక, హృతిక్ డ్యాన్స్ అదరగొట్టారని ప్రేక్షకులు అంటారు. ఈ సినిమాలో హృతిక్ స్క్వాడ్రన్ లీడర్ షంషేర్ పఠానియాగా (పాటీ) కనిపించనుండగా, స్క్వాడ్రన్ లీడర్ మిన్నీగా (దీపికా) కనిపిస్తారు'' అని మేకర్స్ అన్నారు.



● హృతిక్ రోషన్

సాక్షి బిజినెస్
శనివారం
23-12-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
242	94
71,107	21,349

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 10.00 గంటలకు)

నాస్‌డాక్‌	15,012	▲	49
డోజోన్స్‌	37,455	▲	41
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,698	▲	3
డాక్స్‌	16,703	▲	16
షాంఘై	2,915	▼	4
నికాయ్‌	33,169	▲	29

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
62,844	▲	509
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,592	▲	506
వెండి (కేజీ)		
74,918	▲	368

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎసిఐ	82.85	83.87
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎసిఐ	104.49	107.06
€	యూరో	ఎసిఐ	90.53	92.90
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎసిఐ	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎసిఐ	55.55	57.53
S$	సింగపూర్‌ డాలర్‌	ఎసిఐ	62.02	63.51
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.74	23.53
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.55	12.62

జీఆర్‌టీ జ్యుయలర్స్‌ 'వజ్రో'త్సవ ఆఫర్‌



హైదరాబాద్‌: పండుగల సీజన్‌ను పురస్కరించుకుని ప్రముఖ జీఆర్‌టీ జ్యుయలర్స్‌ 'డాజిలింగ్‌ డైమండ్‌ క్యాంపెయిన్‌' (మిరుమిట్లు గొలిపే వజ్రాల ప్రచారోత్సవం) పేరుతో భారీ ఆఫర్లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం సంస్థ తన విస్తృతశ్రేణి డైమండ్స్‌, అన్‌కట్‌ డైమండ్స్‌ విక్రయాలపై (సారి టైర్‌ మినహా) 25% వరకూ మినహాయింపు లభిస్తుంది. ప్లాటినం జ్యుయలర్స్‌కు సంబంధించి మేకింగ్‌ చార్జీలు, వేస్టేజ్‌పై 30% వరకూ రిబేట్‌ లభిస్తుంది. ఎంఆర్‌పీ డైమండ్‌ నెక్లెస్‌ల శ్రేణిలో 10 శాతం డిస్కౌంట్‌ ఉంటుంది.

శ్రీ ధూతపాపేశ్వర్‌ నుంచి స్వామల ప్రొడక్ట్‌ కొత్త ప్యాక్‌



హైదరాబాద్‌: ఫార్మాస్యూటికల్స్‌, ఆయుర్వేదంలో అపార అనుభవం కలిగిన శ్రీ ధూతపాపేశ్వర్‌ లిమిటెడ్‌ తాజాగా సువర్ణ భస్మతో కూడిన బలవర్ధకమైన చ్యవన్‌ప్రాష్‌- స్వామల ప్రొడక్ట్‌ కొత్త ప్యాక్‌ను ఆవిష్కరించింది. స్వామల చ్యవనప్రాష్‌ ఆరోగ్య ప్రయోజనాలను సంరక్షించడంతోపాటు, తరచూ ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడే సువర్ణ భస్మ, రజత్‌ భస్మ, లోహ భస్మ వంటి ఇతర పదార్థాలను కలిగి ఉందని సంస్థ ఎండీ రంజిత్‌ పురాణిక్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా బజాజ్‌ పల్సర్‌ మేనియా నేషనల్‌ ఫినాలే



హైదరాబాద్‌: టూ వీలర్‌, త్రీ-వీలర్‌ ప్రముఖ కంపెనీ బజాజ్‌ ఆటో.. బజాజ్‌ పల్సర్‌ మేనియా నేషన్‌ ఫినాలే- మాస్టర్స్‌ ఎడిషన్‌ను ముంబైలో నిర్వహించింది. దాదాపు 100 నగరాల్లో పోటీ పడిన ఉత్సాహవంతమైన రైడర్లు- ఈ పోటీలో పాల్గొన్నారు. 100 నగరాల్లో జరిగిన కార్యక్రమాన్ని లక్షమందికిపైగా వీక్షిస్తే, ముంబైకి దాదాపు 25,000 మంది విచ్చేశారు. కార్యక్రమంలో 30 మంది 'అల్టిమేట్‌ పల్సర్‌ మేనియాక్‌' టైటిల్‌ కోసం పోటీ పడ్డారు. పోటీలో మొదటి, రెండు, మూడు స్థానాల్లో మహ్మద్‌ నూమాన్‌, జీత్‌ సింగ్‌, ఇనియవన్‌ రవిచంద్రన్‌ విజేతలుగా నిలిచారు.

ఫ్లిప్‌కార్ట్‌కు 600 మిలియన్‌ డాలర్లు

10 శాతం అధిక వేల్యుయేషన్‌తో సమకూరుస్తున్న వాల్‌మార్ట్‌



న్యూఢిల్లీ: దేశీ ఈ-కామర్స్‌ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌కు అమెరికన్‌ రిటైల్‌ దిగ్గజం 600 మిలియన్‌ డాలర్లు సమకూర్చనుంది. ఫ్లిప్‌కార్ట్‌ ప్రస్తుత వేల్యుయేషన్‌కు అదనంగా 5–10% లెక్కగట్టి వాల్‌మార్ట్‌ ఈ నిధులు అందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, తాజా నిధుల సమీకరణ తర్వాత కంపెనీ వేల్యుయేషన్‌ ఎంత స్థాయిలో ఉంటుందనేది వెల్లడి కాలేదు. ఇది 40 బిలియన్‌ డాలర్ల లోపే ఉంటుందని ఇతర వర్గాలు తెలిపాయి. ఫ్లిప్‌కార్ట్‌ చివరిసారి 37.6 బిలియన్‌ డాలర్ల విలువతో జీఐసీ, కెనడా పెన్షన్‌ ప్లాన్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ బోర్డ్‌, సాఫ్ట్‌బ్యాంక్‌ విజన్‌ ఫండ్‌ 2 తదితర సంస్థల నుంచి 3.6 బిలియన్‌ డాలర్లను సమీకరించింది.

ఐపీఓకి ఓలా... సెబీకి దరఖాస్తు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్‌ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్‌ పబ్లిక్‌ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్‌ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వెరసి రెండు దశాబ్దాల తదుపరి ఆటోరంగ కంపెనీ ఐపీవో ద్వారా స్టాక్‌ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌ కానుంది. కాగా.. ఇష్యూలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 9,51,91,195 షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ ఓసీటీ ఏర్పాటు చేస్తున్న ఓలా గిగాఫ్యాక్టరీ కోసం పెట్టుబడి వ్యయాలుగా వినియోగించనుంది.

జనరల్‌ అట్లాంటిక్‌ చేతికి ఆసుపత్రులు!

- అమర్‌ ఉజాలా నుంచి కొనుగోలుకి సై
- రూ. 1,600 కోట్ల సంస్థ విలువలో డీల్‌



ముంబై: గ్లోబల్‌ పీఈ దిగ్గజం జనరల్‌ అట్లాంటిక్‌(జీఏ) దేశీ ఆసుపత్రుల చైన్‌ను కొనుగోలు చేసే బాటలో సాగుతోంది. 19 ఆసుపత్రుల నెట్‌వర్క్‌ కలిగిన ఉజాలా సిగ్నస్‌ హెల్త్‌కేర్‌ సర్వీసెస్‌లో 70 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలుస్తోంది. సంస్థ విలువను రూ. 1,600 కోట్లుగా మదింపు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సంస్థలో తొలుత ప్రస్తుత ఇన్వెస్టర్ల నుంచి 51 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ప్రస్తుత వాటాదారులలో 8 రోడ్స్‌ వెంచర్స్‌ ఇండియా, ఇవాల్వెన్స్‌ ఇండియా ఫండ్‌, సోమర్‌సెట్‌ ఇండస్‌ హెల్త్‌కేర్‌ ఫండ్‌ ఉన్నాయి. అంతేకాకుండా ప్రమోటర్ల నుంచి సైతం కొద్దిపాటి వాటానుచేజిక్కించుకోనుంది. వెరసి ఉజాలా సిగ్నస్‌ పేరుతో అమర్‌ ఉజాలా నిర్వహిస్తున్న సంస్థలో మొత్తం 70 శాతం వాటాను జీఏ కొనుగోలు చేయనుంది. డీల్‌ ప్రస్తుతం డాక్యుమెంటేషన్‌ స్థితిలో ఉన్నదని, కొద్ది వారాలలో పూర్తి కాగలదని తెలుస్తోంది. అయితే అటు జీఏ, ఇటు ఉజాలా సిగ్నస్‌ ప్రతినిధులు ఈ అంశాలపై స్పందించకపోవడం గమనార్హం!

ఉత్తరాదిన సర్వీసులు

ఉజాలా సిగ్నస్‌ ప్రధానంగా ఉత్తరాదిన ద్వితీయ, తృతీయస్థాయి పట్టణాలలో 19 ఆసుపత్రులను కలిగి ఉంది. హర్యానా, యూపీ, ఉత్తరాఖండ్‌, జేఅండ్‌కే, ఢిల్లీలలో మొత్తం 1,800 పడకలతో హెల్త్‌కేర్‌ సర్వీసులు విస్తరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 600 కోట్ల టర్నోవర్‌, రూ. 120 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించగలదని అంచనా. సిగ్నస్‌ మెడికేర్‌ను 2011లో డాక్టర్లు దినేష్‌ బాత్రా, షుచిన్‌ బజాజ్‌ ఏర్పాటు చేశారు. తదుపరి 2019లో అమర్‌ ఉజాలా మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. హెల్త్‌కేర్‌ రంగంలో విస్తరించే ప్రణాళికలతో 10 సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్వహిస్తున్న సంస్థలో రూ. 130 కోట్లకు నియంత్రణ వాటాను కొనుగోలు చేసింది. ఆపై ఉజాలా హెల్త్‌కేర్‌కుగల రెండు ఆసుపత్రులను సిగ్నస్‌లో విలీనం చేసింది. తద్వారా విలీన సంస్థలో నియంత్రణతోపాటు ప్రధాన వాటాను పొందింది. కాగా.. 2018లో కృష్ణా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(కిమ్స్‌ హాస్పిటల్స్‌)లోనూ జీఏ 13 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,079 కోట్లు) ఇన్వెస్ట్‌ చేసి మైనారిటీ వాటాను కొనుగోలు చేసిన విషయం విదితమే.

దలాల్‌ స్ట్రీట్‌లో శాంటాక్లాజ్‌ లాభాలు

- ఐటీ, మెటల్‌ షేర్లకు డిమాండ్‌
- సూచీలకు రెండో రోజూ లాభాలు
- మళ్లీ 71,000 పాయింట్ల పైకి సెన్సెక్స్‌
- 21,300 పాయింట్ల ఎగువకు నిఫ్టీ

ముంబై: క్రిస్మస్‌కు ముందు దలాల్‌ స్ట్రీట్‌లో శాంటాక్లాజ్‌ ర్యాలీ కనిపించింది. పతనమైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్‌ సూచీలు రెండో రోజూ లాభపడ్డాయి. ఐటీ, మెటల్‌, టెక్‌, ఆటో, ఫార్మా, రియల్టీ షేర్లు రాణించాయి. ఫలితంగా సెన్సెక్స్‌ 242 పాయింట్లు పెరిగి 71,107 వద్ద నిలిచింది. నిఫ్టీ 94 పాయింట్లు బలపడి 21,349 వద్ద స్థిరపడింది. ఉదయం స్వల్పలాభాలతో మొదలైన స్టాక్‌ సూచీలు ట్రేడింగ్‌ ఆద్యంతం తీవ్ర లాభ, నష్టాల మధ్య కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 395 పాయింట్లు లాభపడి 71,260 వద్ద, నిఫ్టీ 135 పాయింట్లు పెరిగి 21,390 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి. బ్యాంకులు, ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్‌ లభించడంతో బీఎస్‌ఈ స్మాల్‌, మిడ్‌ క్యాప్‌ షేర్లు 1.04%, 0.75% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,829 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,167 కోట్ల షేర్లు కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా(ఎంపీఎస్‌) కల్పించే అంశంలో పదేళ్ల గడువు లభించడంతో ఎల్‌ఐసీ షేరు 4% పెరిగి రూ.793 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 7% పెరిగి రూ.820 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. షేరు నాలుగు లాభపడంతో కంపెనీ మార్కెట్‌ విలువ ఒక్క రోజులో రూ.18,057 కోట్లు పెరిగి రూ.5.01 లక్షల కోట్లకు చేరింది.
- ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో ఐటీ షేర్లు రాణించాయి. విప్రో 6.55%, పెర్సిస్టెంట్‌ సిస్టమ్స్‌ 4%, ఎంఫసీస్‌, హెచ్‌సీఎల్‌ టెక్‌ 3%, కోఫోర్జ్‌ 2.50%, ఎల్‌అండ్‌టీఎం, టెక్‌ మహీంద్రా, ఇన్ఫోసిస్‌ ఒకటిన్నర శాతం, ఎల్‌టీటీఎస్‌, టీసీఎస్‌ షేర్లు ఒకశాతం చొప్పున లాభపడ్డాయి.
- స్టాక్‌ మార్కెట్‌ వరుస 3 రోజులు పనిచేయదు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు కాగా, సోమవారం(డిసెంబర్‌ 25న) క్రిస్మస్‌ సందర్భంగా ఎక్స్ఛేంజీలు పనిచేయవు. ట్రేడింగ్‌ తిరిగి మంగళవారం యథావిధిగా ప్రారంభం అవుతుంది.
- అజాద్‌ ఇంజనీరింగ్‌ ఐపీఓకు 80.60 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.01 కోట్ల ఈక్విటీలు జారీ చేయగా మొత్తం 81.58 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఐబీ కోటా 179.66 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగం 87.55 రెట్లు, రిటైల్‌ ఇన్వెస్టర్ల విభాగం 23.71 రెట్లు సబ్‌స్క్రయిబ్‌ అయ్యింది.
- కెనడియన్‌ బిలియనీర్‌ ప్రేమ్‌ వాట్సా గ్రూప్‌ ఫెయిర్‌ఫాక్స్‌ గ్రూప్‌.., ఐఐఎఫ్‌ఎల్‌ ఫైనాన్స్‌ సంస్థలో 5.7% వాటాను దక్కించుకుంది. ఓపెన్‌ మార్కెట్‌ ద్వారా ఎఫ్‌ఐహెచ్‌ మారిషస్‌ ఇన్వెస్ట్‌మెంట్స్‌ లిమిటెడ్‌ నుంచి ఐఐఎఫ్‌ఎల్‌ ఫైనాన్స్‌కు చెందిన 2.16 కోట్ల ఈక్విటీల(5.7% వాటా)ను రూ.1,198 కోట్లకు కొనుగోలు చేసినట్లు బల్క్‌డీల్‌ డేటా తెలిపింది. ఈ లావాదేవీ తర్వాత ఐఐఎఫ్‌ఎల్‌ ఫైనాన్స్‌ షేరు 4% నష్టపోయి రూ.573 వద్ద స్థిరపడింది.

ధర పెరిగినా... ఆభరణాల డిమాండ్‌ 'బంగారమే'!


- 2023–24లో వినియోగం విలువ అంచనాలు అప్‌
- 10–12 శాతానికి పెంచిన ఇక్రా
- ధరలు ఎగబాకుతాయని విశ్లేషణ



ముంబై: ధరలు పెరిగినప్పటికీ పసిడి ఆభరణాలకు డిమాండ్‌ తగ్గడం లేదని తాజా నివేదిక ఒకటి పేర్కొంది. బంగారం ఆభరణాల వినియోగం.. విలువ పరంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) 10 నుంచి 12 శాతం పెరుగుతుందని రేటింగ్‌ ఏజెన్సీ ఇక్రా- నివేదిక పేర్కొంది. ఇంత క్రితం వేసిన 8 నుంచి 10 శాతం అంచనాలను ఈ మేరకు ఎగువముఖంగా సవరించింది. పసిడి ధరల పెరుగుదలే దీనికి కారణమని వివరించింది. 2023–24 మొదటి ఆరునెలల కాలాన్ని (ఏప్రిల్‌–సెప్టెంబర్‌) 2022–23 ఇదే కాలంతో పరిశీలిస్తే ఆభరణాల వినియోగం విలువ 15 శాతానికి పైగా పెరిగినట్లు నివేదిక పేర్కొంది. బంగారం కొనుగోళ్లకు శుభప్రదంగా భావించే 'అక్షయ తృతీయ' సమయంలో స్థిరమైన డిమాండ్‌, అధిక బంగారం ధరలు దీనికి కారణంగా పేర్కొంది. అయితే ద్వితీయార్థంలో ఈ శాతం 6 నుంచి 8 శాతమే ఉంటుందని అభిప్రాయపడింది. గ్రామీణ డిమాండ్‌ మందగమనం, ద్రవ్యోల్బణం తీవ్రత తమ అంచనాలకు కారణమని పేర్కొంది. నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే..

- డిసెంబర్‌ 2022–ఏప్రిల్‌ 2023 మధ్య అస్థిరత కొనసాగిన బంగారం ధరలు, 2023–24 మొదటి అర్థభాగంలో (ఏప్రిల్‌–సెప్టెంబర్‌) స్థిరంగా ఉన్నాయి. అయితే క్రితం సంవత్సరం సగటు ధరలతో పోలిస్తే 14 శాతం పెరిగాయి.
- పెరిగిన ధరలు.. పలు ఆభరణాల రిటైలర్ల ఆదాయ పటిష్టతకు దోహదపడ్డాయి.
- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, ప్రపంచ స్థూల ఆర్థిక అనిశ్చిత పరిస్థితులతో సమీప కాలంలో బంగారం ధరలు పెరిగే అవకాశాలే ఉన్నాయి.
- అక్టోబర్‌ 2023 ప్రారంభం నుండి బంగారం ధరల పెరుగుదల, స్థిరంగా కొనసాగుతున్న ద్రవ్యోల్బణం తీవ్రతవల్ల యల్లో మెటల్‌ ఆభరణాల డిమాండ్‌ కొంత తగ్గవచ్చు.

సాక్షి స్పోర్ట్స్‌



క్రికెట్‌కు ఎల్గర్‌ గుడ్‌బై... భారత్‌తో టెస్టు సిరీసే చివరిది

దక్షిణాఫ్రికా సీనియర్‌ బ్యాటర్‌, మాజీ కెప్టెన్‌ డీన్‌ ఎల్గర్‌ టెస్టు క్రికెట్‌ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌ తనకు చివరిది కానుందని అతను వెల్లడించాడు. తనకు ఇష్టమైన కేప్‌టౌన్‌ మైదానంలోనే కెరీర్‌ ముగించాలని నిర్ణయించుకున్నట్లు ఎల్గర్‌ చెప్పాడు. 2012లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన ఎల్గర్‌ తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలోనూ 'డకౌట్‌' అయిన అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఆ తర్వాత ఓపెనర్‌గా సత్తా చాటి దక్షిణాఫ్రికా విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఎల్గర్‌ 84 టెస్టుల్లో 47.38 సగటుతో 5146 పరుగులు చేశాడు. ఇందులో 13 సెంచరీలు ఉన్నాయి. 17 టెస్టుల్లో దక్షిణాఫ్రికాకు కెప్టెన్‌గా వ్యవహరించిన అతను 9 మ్యాచ్‌లలో జట్టును గెలిపించాడు. ఎల్గర్‌ 8 వన్డేల కెరీర్‌ 2018లోనే ముగిసింది.

స్వదేశానికి కోహ్లి

- వ్యక్తిగత కారణాలతో వెనక్కి
- తొలి టెస్టులోగా మళ్లీ దక్షిణాఫ్రికాకు



సెంచూరియన్‌: రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన భారత స్టార్‌ బ్యాటర్‌ విరాట్‌ కోహ్లి దక్షిణాఫ్రికా నుంచి అనూహ్యంగా స్వదేశానికి తిరిగి బయల్దేరాడు. 'వ్యక్తిగత కారణాలతో' కోహ్లి వెనక్కి వచ్చినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. కోహ్లి ఇంటికి వెళ్లడంపై స్పష్టమైన కారణం ఏమిటో తెలియకపోయినా... ఈ విషయంపై అతను ముందే బీసీసీఐ అనుమతి తీసుకున్నట్లు సమాచారం. గురువారమే కోహ్లి భారత్‌కు బయల్దేరాడు. ఇది ముందే నిర్ణయించుకున్నది. అందుకే అతను భారత్‌, దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య జరిగిన మూడు రోజుల ఇంట్రా స్క్వాడ్‌ మ్యాచ్‌లో కూడా ఆడలేదు' అని బోర్డు ప్రతినిధి ఒకరు చెప్పారు. అయితే ఈ నెల 26 నుంచి జరిగే తొలి టెస్టు సమయానికి అతను మళ్లీ దక్షిణాఫ్రికాకు చేరుకుంటాడని, మ్యాచ్‌ కూడా ఆడతాడని ఆయన స్పష్టం చేశారు.

రుతురాజ్‌ అవుట్‌

మరోవైపు ఓపెనర్‌ రుతురాజ్‌ గైక్వాడ్‌ చేతి వేలి గాయం కారణంగా టెస్టు సిరీస్‌ నుంచి తప్పుకున్నాడు. రుతురాజ్‌ స్థానంలో సెలక్టర్లు ఎవరినీ అధికారికంగా ఎంపిక చేయకపోయినా... భారత 'ఎ' జట్టు తరఫున ఆడుతూ దక్షిణాఫ్రికాలో ఉన్న అభిమన్యు ఈశ్వరన్‌ను స్టాండ్‌బైగా సిద్ధంగా ఉండాలని చెప్పినట్లు సమాచారం.

టైటాన్స్‌కు తొలి గెలుపు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్‌ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్‌ జట్టు ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. శుక్రవారం జరిగిన తమ ఆరో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌ 37–36తో ఒక పాయింట్‌ తేడాతో హరియాణా స్టీలర్స్‌ జట్టుపై నెగ్గింది. టైటాన్స్‌ తరఫున కెప్టెన్‌ పవన్‌ సెహ్రావత్‌ అత్యధికంగా 10 పాయింట్లు స్కోరు చేశాడు. ఇతర ప్లేయర్లు అజిత్‌ పవార్‌ 7 పాయింట్లు, సందీప్‌ 5 పాయింట్లు, ప్రఫుల్‌ 4 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్‌ 46–33తో తమిళ్‌ తలైవాస్‌ను ఓడించింది.



స్మృతి



జెమీమా రోడ్రిగ్స్‌



దీప్తి శర్మ

మన బ్యాటర్లూ అదరగొట్టారు

- స్మృతి, జెమీమా రోడ్రిగ్స్‌, రిచా, దీప్తి శర్మ అర్ధ సెంచరీలు
- భారత్‌కు 157 పరుగుల ఆధిక్యం
- ఆస్ట్రేలియా మహిళలతో ఏకైక టెస్టు

ముంబై: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఏకైక టెస్టులో భారత మహిళల హవా రెండో రోజూ కొనసాగింది. వాంఖెడే మైదానంలో తొలి రోజు పదునైన బౌలింగ్‌తో ఆసీస్‌ మహిళలను కట్టడి చేసిన మన జట్టు శుక్రవారం బ్యాటింగ్‌లోనూ చెలరేగి భారీ ఆధిక్యాన్ని అందుకుంది. మ్యాచ్‌ రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 119 ఓవర్లలో 7 వికెట్లకు 376 పరుగులు చేసింది. దాంతో ప్రస్తుతానికి భారత్‌కు 157 పరుగుల ఆధిక్యం లభించింది. స్మృతి మంధాన (106 బంతుల్లో 74; 12 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్‌ (121 బంతుల్లో 73; 9 ఫోర్లు), దీప్తి శర్మ (147 బంతుల్లో 70 నాటౌట్‌; 9 ఫోర్లు), రిచా ఘోష్‌ (104 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. ఆసీస్‌ బౌలర్లలో ఆఫ్‌ స్పిన్నర్‌ యాష్లీ గార్డ్‌నర్‌ 4 వికెట్లు పడగొట్టింది. ప్రస్తుతం క్రీజ్‌లో దీప్తితో పాటు పూజ వస్త్రకర్‌ (115 బంతుల్లో 33 బ్యాటింగ్‌; 4 ఫోర్లు) ఉంది. వీరిద్దరు ఇప్పటికే ఎనిమిదో వికెట్‌కు అభేద్యంగా 102 పరుగులు జోడించడం విశేషం. శుక్రవారం ఆట మొత్తం 100 ఓవర్ల పాటు సాగగా, గార్డ్‌నర్‌ ఒక్కతే 36 ఓవర్లు వేసింది.

స్మృతి రనౌట్‌...

ఓవర్‌నైట్‌ స్కోరు 98/1తో భారత్‌ రెండో రోజు ఆట కొనసాగించింది. స్నేహ్‌ రాణా (9) ఎక్కువ సేపు నిలవలేకపోగా, 68 బంతుల్లో స్మృతి అర్ధ సెంచరీ పూర్తయింది. ఆపై కొన్ని చక్కటి షాట్లు ఆడిన స్మృతి స్వయంకృతంతో వెనుదిరిగింది. గార్డ్‌నర్‌ బౌలింగ్‌లో బ్యాక్‌వర్డ్‌ పాయింట్‌ దిశగా ఆడి సింగిల్‌కు ప్రయత్నించింది. అయితే రిచాతో సమన్వయలోపంతో పరుగు ఆలస్యం కావడంతో నాన్‌స్ట్రయికింగ్‌ ఎండ్‌లో రనౌటైంది. అనంతరం రిచా, జెమీమా భాగస్వామ్యం భారత్‌ను మెరుగైన స్థితికి చేర్చింది. తొలి సెషన్‌లో భారత్‌ 2 వికెట్లు కోల్పోయి 95 పరుగులు జోడించింది.

భారీ భాగస్వామ్యాలు...

లంచ్‌ తర్వాత ఇన్నింగ్స్‌ 63వ ఓవర్లో గార్డ్‌నర్‌ బౌలింగ్‌లో రిచా కొట్టిన ఫోర్‌తో భారత్‌ ఆధిక్యంలోకి వెళ్లింది. జెమీమా 86 బంతుల్లో, కెరీర్‌లో తొలి టెస్టు ఆడుతున్న రిచా 98 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే రిచాను గార్త్‌ అవుట్‌ చేయడంతో ఈ భాగస్వామ్యానికి తెర పడింది. జెమీమా, రిచా నాలుగో వికెట్‌కు 113 పరుగులు జత చేశారు. అనంతరం చెలరేగిన గార్డ్‌నర్‌ తన వరుస ఓవర్లలో హర్మన్‌ప్రీత్‌ (0), యస్తిక (1)లను పెవిలియన్‌కు పంపడంతో పాటు కొద్ది సేపటికే జెమీమాకు కూడా అవుట్‌ చేసింది. 14 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోవడంతో 274/7 వద్ద భారత్‌ ఇన్నింగ్స్‌ ముగిసేందుకు ఎంతో సేపు పట్టదనిపించింది. అయితే దీప్తి, పూజ భిన్నంగా ఆలోచించారు. చివరి సెషన్‌లో పట్టుదలగా నిలబడి పరుగులు సాధిస్తూ ఆసీస్‌ బౌలర్లను చికాకు పెట్టారు. దీప్తి తన బ్యాటింగ్‌ ప్రతిభను ప్రదర్శించగా... బౌలింగ్‌లో చెలరేగిన పూజ బ్యాటింగ్‌లోనూ మంచి డిఫెన్స్‌తో దీప్తికి అండగా నిలిచింది. ఈ క్రమంలో 115 బంతుల్లో దీప్తి హాఫ్‌ సెంచరీని అందుకుంది. కెరీర్‌లో నాలుగో టెస్టు ఆడుతున్న దీప్తి ప్రతీ టెస్టులోనూ అర్ధసెంచరీ చేయడం విశేషం. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్‌ ఎనిమిది బౌలర్లతో ఎంతగా శ్రమించినా లాభం లేకపోయింది. 38 ఓవర్ల సెషన్‌లో భారత్‌ 100 పరుగులు సాధించగా, ఆసీస్‌ ఒక్క వికెట్‌ కూడా తీయలేకపోయింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌: 219; భారత్‌ తొలి ఇన్నింగ్స్‌: షఫాలీ (ఎల్బీ) (బి) జొనాసెన్‌ 40; స్మృతి (రనౌట్‌) 74; స్నేహ్‌ రాణా (బి) గార్డ్‌నర్‌ 9; రిచా (సి) గార్డ్‌నర్‌ (బి) గార్త్‌ 52; జెమీమా (సి) సదర్లాండ్‌ (బి) గార్డ్‌నర్‌ 73; హర్మన్‌ప్రీత్‌ (ఎల్బీ) (బి) గార్డ్‌నర్‌ 0; యస్తిక (ఎల్బీ) (బి) గార్డ్‌నర్‌ 1; దీప్తి శర్మ (బ్యాటింగ్‌) 70; పూజ (బ్యాటింగ్‌) 33; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (119 ఓవర్లలో 7 వికెట్లకు) 376. వికెట్ల పతనం: 1–90, 2–140, 3–147, 4–260, 5–261, 6–265, 7–274. బౌలింగ్‌: లారెన్‌ 9–3–23–0, గార్త్‌ 10–1–49–1, పెరీ 4–0–31–0, గార్డ్‌నర్‌ 41–7–100–4, జొనాసెన్‌ 18–4–42–1, సదర్లాండ్‌ 8–2–20–0, అలానా 19–1–69–0, తహీలా 10–2–22–0.

నాకొద్దీ 'పద్మశ్రీ'...

పౌర పురస్కారాన్ని వెనక్కి ఇచ్చిన స్టార్‌ రెజ్లర్‌ బజరంగ్‌	రెజ్లింగ్‌ సమాఖ్య అధ్యక్షుడి ఎన్నికపై కొనసాగుతున్న నిరసన	'పద్మశ్రీ' తిరిగిచ్చేయడం బజరంగ్‌ వ్యక్తిగత నిర్ణయమన్న క్రీడాశాఖ





న్యూఢిల్లీ: దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన భారత స్టార్‌ రెజ్లర్ల నుంచి మరో తీవ్రమైన నిర్ణయం వెలువడింది. భారత రెజ్లింగ్‌ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఎన్నికల ఫలితాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రెజ్లర్లు ఆటకు వీడ్కోలు పలకడం, ప్రతిష్టాత్మక పౌర పురస్కారాలను వెనక్కి ఇచ్చేయడం చేస్తున్నారు. ఇది భారత క్రీడాలోకానికి మచ్చగా మిగలడం ఖాయం! డబ్ల్యూఎఫ్‌ఐలో తిష్ట వేసుక్కూర్చున్న వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ చెరలోనే రెజ్లింగ్‌ సమాఖ్య కొనసాగనుండటం, ఆయన వీర విధేయుడు సంజయ్‌ సింగ్‌ ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడిగా గెలవడంతో గురువారం రియో ఒలింపిక్స్‌ కాంస్య విజేత సాక్షి మలిక్‌ రిటైర్మెంట్‌ ప్రకటించింది. శుక్రవారం తాజాగా టోక్యో ఒలింపిక్స్‌ కాంస్య పతక విజేత బజరంగ్‌ పూనియా భారత ప్రభుత్వం 2019లో ఇచ్చిన పౌర పురస్కారం 'పద్మశ్రీ'ని వెనక్కి ఇచ్చేశాడు. బజరంగ్‌ పార్లమెంట్‌ వైపు వెళ్తుండగా కర్తవ్యపథ్‌ వద్ద ఢిల్లీ పోలీసులు అతన్ని అడ్డుకున్నారు. దీంతో అక్కడి రోడ్డుమీదే పురస్కారాన్ని ఉంచి తన నిరసన లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి చేరేలా చూడాలని పోలీసు అధికారుల్ని బజరంగ్‌ వేడుకొని అక్కడి నుంచి నిష్క్రమించాడు. 'ప్రధాని మోదీకి నేను పద్మశ్రీని తిరిగి ఇచ్చేస్తున్నా. ఈ లేఖే నా ఆవేదనగా భావించాలి' అని సోషల్‌ మీడియా 'ఎక్స్‌'లో పేర్కొన్నాడు. ఇక ఆ లేఖలో ఏముందంటే... 'మోదీజీ మీరు బిజీగా ఉంటారని తెలుసు. అలాగే గత కొన్నాళ్లుగా మహిళా రెజ్లర్లు పడుతున్న పాట్లు, బ్రిజ్‌భూషణ్‌ నుంచి ఎదుర్కొంటున్న వేధింపులు మీకు తెలుసు. దీనిపై మేం రెండుసార్లు రోడ్డెక్కి నిరసించాం. న్యాయం చేస్తామన్న ప్రభుత్వ హామీతో మా దీక్షను విరమించాం. ముందుగా అసలు ఎఫ్‌ఐఆర్‌ కూడా నమోదు చేయలేదు. తాత్సారం తర్వాతే కేసు నమోదు చేశారు. మొదట్లో బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా 19 మంది మహిళా రెజ్లర్లు స్టేట్‌మెంట్‌ ఇస్తే తదనంతరం ఈ సంఖ్య ఏడుగురికి పడిపోయింది. దీంతో అతని పలుకుబడి ఏ రకంగా శాసిస్తుందనేది అర్థమైంది. ఇప్పుడు మళ్లీ ఆయన వర్గమే రెజ్లింగ్‌ సమాఖ్యకు కొత్తగా ఎన్నికైంది. దీనికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నాను' అని బజరంగ్‌ లేఖలో వివరించాడు. మరోవైపు బజరంగ్‌ 'పద్మశ్రీ'ని తిరిగిస్తుంటే కేంద్ర క్రీడాశాఖ తేలిగ్గా తీసుకున్నట్లుంది. వెనక్కి ఇవ్వడమనేది అతని వ్యక్తిగత నిర్ణయమని తెలిపింది. రెజ్లింగ్‌ ఎన్నికల్ని ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించారని... అయినప్పటికీ బజరంగ్‌ను తన నిర్ణయం మార్చుకోవాలని కోరతామని అని క్రీడాశాఖ అధికారి ఒకరు తెలిపారు.

విండీస్‌దే టి20 సిరీస్‌



తరూబా (ట్రినిడాడ్‌): సొంతగడ్డపై వెస్టిండీస్‌ జట్టు వన్డే, టి20ల్లో ఇంగ్లండ్‌పై పైచేయి సాధించింది. ఇంతకుముందే వన్డే సిరీస్‌ను గెలుచున్న విండీస్‌ ఇప్పుడు టి20 సిరీస్‌నూ 3–2తో తమ ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో రోవ్‌మన్‌ పావెల్‌ కెప్టెన్సీలోని వెస్టిండీస్‌ నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ముందుగా ఇంగ్లండ్‌ 19.3 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. ఫిల్‌ సాల్ట్‌ (22 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్‌) టాప్‌ స్కోరర్‌గా నిలవగా... 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' గుడకేశ్‌ మోతీ (3/24) ఇంగ్లండ్‌ను కట్టడి చేశాడు. అనంతరం విండీస్‌ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 133 పరుగులు సాధించింది. షై హోప్‌ (43 బంతుల్లో 43 నాటౌట్‌; 2 ఫోర్లు, 1 సిక్స్‌) రాణించాడు.